మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

రేవంత్‌రెడ్డి పాసా? ఫెయిలా? తెలంగాణ ఏమంటున్నది!
తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్‌టిసి కార్మికుల పాత్ర మరువలేనిది
ఫ్రాన్స్‌లో కుప్పకూలిన బార్నియర్ ప్రభుత్వం
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 10 | శుక్రవారం | 06-12-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## నిప్పులు చిమ్ముతూ నింగికి..



61సార్లు అంతరిక్షంలోకి వెళ్ళిన పిఎస్ఎల్‌వి
ఇఎస్ఎ ప్రోబా– 3 జంట ఉపగ్రహాల ప్రయోగం విజయవంతం
ప్రాజెక్టు టీముకు ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభినందనలు



**శ్రీహరికోట :** సూర్యగోళం అంచు (రిమ్)ను, బాహ్యాపొరను పరిశోధించేందుకు ఉద్దేశించిన ప్రోబా–3 (ప్రాజెక్ట్ ఫర్ ఆన్‌బోర్డ్ అనాటమీ) జంట ఉపగ్రహాలను ఇస్రో గురువారంనాడు విజయవంతంగా ప్రయోగించింది. అంతరిక్ష నౌక ప్రోబాను మోసుకెళ్ళే వాహకనౌక పిఎస్ఎల్‌వి–సి 59 రాకెట్ 18 నిమిషాలసేపు ప్రయాణంచేసి జంట ఉపగ్రహాలను నిర్దేశిత ప్రదేశంలో వదిలిపెట్టిందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. యూరోపియన్ స్పేస్ ఏజన్సీ (ఇఎస్ఎ) ఈ సౌర ప్రయోగాన్ని చేపట్టింది. ముందుగా అనుకున్న దానికంటే ఒకరోజు ఆలస్యంగా ఈ ప్రోబా–3 ప్రయోగం జరిగింది. గురువారం ఉదయం 8.05 గంటలకు సవరించిన కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 44.5 మీటర్ల పొడవుగల పిఎస్ఎల్‌వి–సి59 రాకెట్ సాయంత్రం 4.04 గంటలకు 61వ సారి నింగిలోకి దూసుకుపోయి 18 నిమిషాల్లో గమ్యం చేరింది. ఈ జంట ఉపగ్రహాలు విజయవంతంగా వేరుపడ్డాయి. రాబోయే నెలల్లో బెల్జియంలో ఉన్న యూరోపియన్ స్పేస్ ఏజన్సీ శాస్త్రవేత్తలు ఈ ఉపగ్రహాలను వారు కోరుకున్న విధంగా నిర్దేశిత కక్ష్యలలో ఉంచుతారు. వాహక నౌక తీసుకువెళ్ళిన రెండు ఉపగ్రహాలలో ఒకటి 310 కేజీలు బరువుగల కరోనాగ్రాఫ్ కాగా, మరొకటి 240 కేజీలు బరువుగల ఆక్యుల్టర్ ఉపగ్రహం. ఈ రెండింటినీ కలిపి ప్రోబా–3గా పిలుస్తున్నారు. 'ప్రోబా' అంటే లాటిన్‌భాషలో ''ప్రయత్నిద్దాం'' అని అర్థం. ఈ రెండూ ఒకటిగానే సంచరిస్తాయి. సూర్యుడి వెలుపలి వాతావరణపొర కరోనాను అధ్యయనం చేసేందుకు ఈ రెండూ దోహదం చేస్తాయి. ప్రోబా–3 ప్రయోగానంతరం సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్‌లో శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. ''ఉపగ్రహాలు రెండూ నిర్దేశిత ప్రదేశాలకు చేరుకున్నాయి. భూమికి దాదాపు 600 కి.మీ దూరంగా చాలా ఎత్తున ఉన్న అండాకార పరిభ్రమణ అంతరిక్ష కక్ష్యలో ఈ రెండు ఉపగ్రహాలను ప్రవేశపెట్టాం. గ్రహాలు సంచరించే అంతరిక్ష వలయంలో భూమితో అనుసంధానం కొనసాగిస్తూనే వీలైనంత దాదాపు ఎక్కువదూరంలో అంటే 60,000 కిమీల సమీపదూరంలో 59 డిగ్రీల కోణంలో వీటిని ఉంచాం, పిఎస్ఎల్‌వి (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్) వాహకనౌక ఈ విధంగా ఇప్పటివరకూ 61 సార్లు అంతరిక్షంలోకి ప్రయాణించి వివిధ ఉపగ్రహాలను వేరువేరు కక్ష్యలలోకి ప్రవేశపెట్టిన ఘనత సాధించింది. అందువల్ల

తరువాయి 2లో

# పెద్దరికాన్ని నిలబెట్టుకోండి



మీ పిల్లలకు బుద్ధిచెప్పి నియంత్రణలో పెట్టండి
మాజీసిఎం కెసిఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హితవు
కెటిఆర్, హరీశ్‌రావులు 'మారీచ సుబాహుల్లా, రాహు కేతువులా వ్యవహరిస్తే చట్టం తనపని తాను చేసుకుంటూ ముందుకెళ్తుందని హెచ్చరిక
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పేదలకు నష్టం జరగకుండా విధివిధానాలు రూపొందించాం
గ్రీన్ ఛానల్ ద్వారా రూ.5 లక్షలు అందజేస్తాం
ప్రతి నియోజకవర్గానికీ 3,500లు, తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ఆవిష్కరణలో సిఎం ప్రకటన




ప్రజాపక్షం/హైదరాబాద్

అర్హులైన నిరుపేదల ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఎంపికలో పేదలకు ఎటువంటి నష్టం, అన్యాయం జరగకుండా ఉండేందుకు విధివిధానాలను రూపొందించామని, గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందజేస్తామని వెల్లడించారు. బిఆర్ఎస్ తమ పదేళ్ల కాలంలో చేయలేని పనులను, తాము ఏడాదిలోనే చేస్తుంటే, నిర్మాణాత్మకమైన సూచనలు చేయాల్సిన ప్రధానప్రతిపక్ష నేత కెసిఆర్ , వారి పిల్లలను( కెటిఆర్,హరీశ్‌రావు) ప్రభుత్వంపైకి ఉసిగొల్పారని, అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు వారు 'మారీచ సుబాహుల్లా, రాహు కేతువులా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యమ నాయకునిగా, రాష్ట్ర, కేంద్ర మంత్రిగా సిఎంగా అనుభవం ఉన్న కెసిఆర్, తమ పిల్లలకు బుద్ధి చెప్పి, నియంత్రణలో పెట్టాలని, తద్వారా కెసిఆర్ తన పెద్దరికాన్ని కాపాడుకోవాలని సిఎం హితవుపలికారు. వారిద్దరూ ఇలాగే (కెటిఆర్,హరీశ్‌రావు) ఎటమటంగా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకెళ్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కెసిఆర్ మానసిక పరివర్తనలో మార్పు రావాల్సి ఉన్నదన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో 'ఇందిరమ్మ ఇండ్ల'మొబైల్ యాప్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, మహ్మద్ షబ్బీర్ అలీ, టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

తరువాయి 2లో

### ఐటిడిఎ ప్రాంతాలకు ప్రత్యేక కోటా

రాష్ట్ర వ్యాప్తంగా ఐటిడిఎ పరిధిలోని గిరిజనులకు ప్రత్యేక కోటాను, నిధులను కేటాయిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నల్లమల్లలోని చెంచులు, ఆదిలాబాద్‌లోని గోండులు, భద్రాచలంలోని కోయలు ఇలా తెలంగాణ మట్టి మనుషులు, మూల పురుషుల్లో వారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. ఇంద్రవెల్లికి తాను అల్లుడని చెప్పుకునే కెసిఆర్ ఆ గ్రామంలో ఇంటినిర్మాణం చేస్తానని హామీనిచ్చి విస్మరించారని, కానీ తాను అక్కడ ఐదు వేల గృహాలను అందజేసిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఈ నమూనానే పాటించాలనే నిబంధన ఏమీలేదని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలలంలో ఒక నమూనాతో కూడిన ఇందిరమ్మ ఇంటిని నిర్మిస్తామని, ఈ నమూనా నచ్చితే ఎవరైనా నిర్మించుకోవచ్చని సూచించారు.

## పోషకాలతో కూడిన భోజనం పెట్టాలి



ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం జారీ

**హైదరాబాద్ :** ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత నెల మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించిన ఘటనలో 6 వారాల్లో నివేదిక సమర్పించాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధె, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ పేర్కొన్న మూడు ఘటనలే కాకుండా మరో రెండు ఘటనలు ప్రభుత్వం దృష్టికి

తరువాయి 2లో

## టిజిపిఎస్‌సి చైర్మన్‌గా బుర్రా వెంకటేశం బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిపిఎస్‌సి కమిషన్ పట్ల అభ్యర్థుల్లో పూర్తి విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ప్రణాళిక బద్ధంగా ప్రతీ పరీక్షా నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాసభరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్‌ను వదులుకుని తాను టిజిపిఎస్‌సి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలన్నారు. టిజిపిఎస్‌సిలో తాము ఉద్యోగాలను

తరువాయి 2లో





## హరీశ్‌రావు అరెస్టు... విడుదల

పోలీసుల అదుపులో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి
గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ వద్ద బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆందోళన

ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి ప్రతినిధి

మాజీ మంత్రి హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు గురువారం ఉదయం అదుపులోనికి తీసుకుని రాత్రి వదిలిపెట్టారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. హరీశ్‌రావును వదిలిపెట్టాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అంతకు ముందు మాజీ మంత్రులు హరీశ్‌రావు , జగదీశ్ రెడ్డితో పాటు బిఆర్ఎస్ కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి ప్రవేశించేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇంటి గేట్లు దూకి వెళ్లేందుకు కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి హరీశ్‌రావును పోలీసులు తరలించేందుకు ప్రయత్నించగా పోలీసు వాహనాన్ని కార్యకర్తలు

తరువాయి 2లో

### మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉండాలి

ఇందిరా మహిళాశక్తి బజార్‌ను ప్రారంభించిన గవర్నర్, సిఎం

03



## పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ వ్యతిరేకం

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్




ప్రజాపక్షం/హైదరాబాద్

కొంత మంది బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని, వారు తమ పార్టీలో చేరే అవకాశం ఉందని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ వ్యతిరేకమని, ఎవరైనా ఇష్టపడి తమకు తాము వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటే చేర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆదిలాబాద్ మాజీ ఎంపి సోయం బాపూరావు,

తరువాయి 2లో



## దేవేంద్రుడి పట్టాభిషేకం

మహారాష్ట్ర 18వ సిఎంగా ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం
డిప్యూటీ సిఎంలుగా ఏక్‌నాథ్‌షిండే, అజిత్‌పవార్ కూడా...

**ముంబయి :** మహారాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. దేవేంద్ర ఫడ్నవీస్ సిఎంగా ప్రమాణం చేయడం ఇది మూడోసారి కావడం విశేషం. అనంతరం శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, ఎన్‌సిపి నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. ముంబయి ఆజాద్ మైదాన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియా, రాందాస్ అథవాలే, బిజెపి అధ్యక్షుడు

తరువాయి 2లో

## నేడు 'శంభు నుండి ఢిల్లీ'కి..

101మందితో రైతుల జాతా 'కవాతు షురూ'
రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ వెల్లడి
ఒంటి గంటకు జాతా బయల్దేరుతుందని ప్రకటన
ప్రభుత్వం జాతాను అడ్డుకుంటే రైతులకు 'నైతిక విజయమే'



**చండీగఢ్ :** దేశ వ్యాప్తంగా రైతుల నిరసన ఉధృతి తీవ్రరూపం దాల్చుతోంది. 101మంది రైతులతో కూడిన ఒక జాతా శుక్రవారం శంభు సరిహద్దు నిరసన స్థలం నుంచి ఢిల్లీకి ప్రదర్శనగా సాగనుంది. రైతుల నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ ఈ విషయాన్ని చెప్పారు. శుక్రవారం ఒంటిగంటకు ఈ జాతా బయల్దేరుతుందని గురువారం నాడు శంభు సరిహద్దు వద్ద పంధేర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు.'రైతుల జాతా ఢిల్లీ వైపు సాగుతోంది. ఏం చేయదలచుకుందో ప్రభుత్వమే ఆలోచించుకోవాలి. మేం మా మార్చ్‌ను శుక్రవారం ఒంటిగంటకు శంభు సరిహద్దు నుంచి ఢిల్లీవైపునకు ప్రారంభిస్తాం' అని సర్వన్‌సింగ్ పంధేర్ చెప్పారు.ఆయన మాట్లాడుతూ 'ఒకవేళ ప్రభుత్వం తమ మార్చ్ ముందుకు సాగకుండా ఆపివేసినట్లయితే రైతులకు అది ఒక 'నైతిక విజయమే' అవుతోంది' అని పంధేర్ తెలిపారు. 'రైతులు ట్రాక్టర్ ట్రాలీలను ఈ కార్యక్రమానికి తీసుకురాకుంటే అభ్యంతరం

తరువాయి 12లో

## కాళేశ్వరం నీరు లేకున్నా.. సాగు భళా

పెరిగిన సాగు విస్తీర్ణం.. ధాన్యం దిగుబడిలో రికార్డు
కృష్ణా, గోదావరి జలాల వాటాలపై పంతం
ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేసే లక్ష్యం



ప్రజాపక్షం / హైదరాబాద్

వ్యవసాయ ప్రాధాన్యతకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే సాగునీటి రంగంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే కృష్ణా జలాల పంపిణీలో న్యాయంగా రాష్ట్రానికి రావాల్సిన వాటాను సాధించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. బిఆర్ఎస్ హయాంలో పదేండ్లలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన లోటుపాట్లు, విధ్వంసకర పరిస్థితులపై ప్రజా ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రం సమర్పించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం లక్ష కోట్ల రూపాయలతో అప్పటి ప్రభుత్వం నిర్మించి కాళేశ్వరంలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు కుంగిపోయిన తీరుపై ప్రజా ప్రభుత్వం అసెంబ్లీలోనే చర్చకు పెట్టింది. నీటిపారుదల రంగంలో పదేండ్లలో పెట్టిన ఖర్చులు, తెచ్చిన అప్పులు, ఆయకట్టు తీరుతెన్నులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ ను

తరువాయి 12లో

# ఫ్రాన్స్‌లో కుప్పకూలిన బార్నియర్ ప్రభుత్వం

## పార్లమెంటులో నెగ్గిన లెఫ్ట్ 'అవిశ్వాస తీర్మానం'



**పారిస్ :** అందరూ ఊహించినవిధంగానే ఫ్రెంచ్ ప్రభుత్వం కుప్పకూలింది. పార్లమెంటులో వామపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం గెలిచింది. పార్లమెంటులో ఈ తీర్మానం 3312 ఓట్లతో ఆమోదం పొందడంతో ప్రధానమంత్రి మైఖేల్ బార్నియర్ (72) ప్రభుత్వం మూన్నాళ్ళముచ్చటగా మిగిలిపోయింది. బార్నియర్ ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ బిల్లు, ఆయన తీసుకున్న పొదుపు చర్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కానీ బడ్జెట్ బిల్లుపై చర్చ లేకుండా, ఓటింగ్ లేకుండా అమలుచేసి అందరిపైనా రుద్దేందుకు ప్రయత్నించిన బార్నియర్ రాజ్యాంగంలో ఉన్న విశేషాధికారాలను ఉపయోగించేందుకు ప్రయత్నించారు. దీంతో బార్నియర్‌పై వామపక్షాలు అవిశ్వాస తీర్మానం పెట్టాయి. ఆర్థికపరిస్థితి మెరుగుపడాలంటే పొదుపు చర్యలు చేపట్టాల్సిందేనని, అన్నివిధాలుగా బడ్జెట్‌లో కోతలు విధించాల్సిందేనని వాదించారు. ఈ పరిస్థితుల్లో పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ద్వారా కుప్పకూలిన బార్నియర్ ప్రభుత్వం 60 సంవత్సరాల క్రితంనాటి చరిత్రను పునరావృతం చేసింది. 1958 అక్టోబరు నాటి ఫిఫ్త్ రిపబ్లిక్ కింద రూపొందించిన రాజ్యాంగం (ప్రస్తుతంఅమలులో ఉన్న రాజ్యాంగం) ప్రకారం, ఆర్టికల్ 49.3 కింద ఓ టింగ్ లేకుండా బడ్జెట్‌ను ఆమోదించుకునే విశేషాధికారం ప్రధానమంత్రికి దఖలుపడింది. ఐతే దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల రీత్యా ఈ పొదుపు చర్యలను ప్రతిపక్షాలు ముఖ్యంగా వామపక్షాలు వ్యతిరేకించాయి. వామపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి బుధవారంనాడు పార్లమెంటు సమావేశంలో పలు పార్టీల ఎంపీలు బలపరిచారు. చివరకు మితవాద నేషనల్ ర్యాలీపార్టీ అధ్యక్షురాలు లీపెన్ కూడా అవిశ్వాస తీర్మానాన్ని సమర్థించారు. గడచిన వేసవికాలంలో ఫ్రెంచ్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాలేదు. దేశ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేట్ మేక్రాన్ వామపక్షాలను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారని అంతా భావించారు. కానీ ఆయన తనకు అనుకూలమైనవిధంగా మైఖేల్ బార్నియర్‌ను ప్రధానమంత్రిని చేశారు. అవిశ్వాస తీర్మానానికి పార్లమెంటులో అన్నివైపుల నుండీ భారీ మద్దతు లభించింది. రాజ్యాంగ నిబంధనలను గౌరవించి బార్నియర్ గురువారంనాడు ఉదయం అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మా క్రాన్‌ను కలుసుకుని తన రాజీనామా అందజేశారు. దీంతో దేశంలో చెలరేగిన ఆర్థిక గందరగోళంపై తక్షణ చర్యలు తీసుకోవడానికి దేశాధ్యక్షుడు మార్గాన్వేషణ చేయడంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో కడపటి వార్త లు అందేసరికి దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ గురువారం జాతిని ఉద్దేశించి ప్రసంగించేందుకు సిద్ధమ య్యారు. దేశ రాజకీ యాలలో స్థిరత్వం సాధించడంపై ఆయ న ప్రధా నంగా మాట్లాడతారు. ఐతే ప్రధానంగా కొత్త ప్రధాన మంత్రిని ఎవరిని ఎంపిక చేయాలనే విషయాన్ని ఆయన వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

### మేక్రాన్ రాజీనామాకు డిమాండ్

అస్తవ్యస్త నిర్ణయాలతోదేశాన్ని గందర గోళంలో పడేస్తున్న ఫ్రా న్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మే క్రాన్ కూడా రాజీ నామా చేయాలని దేశంలో డిమాండ్లు వస్తున్నాయి. మేక్రాన్‌చేత రాజీనామా చేయించి త్వరలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిపించాలని మితవాద నేషనల్ ర్యాలీపార్టీ అధ్యక్షురాలు లీపె న్ కోరుతున్నారు. తదుపరి ప్రధాన మంత్రి పదవి తనకే దక్కా లని లీపెన్ చాలా గాఢంగా వాంఛిస్తున్నారు. ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ లో నేషనల్ ర్యా లీకే ఎక్కువసీట్లు కనిపిస్తున్నాయి. మేక్రాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. "దేశాధ్యక్షుడు మేక్రాన్ తన పదవినుండి వైదొ లగితేనే సమ స్యకు పరిష్కా రం వస్తుందని, దేశం స్థిరత్వం సాధిస్తుంది" అని ఫ్రాన్స్ వామపక్ష అన్‌బౌఢ్ పార్టీ నాయకులు మాన్యు యె ల్ బంపార్డ్ వ్యాఖ్యానించారు. రాజీ నామా చేయాలన్న డిమా ండ్లపై మేక్రాన్ స్పందిస్తూ 2027 వరకూ తనకు పదవీ బాధ్యతలు న్నాయన్నారు. అలాంటి అవసరం లేదన్నారు.




# హమాస్‌తో ఇజ్రాయెల్ బందీల ఒప్పందం?

## 60 రోజులు కాల్పుల విరమణ

**టెల్‌అవీవ్ :** గాజాలో ఉన్న బందీల విడుదలకు సంబంధించి హమాస్ సంస్థతో ఇజ్రాయెల్ ఒప్పందం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు ఒక తాజా ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రతిపాదించిందని ఆ దేశ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ చెప్పారు. ఆగస్టులో చర్చించిన దశలవారీ ప్రణాళికకు కొనసాగింపుగానే ఈ కొత్త ప్రతిపాదన కూడా ఉందని ఇద్దరు ఇజ్రాయెలీ ఉన్నతాధికారులను ఉటంకిస్తూ 'యాక్సియో స్ నివేదిక' వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం 2023 అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు బందీలుగా తీసుకు వెళ్ళిన 50 మంది ఇజ్రాయెల్ స్త్రీ పురుషుల ఆరోగ్యపరిస్థితి ఏమాత్రం బాగోలేదు. వారి ఆరోగ్యాలు చాలా క్షీణదశలో ఉన్నాయి. ఐతే ఇజ్రాయె ల్ ప్రధానంగా 33 మంది బందీలను విడుదల చేయాలని కోరుతున్నది. కానీ ఈ 33 మందిలో కూడా ఎక్కువమంది సజీవంగా ఉండే అవకాశం లేదని కూడా ఇజ్రాయెల్ భావిస్తున్నది. ఉగ్రవాద దాడులతో అనేకబమంది మరణాలకు కారణమై జీవితకాలశిక్ష అనుభవిస్తున్న హమాస్‌కు చెందిన ఖైదీలతోపాటు వందలాదిమంది పాలస్తీనియన్లను జైళ్ళనుండి విడుదల చేసేందుకు ఈ ఒప్పందం ప్రకారం ఇ జ్రాయెల్ సిద్ధంగా ఉందని యాక్సియోస్ నివేదిక పేర్కొంది. గడచిన ఆదివారంనాడు జరిగిన సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహు, ఇతర సీనియర్ మం త్రులు, రక్షణవిభాగం మంత్రులు, అధికారులు ఈ ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపారు. కానీ హమాస్ మాత్రం వివక్షతో కూ డిన ఒప్పందాలకు తావిస్తోందని ఇజ్రాయెలీ అధికారులు పేర్కొన్నారు. గతంలో ప్రతిపాదన ప్రకారం 42 రోజులు కాల్పుల విరమణ అన్నారు. కానీ ఇప్పుడు తాజా ప్రతిపాదనలో 60 రోజుల కాల్పుల విరమణను ఉటంకించారు.



### ఆరుగురు బందీల మృతదేహాలపై ఇజ్రాయెల్ సందేహాలు

ఆగస్టునెలలో ఇజ్రాయెల్ ఆరుగురు బందీల మృతదేహాలను స్వాధీనం చేసుకుంది. ఐతే ఈ మృతదేహాలు గాజాలో తాము దాడులు జరిపిన ప్రదేశంలో ఉండటంపై ఇజ్రాయెల్ సైన్యం అనేక సందేహాలు వ్యక్తం చేస్తోంది. దీనిపై ఐడిఎఫ్ తాజాగా ఒక వివరణ ఇచ్చింది.ఈబందీల మరణాలపై ఇంకా దర్యాప్తు కొనసాగుతున్నదని ఐడిఎఫ్ తెలియజేసింది. తాము ఫిబ్రవరిలో గాజాలో గగనతల దాడులు చేశామని, ఐతే దాడులకు ముందుగానే ఈ బందీలను చంపి అక్కడ పడేసి ఉంటారనీ, లేదావారికి అక్కడ బంధించి ఉంటారని పలురకాల సందేహాలు ఐడిఎఫ్ వ్యక్తం చేస్తున్నది. ఫిబ్రవరిలో జరిగిన దాడుల ప్రదేశంలో ఉన్న బందీల మృతదేహాలను ఆగస్టులో ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. తమకు ఏమాత్రం అనుమానం రాకుండా హమాస్ బందీలను చంపి అక్కడ పడేసి ఉంటుందని ఇజ్రాయెల్ సైన్యం అనుమానిస్తున్నది.

### 48మంది పాలస్తీనియన్లు మృతి

ఇజ్రాయెల్ దాడుల్లో గడచిన 24 గంటల్లో 48 మంది పాలస్తీనియన్లు మరణించారు. గాజాలోని అల్ మవాసీ సేఫ్ జోన్‌లో చేసిన దాడుల్లో 21 మంది మరణించారు. డజన్లసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. నస్సెర్ ఆసుపత్రి డైరెక్టర్ అతిఫ్ అల్ హౌత్ చెప్పారు. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నాగానీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. మజ్దాల్ జౌన్ ఏరియాలో ఈ దాడులు జరిగాయి.

# ప్రతిపక్షనేతను చితకబాదిన జార్జియా పోలీసులు



**తిబ్లిసి :** జార్జియాలో పోలీసులు ప్రతిపక్ష నాయకుడు (కొయిలేషన్ ఫర్ ఛేంజ్) నికా గ్వారామియా (48)ను పోలీసులు పార్టీ కార్యాలయంలోంచి బయటకు ఈడ్చుకువచ్చి చితకబాదారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సమాయత్తమవుతున్న ప్రతిపక్షాలకు చెందిన 11 మంది నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. జార్జియాలో బలమైన నాయకుడు అలెకో ఎలిసాష్విలి కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. జార్జియావారం రోజులుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లర్లు, హింసాకాండ కొనసాగుతున్నది. జార్జియాదేశం యూరోపియన్ యూ నియన్ సభ్యత్వం తీసుకునేందుకు తిరస్కరించడంతో దేశంలో అల్లర్లు, నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. ఈ అల్లర్లకు, నిరసనలు, హింసాకాండను ప్రతిపక్షాలే రెచ్చగొడుతున్నాయని ప్రభుత్వం మొదటినుండీ వాదిస్తున్నది. ఈ అల్లర్లకు కారకులైన మూలసూత్రధారులను రోడ్డుమీద నిలబెడతామని, న్యాయస్థానం ముందుకు తెస్తామని ప్రధానమంత్రి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడు గ్వారామియాను ఆయన పార్టీ కార్యాలయం నుండి పోలీసులు బయటకు ఈడ్చుకువచ్చి చితకబాదారు. దేశరాజధాని తిబ్లిసిలో పార్లమెంటు పక్కసందులోనే ఉన్న ప్రతిపక్ష రాజకీయపార్టీ కార్యాయం నుండి గ్వారామియాను పోలీసులు చేతులూ కాళ్ళూ పట్టుకుని బయటకు ఈడ్చుకువచ్చి చితకబాదారు. ఆయనతోపాటు మరికొంతమందిని కూడా తీవ్రంగా కొట్టారు. ప్రతిపక్ష నాయకులు అందరూ ఒక హోటల్‌లో సమావేశమై సార్వత్రిక సమ్మె చేయాలిన నిర్ణయం తీసుకున్నారు. తర్వాత పోలీసులు వారిపై కూడా దాడివేశారు. జార్జియాలో ఇప్పటికే 330 మందిని అరెస్టు చేశారు. జార్జియా అధికారపార్టీని పదవిలోంచి దించేసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. అధికార డ్రీమ్‌పార్టీ రష్యా అనుకూల విధానాలు అనుసరిస్తోందని, దేశాన్ని రష్యావైపు నడిపిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. డ్రీమ్‌పార్టీ ప్రధానమంత్రి ఇరక్లీ కొబఖిడ్జే ఇటీవల యూరోపియన్ యూనియన్‌లో చేరేదిలేదని ప్రకటించారు. యూరోపియన్ యూనియన్‌కు బడ్జెట్ కేటాయింపులను కూడా 2028 వరకూ నిరవధికంగా వాయిదావేశారు.ఆతర్వాతనుండి దేశంలో అల్లర్లు ఉద్ధృతమయ్యాయి.

# హసీనా విద్వేష ప్రసంగాలను నిషేధించిన బిఐసిటి



ఢాకా : పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా చేసిన ప్రసంగాలను బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (బిఐసిటి) నిషేధించింది. భారత్‌లో గుర్తుతెలియని చోట నాలుగు నెలలుగా తలదాచుకుంటున్న హసీనా ఇటీవల బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకులు యూనుస్‌పై ప్రకటన చేశారు. యూనుస్ దేశంలో శాంతి భద్రతలను రక్షించడంలో,హిందూ మైనారిటీలకు రక్షణ ఇవ్వడంలో విఫలమయ్యారని ప్రకటన చేశారు. దీంతో పాటు ఆమె గతంలో చేసిన ప్రసంగాలన్నింటినీ విద్వేష ప్రసంగాలుగా బిఐసిటి అభివర్ణించింది. వాటన్నింటినీ నిషేధించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలను ఊచకోత కోస్తున్నారని, వారికి రక్షణ లేదని ఇటీవల హసీనా ఒక ప్రకటన చేశారు. దీనిని విద్వేష ప్రసంగంగా బిఐసిటి పరిగణించింది. జస్టిస్ మహ్మద్ గోలమ్ మోర్తుజా మొజుందర్ నాయకత్వానగల ఇద్దరు సభ్యుల ట్రిబ్యునల్ ఈ నిషేధ ఉత్తర్వు జారీ చేసింది.

# హమా నగరాన్ని స్వాధీనం చేసుకున్న సిరియా తిరుగుబాటుదారులు



**దమాస్కస్ :** సిరియాలో తిరుగుబాటుదారులను అడ్డుకోవడంలో ప్రభుత్వ దళాలు విఫలమవుతున్నాయి. రాజధాని దమాస్కస్‌కు 213 కి.మీ దూరంలో ఉన్న అతిపెద్ద నగరం హమాను తిరుగుబాటుదారులు మూడు వైపుల నుండీ చుట్టుముట్టారు. నగరం వారి స్వాధీనంలోకి వెళ్ళిపోనున్నది. తిరుగుబాటుదారులు అన్నివైపుల నుండీ నగరాన్ని చుట్టుముట్టడంతో దేశాధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ నాయకత్వానగల ప్రభుత్వ దళాలు ఈ ప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయాయి. వారం రోజులక్రితం అతిపెద్ద సిరియా నగరం అలెప్పోను తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకుని ప్రపంచాన్ని దిగ్భ్రాంతపరచాయి. పెద్ద సంఖ్యలో అస్సాద్ నాయకత్వానగల ప్రభు త్వ దళాలను హతమార్చి అలెప్పో ను తిరుగుబాటుదారులు స్వాధీ నం చేసుకు న్నారు. ఐతే అస్సాద్ మాత్రం చాలా ధీమాగా ఉన్నారు. అంతర్జాతీయ మిత్రుల సహాయం తో తాము తిరిగి ఆ ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. అ స్సాద్‌కు మద్దతు ఇచ్చేందుకు ఇరాన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇప్పటికే రష్యా యుద్ధ విమానాల సహాయంతో అస్సాద్ సైన్యం దేశంలో ఆధిపత్యంకోసం ప్రయత్నం చేస్తున్నది. ఐతే తిరుగుబాటుదారుల కమాండర్ హస్సన్ అబ్దుల్ ఘనీ



సోషల్ మీడియాలో గురువారం ఒక పోస్టింగ్ పెడుతూ హమా నగరంలోకి తమ దళాలు ప్రవేశించడం ప్రారంభించాయని పేర్కొన్నారు. హయత్ తహ్రిర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) సంస్థకు చెందిన నాయకుడు అబూ మహ్మద్ అల్ జులానీ నాయకత్వంలో తిరుగుబాటుదారులు సిరియాలో జైత్రయాత్ర సాగిస్తున్నారు. కేవలం మూడు రోజుల్లో అలెప్పోను జులానీ వ్యూహంతోనే స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు మరో నగరం హమాను స్వాధీనం చేసుకున్నారు.

## బాధ్యతల స్వీకరణ (మొదటి పేజీ తరువాయి)

ఇప్పిస్తామని ఎవరైనా చెబితే, వారిపైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. టిజిపిఎస్‌సి కమిషన్‌కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్‌ను కూడా కేటాయిస్తామని తెలిపారు. యుపిఎస్‌సితో సమానంగా టిజిపిఎస్‌సి పని చేస్తుందని అన్నారు. టిజిపిఎస్‌సికి స్వయం ప్రతిపత్తి ఉన్నదని, ఎవరికీ భయపడకుండా పని చేస్తామని స్పష్టం చేశారు. ఎవ్వరూ తప్పులు చేసినా ఉపేక్షించబోమన్నారు. విద్యాశాఖలో పనిచేయడం ద్వారా ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలలో తప్పులు లేకుండా చూస్తామని చెప్పారు. ఛైర్మన్ పదవిలోకి రావడం తనకు ఎంతో సంతోషమన్నారు.

## పట్టాభిషేకం(మొదటి పేజీ తరువాయి)

జెపి నడ్డా, అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ, యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), నితీష్ కుమార్ (బీహార్), పుష్కర్ సింగ్ ధామి (ఉత్తరాఖండ్, నయాబ్ సింగ్ సైనీ (హర్యానా), భూపేంద్ర పటేల్ (గుజరాత్) మరియు ప్రమోద్ సావంత్ (గోవా) సహా అనేక ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా వేడుకకు హాజరయ్యారు. పారిశ్రామికవేత్తలు ముఖేష్ అంబానీ, కుమారమంగళం బిర్లా, బాలీవుడ్ స్టార్లు షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, రణబీర్ కపూర్, మాధురీ దీక్షిత్‌నేనే, సంజయ్ దత్, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కూడా హాజరయ్యారు. నూతన సిఎంగా బాధ్యతలు స్వీకరించిన ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం ఫడ్నవీస్ , ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ను ప్రధాని అభినందించారు. దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఆయన భార్య అమృత ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడారు. సిఎంగా ఆయనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. 'ఫడ్నవీస్ ఆరోసారి ఎమ్మెల్యే అయ్యారు. మూడోసారి సీఎం కానున్నారు ఈ విషయంలో ఆనందం కన్నా, ఆయనపై పెద్ద బాధ్యత ఉందనే భావన కలుగుతోంది' అని అమృత పేర్కొన్నారు. కాగా, ఫడ్నవీస్ 2014లో తొలిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2014 నుంచి 2019 వరకు సిఎంగా వ్యవహరించారు. ఇక 2019లో రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా 3 రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది. తాజాగా ఆయన మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు.

## కాంగ్రెస్ వ్యతిరేకం(మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎంఎల్‌ఎ అత్రం సక్కు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో సోయం బాపూరావు, అత్రం సక్కు కు కాంగ్రెస్ కండువా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకమన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులను బెదిరింపులకు గురి చేసి పార్టీ ఫిరాయింపులకు పాల్పడిందన్నారు. కౌశిక్ రెడ్డి, హరీష్ రావుల వివాదంపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ చట్టం ఎవరికీ చుట్టం కాదని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే ఉపేక్షించేదే లేదన్నారు.

## నిప్పులు చిమ్ముతూ నింగికి..
(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిత లక్ష్యాలు సాధించిన పిఎస్ఎల్‌వి ప్రాజెక్టు టీముకు నా అభినందనలు తెలియజేస్తున్నాను''అని సోమనాథ్ అన్నారు.

అంతకుముందు సోషల్ మీడియాలో 'ఇస్రో' ఒక పోస్టింగ్ పెడుతూ, ''ప్రయోగం విజయవంతమైంది. పిఎస్ఎల్‌వి–సి59–ప్రోబా–3 ప్రయోగం లక్ష్యాన్ని చేరుకుంది. సూర్యుణ్ణి సన్నిహితంగా అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగాన్ని చేపట్టారు, యూరోపియన్ స్పేస్ ఏజన్సీ చాలా ప్రత్యేకమైనది,( పోబా–3 అంతరిక్ష నౌకలో రెండు ఉపగ్రహాలూ ఒకటిగానే ఉన్నాయి. రాబోయే నెలల్లో ఈ రెండు ఉపగ్రహాలు వేరు పడతాయి. కానీ ఎలాంటి ఎక్కువ తక్కువలూ లేకుండా చాలా ఖచ్చితత్వంతో సమానస్థాయిలో పయనం కొనసాగిస్తాయి, సౌరవ్యవస్థలోని చాలా ఆసక్తికరమైన కరోగ్రఫీ శాస్త్రీయ పరిశోధనను ఈ ఉపగ్రహాలు నిర్వహిస్తాయి'' అని సోమనాథ్ పేర్కొన్నారు.

# పెద్దరికాన్ని నిలబెట్టుకోండి

(మొదటి పేజీ తరువాయి)



శాంతికుమారితో కలిసి సిఎం రేవంత్ రెడ్డి 'ఇందిరమ్మ ఇంటి యాప్' గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించబోతున్నామన్నారు. నిరుపేదలు, దళిత, గిరిజన, బలహీనవర్గాలు, వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇందిరమ్మ లబ్ధిదారులుగా ఎంపిక చేయడమే తమ మొదటి ప్రాధాన్యత అని అన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్నామని, దేశంలో ఇంత మొత్తం కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలని, ఆ కల నెరవేరాలనే ఉద్దేశంతోనే ఇందిరా గాంధీ నాడు ఇళ్లను నిర్మించి పేదలకు ఇచ్చారని వివరించారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో కానీ, ఇందిరమ్మ గృహాలు లేని గ్రామం లేదన్నారు. కూడు.. గూడు.. గుడ్డ... నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని, ఇందిరమ్మ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు కేటాయిస్తే, నాటి వై.ఎస్ ప్రభుత్వం రూ.1.25 లక్షలకు పెంచారని, ప్రస్తుత్తం అధికారంలోనికి వచ్చిన ప్రజా ప్రభుత్వం పెరిగిన ధరల ప్రకారం రూ.5 లక్షలు ఇస్తోందని సిఎం తెలిపారు. లక్ష్యం ఎంత గొప్పదైనా అమలులో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందని, పేదలకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను కూడా వినియోగిస్తున్నామని వివరించారు.

**నాటి పదేళ్ల కాంగ్రెస్ పాలనలో 25 లక్షల ఇళ్లు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో 65 వేల ఇళ్లు**

ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతంలో 2004 నుంచి 2014 వరకు నాటి కాంగ్రెస్ పదేళ్ల కాలంలో 25.04 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తే, 2014 నుంచి 2023 వరకు బిఆర్ఎస్ కేవలం 65వేల ఇళ్లను మాత్రమే నిర్మించిందని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. నాటి ఇందిరమ్మ ఇళ్లను పిట్ట గూళ్లని, కొడుకు, కోడలు, అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారని, మేకను, కోడిని ఎక్కడ కట్టేస్తారని ఎన్నికల ప్రచార సభల్లో కెసిఆర్ విమర్శలు చేసిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కెసిఆర్ పాలనలో కేవలం లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ప్రారంభించి, 65 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇళ్ల నిర్మాణ పనులను తామే రూ.195 కోట్లు కేటాయించి, ఆ పెండింగ్ పనులను పూర్తి చేశామన్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో ప్రగతి భవన్‌ను, వాస్తు కోసం సచివాలయాన్ని నిర్మించుకున్నారని, గజ్వేల్,జన్వాడ ఫామ్‌హౌసులను నిర్మించుకున్నారని, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని, కానీ పేదల డబల్‌బెడ్‌రూముల నిర్మాణాలను మాత్రం పూర్తి చేయలేదని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ ప్రధాన్యత పేదలు కాదని వారికి వారే ప్రధాన్యత అని అన్నారు. కెసిఆర్ తన పదవీ కాలంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదని, ఆయన చెప్పినట్లు కోడి, మేక ఎక్కడ ఉండాలో చూపలేదని, కానీ కాలనీకో బెల్టు షాపులు మాత్రం పెట్టారని సిఎం విమర్శించారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేస్తున్నామన్నారు.

**కెసిఆర్ తన పెద్దరికాన్ని కాపాడుకోవాలి:**

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్‌కు అప్పగిస్తే, ఆయన తన పదేళ్ల పాలనా కాలం తర్వాత రూ.7 లక్షల కోట్ల అప్పుతో తమకు అప్పగించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్ పాలనా కాలంలో చేసిన అప్పులు,తప్పులను సరి చేయడానికే తమకు సమయం పడుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత రాజశేఖర్ రెడ్డి, ఆ తర్వాత రాజశేఖర్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ప్రజా సమస్యలపైన ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని అన్నారు. సిద్ధిపేట నియోజకవర్గ అభివృద్ధి పనుల నిమ్మితం ఉమ్మడి రాష్ట్రంలో టిఆర్ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్‌రావు అప్పటి సిఎం వైఎస్ఆర్‌ను కలిస్తే, కాంగ్రెస్‌లో చేరేందుకే వైఎస్‌ను హరీశ్ కలిశారని ప్రచారం కూడా జరిగిందని, కానీ తాను అభివృద్ధి పనుల నిమ్మితమే వైఎస్ఆర్‌ను కలిసినట్టు హరీశ్ వివరణ ఇచ్చుకున్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. సిఎంను ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు కలిసే మంచి సాంప్రదాయం ఉండేనని, కానీ కెసిఆర్ సిఎం అయిన తర్వాత ఆ సంప్రదాయాన్ని పక్కన పెట్టి, ప్రభుత్వం, ప్రతిపక్షం అంటే ఒక పాకిస్తాన్ , భారత్ అనే రెండు శత్రుదేశాల సైనికులు అనే వాతావరణాన్ని కలిపించారని సిఎం మండిపడ్డారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎంత ఉన్నప్పటికీ ఆ రాష్ట్ర అంశాల విషయంలో మాత్రం అన్ని రాజకీయ పార్టీలు ఏకమవుతారని.. ఇక్కడ అలానే కావాలని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్రంలో 17 మంది లోక్ సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు సూచనలు ఇచ్చేందుకు కెసిఆర్ కలిసి రావాలని సిఎం ఆహ్వానించారు.

**ఆటబొమ్మలు విరగ్గొట్టే పిల్లల్లా**

తాము అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండింటిన సమతూకం చేసుకుంటూ ముందుకెళ్తుంటే, చిన్న పిల్లల్లా కెటిఆర్, హరీశ్ రావు వ్యవహరిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హోమ్‌వర్క్ చేయని పిల్లలు హోమ్ వర్క్ చేసిన పిల్లాడి నోట్సు చింపివేసినట్లు..పక్క వాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్న పిల్లల్లా ఆ ఇద్దరూ (హరీశ్ రావు, కెటిఆర్) ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. శాసనసభలో పాలక పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతిపక్షానికి అంతే ప్రాధాన్యత ఉన్నదని సూచించారు. కెసిఆర్ శాసనసభకు వచ్చి ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని, ఇరకాటంలో కూడా పెట్టవచ్చని సూచించారు. సభలో ప్రధానప్రతిపక్ష సీటు ఖాళీగా ఉండడం మంచిది కాదని హితువు పలికారు.

**కెసిఆర్.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఆహ్వానం**

ఈ నెల 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ విష్కరణ కార్యక్రమానికి ప్రధానప్రతిపక్ష నేత కెసిఆర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావుతో పాటు ఎంఐఎం ను కూడా ఆహ్వానించాలని సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కు సూచించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం, నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో జరిగే తెలంగాణ సంబరాల్లో కూడా ప్రధాన ప్రతిపక్ష నేత పాల్గొనాలన్నారు.

**రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు: భట్టి**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ నాలుగున్నర లక్షల కుటుంబాలకు రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి జీవికి,మనిషికి ఒక గూడు అవసరమన్నారు. బిఆర్ఎస్ అడ్డుగోలుగా చేసిన అప్పులకు తాము రూ. 64 వేల కోట్లు వడ్డీలను చెల్లిస్తున్నామన్నారు. ఆర్థిక క్రమశిక్షణతో తాము సంక్షేమ పథకాలుఅమలు చేస్తుంటే, కొందరు తమ ప్రభుత్వంపైన బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడే ఇంటిగ్రేడ్ హాస్టల్స్‌ను ఏర్పాటు చేసి ఉంటే,ప్రస్తుతం గురుకులాల్లో ఇలాంటి పరిస్థితులు వచ్చేవి కావని, సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడే వారు కాదు కదా అని భట్టి అన్నారు.

**ఎవ్వరూ ఒక్క రూపాయి ఇవ్వరు : మంత్రి పొంగులేటి**

గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి కోసం ఎవ్వరూ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా నిరుపేదలకు ముందుగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులుగా గుర్తిస్తామని, ఈ కార్యక్రమం నిరంతరంగా నిర్వహిస్తామని తెలిపారు. దేశంలోనే అత్యధిక ఇంటినిర్మాణాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణ ఉండేలా చేస్తామని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాదిపూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న పెద్ద కానుక ఇందిరమ్మ ఇళ్లు అని అన్నారు.

## హరీశ్‌రావు అరెస్టు... విడుదల
(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రులు జి.జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితతో పాటు ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు , సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ను విడుదల చేయాలంటూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితతో పాటు పలువురు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. హామీలపైన కాంగ్రెస్‌ను నిలదీస్తే అరెస్టులు చేయడం ఏమిటని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. ఈమేరకు ఆయన తన ట్విట్టర్‌లో (ఎక్స్)లో పోస్ట్ చేశారు. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు.

**రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన : హరీశ్ రావు**

ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని ఎమర్జెన్సీ పాలనను తీసుకొచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. పోలీసులను అతిగా ప్రయోగించిన ఏ ప్రభుత్వం నిలబడలేదన్నారు. ఎవరిని అరెస్టు చేయాలో గాంధీభవన్ లోనే నిర్ణయిస్తున్నారని, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదని, పోలీసులు ఈ విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సైకోలాగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డిని కూడా బేషరతుగా విడుదల చేయాలని ఆయన కోరారు.

**ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డి అరెస్ట్**

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో తమ విధులకు ఆటంకం కలిగించారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర చేసిన ఫిర్యాదు మేరకు బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేశారు .గురువారం ఉదయం కొండాపూర్‌లోని కౌశిక్ రెడ్డి నివాసం వద్ద భారీగా పోలీసులు చేరుకుని ఆయనను అరెస్ట్ చేశారు.ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేస్తూ ట్రాక్ చేస్తోందని పాడి కౌశిక్ రెడ్డి బుధవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలోనే పోలీసులకు, కౌశిక్ రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. ఫిర్యాదు చేయడానికి రమ్మని పిలిచిన పోలీసు అధికారి ఆ సమయంలో లేకపోవడంపై కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కింది స్థాయి సిబ్బంది తన ఫిర్యాదు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు బెదిరించారని ఆరోపిస్తూ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎం ఎల్‌ఎ కౌశిక్ రెడ్డి దూషించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపైన పోలీసులు కేసు నమోదు చేశారు.

## పోషకాలతో కూడిన భోజనం పెట్టాలి
(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయని ఆయా ఘటనలో బాధ్యులైన వాళ్లపై చర్యలు తీసుకున్నట్లు ఎఎజి ఇమ్రాన్‌ఖాన్ కోర్టుకు తెలిపారు. నారాయణపేట్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో వేర్వేరుగా రెండు కమిటీలు ఏర్పాటు చేశామని భోజనం వికటించిన ఘటనపై అధ్యయనం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. 25వేల 941 ప్రభుత్వ పాఠశాలల్లో 18లక్షల మందికి పైగా విద్యార్థులన్నారని వాళ్లలో 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని ఏఏజీ వివరించారు. ఈ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర మార్గనిర్దేశకాల ప్రకారం గ్రామ, మండల, జిల్లా,రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కానీ క్షేత్రస్థాయిలో ఇలా చోటు చేసుకోవడం లేదని పిటీషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనంలో సరైన ఆహారం పెట్టడం లేదని గుడ్డు కూడా ఇవ్వడం లేదని కోర్టుకు తెలిపారు. ఆ కమిటీలకు అదనంగానే ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై అధ్యయనానికి మరో రెండు కమిటీలు ఏర్పాటు చేశామని అన్ని కమిటీలు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డించే ఏజెన్సీలకు ప్రభుత్వం ఇటీవలే 40 శాతం డబ్బులు పెంచినట్లు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

# 7న రేవంత్‌రెడ్డి నల్లగొండలో పర్యటన

రాజీవ్ ప్రాంగణంలో లక్షమందితో బహిరంగ సభ

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధిః** ప్రజా ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7తో సంవత్సరం నిండుతున్న సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ఎస్‌ఎల్‌బిసి వద్ద ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కన రాజీవ్ ప్రాంగణంలో లక్షమందితో రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ నెల 7న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నిమిత్తం వస్తున్న దృష్ట్యా గురువారం ఆయన రాక ఏర్పాట్ల ను పరిశీలించారు.

అనంతరం నూతన వైద్య కళాశాల వద్ద మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ముందుగా సుమా రు 1000 కోట్ల రూపాయలతో చేపట్టిన బ్రాహ్మణ వెల్లేముల ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ చానల్స్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యూనిట్ 2 ఎనర్జైజేషన్ ప్రారంభం తర్వాత నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎస్‌ఎల్‌బిసి గంధంవారి గూడెం వద్ద 275కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభిస్తారని, అంతేగాక అక్కడే 40కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సెట్విన్ ద్వారా మహిళలకుద్దేశించిన స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రా న్ని ప్రారంభిస్తారని, లైబ్రరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, కంగల్, తిప్పర్తి మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయని, వాటికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే నార్కెట్‌పల్లి, దామరచర్ల మండలాలకు డిసెంబర్ 9 తర్వాత జూనియర్ కళాశాలలు మంజూ రు చేస్తూ జిఒ రానుందని మంత్రి వెల్లడించారు. నల్లగొండలో ఎస్‌ఎల్‌బిసి గంధం వారిగూడెం మెడికల్ కళాశాల పక్కన రాజీవ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న బహిరం గ సభకు లక్షమంది ప్రజలు హాజరుకానున్నారని, ప్రజలందరూ స్వచ్ఛందంగా పెద్దఎత్తున వచ్చి ప్రజా పాలన సంవత్సరం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిరాక సందర్భం గా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి రాములు నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీవాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, ఆర్డీవో అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివారాం రెడ్డి, తదితరులు ఉన్నారు.





# మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కలిసి రంగారెడ్డి జిల్లా మాదాపూర్ లోని శిల్పారామం పక్కన ఇందిర మహిళా శక్తి బజార్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో మహిళా శక్తి చాలా గొప్పదని, తెలంగాణ రాష్ట్రంలో మహిళ సహాయక సంఘాలు అన్ని రంగాలలో ముందంజలో ఉండటం మహిళలకు గర్వకారణమని తెలిపారు. ఇప్పటి వరకు 65 లక్షలమంది మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొంది మహిళలు కుటుంబ అభివృద్ధిలో పాలు పంచుకోవడం మంచి శుభ పరిణామం అని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహాశక్తిగా ఎదగటానికి 500 కోట్ల విలువైన ఇందిరా మహిళా శక్తి బజారును నేడు రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిందని తెలిపారు. శిల్పారామం పక్కన మూడున్నర ఎకరాల స్థలంలో మహిళల ఎదుగుదలకు ఈ బజారు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రానున్న కాలంలో కోటిమంది సభ్యులను చేసినట్లయితే ప్రతి మహిళను కోటీశ్వరులు చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదే అని అన్నారు. మహిళలను అన్ని రంగా ల్లో అభివృద్ధి చేస్తూ సోలార్ పవర్ ప్లాంట్ లో కూడా వారిని భాగస్వామ్యం చేస్తున్నామని, అదే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణలో, ఆర్టీసీ బస్సులు నడిపే వాటిల్లో ప్రతి రంగంలో వారిచే వ్యాపారాలు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి బజారును దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని,ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతి సందర్శకు లు ఈ బజారును తిలకించే విధంగా వస్తువులు తయారు చేయాలని అమ్మకాలు అదేవిధంగా సాగాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి ఆర్థిక అభివృద్ధికి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు.

**9న తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ**

డిసెంబర్ 9వ తేదీన రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని దీనికి పెద్ద ఎత్తున మహిళలు హాజరుకావాలని ఆయన సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అందుకు కావలసిన సదుపాయాలు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా కల్పిస్తుందని తెలిపారు. దానిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఎదగాలన్నారు. ప్రతి వ్యాపారంలో మహిళలు భాగస్వాములై పురుషుల కంటే మహిళలు ఆర్థికంగా ముందంజలో ఉండాలని ఆయన తెలిపారు.ప్రతి జిల్లా కలెక్టరేట్ లో అమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయడంతోపాటు, వారు ఏ రంగంలో నైపుణ్యం చూపిస్తే వాటికి అనుగుణంగా వారికి ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వపరంగా సబ్సిడీలు అందించడం జరుగుతుందని తెలిపారు. ముందుగా 106 స్టాళ్లను సందర్శించి, మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు.

# మీడియా వారధిగా నిలవాలి : గుత్తా సుఖేందర్ రెడ్డి

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ః** ప్రభుత్వానికి, ప్రజలకు మీడియా వారధిగా నిలవాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం పట్టణంలోని టిఎన్‌జిఒ భవన్‌లో ప్రెస్ క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల హెల్త్ క్యాంపును గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ సంచలనం కోసం అవాస్తవాలు ప్రచారం చేయడం ఇప్పుడు కొన్ని మీడియాలకు అలవాటుగా మారిందని, దానివల్ల మొత్తం మీడియా ఇమేజ్‌కు భంగం వాటిల్లుతుందన్నారు. కేవలం వార్తలు, వృత్తే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు కూడా జర్నలిస్టులు చేపట్టడం అభినందనీయమన్నారు. కొత్తగా ఏర్పడిన నల్లగొండ ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఇటీవల వనభోజనాలు కూడా ఏర్పాటు చేసుకొని ఒకచోట కలవడం శుభ పరిణామం అని, జర్నలిస్టులకు ఎల్లవేళలా తాను అండగా ఉంటానని తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఏర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమమే ధ్యేయంగా ప్రెస్‌క్లబ్ పనిచేస్తుందని ఇందులో భాగంగానే ఇటీవల కార్తీక వనభోజనాలు, ఇవాళ మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. కోరిన వెంటనే మెడికల్ క్యాంపు నిర్వహణకు ముందుకు వచ్చిన యశోద హాస్పిటల్, తమ విజ్ఞప్తి మేరకు కార్యక్రమానికి హాజరైన శాసనమండలి చైర్మన్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా యశోద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రఫుల్ కిల్లారు, శిల్పారెడ్డి, చేతన్ వీరమనేని, రాఘవేందర్ గౌడ్, కమల్ తేజ్, భాను తేజ, వినీత జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు మెడికల్ చెక్ అప్ నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, కార్యదర్శులు జూలకంటి అశోక్‌రెడ్డి, జిల్లా యాదయ్య, మంజుల, ఉయ్యాల లింగయ్య, కార్యవర్గం కట్టా సుధాకర్, విజయభాస్కర్, ఉపేందర్, రామకృష్ణ, అశ్వక్ అహ్మద్, మదనాచారి, జాకీర్ అలీ, బజరంగ్ ప్రసాద్, రవీందర్ రెడ్డి, భాస్కర్, మీసాల శ్రీనివాస్, కనకయ్య, దున్న ప్రేమ్‌సింగ్, తెల్గామల్ల దశరథ, హరి ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు గణేష్, జనార్ధన్ రెడ్డి, ఫణీంద్ర, సత్యనారాయణ, భవాని ప్రసాదు, కంది శ్రీను, ఖలీం తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ

'ముఖాముఖి'లో మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మంత్రి జూపల్లి కృష్ణా రావు విమర్శించారు. బిఆర్‌ఎస్‌ది కుటుంబ, అవినీతి పాలన అని దుయ్యబట్టారు. ప్రజల స్వేచ్ఛను హరించారని ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రజలతో మంత్రుల ముఖాముఖి కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పలు సమస్యలపై దరఖాస్తులు, ఫిర్యాదులు అందజేశారు. అంతకుముందు మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షంతో పాటు స్వపక్ష గొంతు నొక్కారని దుయ్యబట్టారు. కానీ సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు నడుచుకుంటుందన్నారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తుందన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే భవన్‌తో పాటు జిల్లాల్లో ప్రజావాణి ద్వారా ప్రజల వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు.

**కొడుకు, అల్లుడిని పట్టించుకోని కెసిఆర్..**

ప్రజాస్వామ్యంలో చట్టానికి ఎవరు అతీతులు కారని మంత్రి జూపల్లి అన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డి అరెస్ట్‌పై ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి వ్యాఖ్యానించారు. పిల్లలు తప్పుచేస్తే తల్లిదండ్రులు మందలించాలి కానీ, కెసిఆర్ ఫాం హౌస్‌కు పరిమితమై, తన కొడుకు, అల్లుడిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ పాలకుల మాదిరి నిరంకుశంగా వ్యవహరించడం లేదన్నారు. ధర్నాలు చేసుకునే స్వేచ్ఛను ఇచ్చామని, దాన్ని దుర్వినియోగం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నామన్నారు. తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బిఆర్‌ఎస్ నేతలకు లేదన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ పని అయిపోందని, వారు ఎంత గీపెట్టినా ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు.

# ఖైదీల్లో పరివర్తన తీసుకురావడమే జైలు అధికారుల లక్ష్యం

'దీక్షాంత్ పరేడ్'లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** జైళ్ల శాఖ అనగానే ఖైదీలు అని ఊహించుకుంటామని, జైలు అంటే ఖైదీలకు శిక్ష వేయడం కాదని, వారిలో పరివర్తన తీసుకొస్తూ.. వారిలో నైపుణ్యాలు మెరుగుపరిచేందుకే జైళ్ల శాఖ పనిచేస్తుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శిక్షణ పొందిన వారు దేశ రక్షణలో బాధ్యత గల పౌరులుగా వ్యవహరించాలన్నారు. హైదరాబాద్ చంచల్‌గూడ సెంట్రల్ జైల్‌లోని సికా పెరేడ్ గ్రౌండ్ లో జైల్ ట్రైనీ వార్డర్స్ దీక్షాంత్ పరేడ్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. దీక్షాంత్ పరేడ్‌లో శిక్షణ పొందిన జైల్ వార్డన్స్ నుండి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో జైళ్ల శాఖలో 92మంది జైల్ వార్డర్స్ సికా హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నారు. అండమాన్ నికోబార్‌కు చెందిన జైల్ వార్డర్స్ కూడా సికాలో బేసిక్ ఇండక్షన్ లో శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జైల్ వార్డర్స్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ మెడల్స్ ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్త ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శిక్షణ పొంది ప్రతిజ్ఞ చేసిన విధంగా సమాజంలో మీరు చేసే పని, సమయ పాలన ఉద్యోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందిని కోరారు. ఇటీవల సత్‌ప్రవర్తన గల 249 మంది ఖైదీలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వారికి శిక్ష వేయడం కాదని, శిక్షణ ద్వారా వారిని పరివర్తన గల వ్యక్తులుగా మారుస్తుందన్నారు. ప్రొఫెషనల్ ఖైదీలపై కఠినంగా ఉంటూనే వాళ్ళలో మార్పు తీసుకురావాలని తెలిపారు. ఖైదీలు వివిధ వృత్తుల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఖైదీలు తయారు చేసిన వస్తువులను స్టాళ్లలో అమ్ముకుంటూ వారికి ఆర్థికంగా ఉపయోగపడుతుందన్నారు. పార్లమెంటు సభ్యుడుగా తెలంగాణ కోసం కొట్లాడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నామన్నారు. జైళ్ల శాఖ మరిన్ని సంస్కరణలు తీసుకురావాలని కోరారు.

# తెలంగాణ వస్తుందని..కెటిఆర్, కవిత తట్టాబుట్ట సర్దుకుని వచ్చారు : కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ కుటుంబంలో ఎవరికి ఒక గీత కూడా పడలేదని, రాష్ట్రం వస్తుంద ని తెలిశాక కెటిఆర్, కవిత తట్టాబుట్టసర్దుకొని తెలంగాణకు వచ్చారని మంత్రి కొండా సురేఖ అన్నారు. కెటిఆర్ భాష అసహ్య ఉందని విమర్శించారు. జూబ్లీహి ల్స్ నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు పోరాడితే తెలంగాణ వచ్చిందన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి ఆత్మహత్య చేసుకునేలా చేశారని విమర్శించారు. కెటిఆర్‌కు కామన్ సెన్స్ లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి సక్సెస్ వెనక ఎంత శ్రమ ఉందో తెలుసుకోవాలన్నారు. ప్రతి దానికి రేవంత్‌పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి కులాలపై సూక్ష్మంగా ఆలోచిస్తూ వారి ఎదుగుదల కోసం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు.



ప్రతిపక్ష నాయకుడు ఫాం హౌస్‌లో పడుకున్నారని విమర్శించారు. కెటిఆర్ మీడియా ముందు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో ప్రజలు కడుపునిండా తిని, కంటి నిండా నిద్రపోయారని బిఆర్‌ఎస్ నాయకులు భ్రమ పడుతున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని, అందు కే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారని మండిపడ్డారు. కెటిఆర్ ఉచ్చులో విద్యార్థులు పడొద్దన్నారు. గతంలో పెట్రోల్ క్యాన్ తెచ్చుకొని అగ్గిపెట్టె మర్చిపోయారని, ఇప్పుడు పెట్రోల్ క్యాన్ తెచ్చుకుంటే అగ్గిపెట్టెలు బిఆర్‌ఎస్ కార్యకర్తలే తెచ్చుకుంటారంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు. బిజెపి ఎంఎల్‌ఎ రాకేష్ రెడ్డిపై కూడా మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్‌ఎ రాకేష్ రెడ్డి గంధపు చెక్కల బిజినెస్ మడత పెట్టుకోవాలన్నారు. సహచర మంత్రిని తిట్టినందుకే రెస్పాండ్ కావాల్సి వస్తుందన్నారు. కొత్తగా ఎన్నికైన ఎంఎల్‌ఎపై మాట్లాడాలంటే తన స్థాయి తగ్గుతుందన్నా రు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రజలపై ఎంత ప్రేమ ఉంటుందో అందరికీ తెలుసన్నారు. ఉద్యమంలో బిఆర్‌ఎస్ నేతలు ఉత్తుత్తి రాజీనామాలు చేశారని, తెలంగాణకోసం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. పోటీచేసిన అభ్యర్థిని కలెక్టర్‌కు పరిచ యం చేస్తే తప్పా అని ప్రశ్నించారు. హుజూరాబాద్ పిచ్చోడు అసెంబ్లీలో అరుస్తాడన్నారు. అసెంబ్లీలో హుజూరాబాద్ ఎంఎల్‌ఎ చప్పట్లు కొట్టి డ్యాన్సులు చేస్తాడని ఎద్దేవా చేశారు. కౌశిక్ రెడ్డి చిన్నపిల్లల కంటే దారుణంగా మాట్లాడుతున్నాడని విమర్శించారు.

**రేవంత్ రెడ్డిని అరెస్టు చేసినట్టు తామూ చేస్తే బిఆర్‌ఎస్ నేతలంతా జైల్లో ఉండేవాళ్లు..**

రేవంత్ రెడ్డిని అరెస్టు చేసినట్టు తాము అరెస్టు చేయాలనుకుంటే బిఆర్‌ఎస్ నేతలంతా జైల్లో ఉండేవాళ్ళని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో బిఆర్‌ఎస్ నేతల హస్తం లేకపోతే ఆఫీసర్లను దేశం ఎందుకు దాటించారని ప్రశ్నించారు. చేసేది న్యాయమే అయితే సోషల్ మీడియాను వేరే దేశం నుంచి నడపాల్సిన అవసరం ఏంటని నిలదీశారు.

యూ ట్యూబ్‌లో జరిగిన దానిపై తాము కొంత దూకుడుగా ఉండాల్సిందన్నారు. తమ వైఫల్యం కొంత ఉందన్నారు. తెలంగాణ తల్లిని దొరసాని లాగా చేశాని, తెలంగాణ తల్లిని కవిత లాగా తయారు చేశారన్నారు. బంగారు ఆభరణాలు, వడ్డాణాలు పెట్టి తెలంగాణ తల్లిని తయారు చేశారని అన్నారు. సబ్బండ వర్గాల ప్రతినిధిగా తెలంగాణ తల్లిని తయారు చేస్తామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# రాష్ట్ర సాధనలో ఆర్‌టిసి కార్మికుల పాత్ర మరువలేనిది

రవాణా శాఖ కొత్త లోగోను, బ్రోచర్‌ను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్‌టిసి కార్మికుల పాత్ర మరువలేనిది. గతంలో సిఎంగా ఉన్న కెసిఆర్ అయినా, నేడు ముఖ్యమంత్రిగా ఉన్న నేను అయినా బాధ్యతాయుతంగా రవాణా కార్మికుల ఆకాంక్షలను గౌరవించాల్సిందే. కానీ గతంలో ఆర్‌టిసి కార్మికులు చనిపోయినా పరామర్శించని పరిస్థితి ఉండేది. నేడు ఆర్‌టిసి కార్మికుల కీలకమైన అంశాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పభుత్వం కృషి చేస్తోంది' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం ఎన్‌టిఆర్ మార్గ్‌లోని హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్‌లో రవాణా శాఖ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రవాణా శాఖ కొత్త లోగోను, రవాణా శాఖ, ఆర్‌టిసి సాధించిన విజయాలపై బ్రోచర్‌ను సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. వాహనాల స్క్రాపింగ్ పాలసీ ఉత్తర్వులను రవాణా శాఖ మంత్రికి, అధికారులకు సిఎం అందజేశారు. ఆర్‌టిసిలో కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామకాల పత్రాలు లబ్ధిదారులకు సిఎం అందజేశారు. రూ.3902.31 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం నిధుల చెక్కును మహిళా ప్రయాణికుల బృందానికి ముఖ్యమంత్రి అందజేశారు.

కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులు, జీహెచ్ఎంసీ మేయర్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో భాగంగా గత ఏడాది డిసెంబర్ 9వ తేదీన ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసామని, 11 నెలల 20 రోజుల్లో 115 కోట్ల మంది ఆడబిడ్డలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, ఈ హామీ అమలు టిజిఆర్‌టిసిని పునరుజ్జీవింప చేసిందని, ఇది ఆర్‌టిసి కార్మికుల జీవితాల్లో వెలుగును నింపే కార్యక్రమమని అన్నారు. రానున్న రెండేళ్లలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేసి హైదరాబాద్ నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడుతామన్నారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ప్రతీ ఆడబిడ్డ ప్రతీ నెలా రూ.5 నుంచి రూ.7 వేలు ఆదా చేయగలుగుతున్నారన్నారు.



**బియ్యం రీసైక్లింగ్ మాఫియాను కూకటివేళ్లతో పెకలిద్దాం**

బియ్యం రీసైక్లింగ్ మాఫియాను కూకటి వేళ్లతో పెకలిద్దామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 1కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. దొడ్డు బియ్యం తినే పరిస్థితి లేదని, అందుకే రైతులు సన్నాలు పండించాలని కోరారు. అలాచేస్తే తెలంగాణలోని ప్రభుత్వ హాస్టళ్లలో, రేషన్ షాపుల్లో, మధ్యాహ్న భోజనాలకూ సన్నబియ్యం అందిస్తామన్నారు. ఈ నేలలో పండిన పంటనే మన బిడ్డలకు అందిస్తామన్నారు.

**బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసిని చంపి బొంద పెట్టింది: మంత్రి పొన్నం ప్రభాకర్**

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారుడిగా ఉద్యమంలో ఆర్‌టిసి కార్మికులు కీలక పాత్ర పోషించారని, సకల జనుల సమ్మె చేసి ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చారన్నారు. అలాంటి ఆర్‌టిసిని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా చంపి బొంద పెట్టిందని, ఒక్క కొత్త బస్సు కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఉన్న కాలుష్య పరిస్థితులు తెలంగాణలో ఏర్పడవద్దనే ఉద్దేశ్యంతోనే కొత్త ఈవి పాలసీని అమలులోకి తీసుకువచ్చామని, ఈవి పాలసీ తెచ్చి తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. రవాణా శాఖ యూజర్ చార్జీలను వాడుకునేలా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. కొత్తగా 213 వాహనాలు తీసుకొస్తున్నామని, రవాణా శాఖ లోగోతో ఈ వాహనాలు ఉండనున్నాయన్నారు. ప్రజా పాలనలో కొత్త బస్సు కొనుగోలు చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టామని, 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, రూ.280 కోట్లతో బాండ్స్ ఇచ్చామని, నష్టాల్లో ఉన్న ఆర్‌టిసి 10 నెలల్లోనే లాభాల్లోకి వచ్చిందని, మహాలక్ష్మి ద్వారా ప్రతి నెల రూ.350 నుంచి రూ.400 కోట్లు ఆర్‌టిసికి కేటాయించడం వల్ల ఆర్‌టిసి లాభాల బాట పట్టిందన్నారు. ఆర్‌టిసి, రవాణా శాఖలో ఎలాంటి ఆరోపణలు లేకుండా గౌరవంగా పనిచేయాలని ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

# నేడు 'ఎస్‌డిఆర్‌ఎఫ్'ను ప్రారంభించనున్న సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ పజాపాలన విజయోత్సవాల్లో భాగంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్)ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. హైదరాబాద్ ఎన్‌టిఆర్ మార్గ్‌లోని హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్ వద్ద ఎస్‌డిఆర్‌ఎఫ్ వాహనాల తోపాటు బోట్లను సిఎం రేవంత్‌రెడ్డి జెండాను ఊపి ప్రారంభిస్తారని అగ్నిమాపక శాఖ డిజిపి వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం హెచ్‌ఎండిఎ మైదానంలో ఏర్పాటు చేసిన ఎస్‌డిఆర్‌ఎఫ్ స్టాల్స్‌ను ముఖ్యమంత్రి సందర్శిస్తారని తెలిపారు. అలాగే ఎస్‌డిఆర్‌ఎఫ్ లోగోను కూడా సిఎం ఆవిష్కరిస్తారని తెలియజేశారు.




గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
EE, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
NIT No. 23/EE-30/SDZ/GHMC/2024-25, Dt: 05.12.2024
క్ర. సం.1, పనిపేరు: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు - 2024: 1. PVNR మార్గ్ అద్దె ప్రాతిపదికన GHMC/2024 (ఆమె/సాధారణ మరుగుదొడ్లు) తాత్కాలిక మొబైల్ టాయిలెట్లను అందించడం, వార్డు 148 రాంగోపాల్‌పేట్, బేగంపేట సర్కిల్ 30, SBZలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు 2024 వీక్షణ. GHMC -1 పని, అంచనా విలువ: 1.20 లక్షలు, బిడ్ ప్రారంభతేది & ఆఖరుతేది: 06.12.2024 am 10.30 నుండి 07.12.2024 10.30 am వరకు, పేరు మరియు అడ్రస్, ఫోన్ నెం. ఇఇ సర్కిల్ - 30, GHMC, Sec.bad, 7331181426/9849906750. ఆఫీసర్ అడ్రస్: శ్రీ సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్, GHMC, మరిన్ని వివరాలకు @ https://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్
DIPR R.O.No.7536-PP/CL/ADVT/1/2024-25, Date: 05-12-2024

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీశ్రీశ్రీద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానము (నారాయణాశ్రమము) గ్రా. కూకట్‌పల్లి, జి.మేడ్చల్
బహిరంగ వేలం ప్రకటన తేది: 04.12.2024
ఒక సంవత్సర కాలపరిమితి బహిరంగ వేలం తేదీ: 15.01.2025 నుండి తేదీ: 14.01.2026 వరకు దిగువ తెలుపబడిన లైసెన్స్ హక్కులు నిమిత్తం బహిరంగ వేలము కోరడమైనది.

| క్రమ సంఖ్య | వేలముల వివరములు | టెండర్ ధర | ధరవతూ |
| --- | --- | --- | --- |
| 1. | కొబ్బరికాయలు మరియు ఇతర పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | 500/- | 20,000/- |

తేదీ: 18.12.2024, బుధవారం రోజున ఉదయం 11:30 గం.లకు ఆలయ మండపం నందు బహిరంగ వేలము జరుగును. కావున ఆసక్తి గలవారు షరతులకు లోబడి వేలములో పాల్గొనగలరు. పూర్తి వివరాలకు దేవాలయంలో సంప్రదించగలరు. ఫోన్: 9000106262
సం/- (శ్రీమతి యం. అరుణ కుమారి), కార్యనిర్వహణాధికారి సెల్ : 9000106262, 9985242336
DIPR R.O.No.7489-PP/CL/ADVT/1/2024-25, Date: 05-12-2024

## అదానీ అంశంపై నల్ల జాకెట్లు ధరించి ...

# ఇండియా కూటమి నిరసన



**న్యూఢిల్లీ :** అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ దర్యాప్తు జరపాలని మరోసారి ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపిలు పార్లమెంట్‌లో ఆవరణలో గురువారం నిరసన ప్రదర్శన చేశారు. 'మోదీ, అదానీ ఏక హై', 'అదానీ సేఫ్ హై' అనే సిట్టిక్కర్లు అతికించిన నల్లరంగు జాకెట్లు ధరించి నినాదాలు చేశారు. ప్రియాంకాగాంధీ వాద్రా సహా కాంగ్రెస్ ఎంపిలు, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలు, ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. తెల్లరంగు టిషర్ట్ వేసుకుని నల్లరంగు జాకెట్ ధరించిన లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీ దర్యాప్తు జరించరని, ఒక వేళ దర్యాప్తు జరిపితే ఆయనపైనే విచారణ చేసినట్లు అవుతుందని మోదీ భావిస్తున్నారన్నారు. యుఎస్ కోర్టులో అదానిపై నమోదైన ముడుపులు, మోసం వంటి అభియోగాలపై పార్లమెంట్‌లో కచ్చితంగా చర్చ జరపాలని రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సభలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడాలన్నారు. పార్లమెంట్ మకర ద్వారం వైపునకు వెళ్లే మెట్లపై ప్రతిపక్ష పార్టీల ఎంపిలు నిరసన తెలిపారు. అయితే పార్లమెంట్‌కు వచ్చే వారికి ఇబ్బంది కలిగేలా వ్యవహరించకూడదని రెండు రోజుల క్రితం స్పీకర్ ఓమ్‌బిర్లా సభ్యులను హెచ్చరించిన విషయం తెలిసిందే. మంగళవారం, బుధవారం కూడా పార్లమెంట్ మకర ద్వారం వద్ద నిరసన తెలియజేసిన విషయం విదితమే. మెట్లపై కొద్ది సమయంపాటు నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపిలు సంవిధాన్ సదన్ ముందు వరుసగా నిలబడి మోదీ, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన ప్రదర్శనకు మొదటి నుంచి టిఎంసి దూరంగా ఉంటుంది.

**లోక్‌సభలో వాయిదాల పర్వం...**

లోక్‌సభలో గురువారం పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగింది. యుఎస్‌కు చెందిన మల్టీ బిలియనీర్‌తో తనకున్న సంబంధాలు ఏమిటి అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని బిజెపి సభ్యుడు నిశికాంత్ దుబే వ్యాఖ్యానించడంతో సభలో దుమారం రేగింది. దీంతో సభను స్పీకర్ మరుసటి రోజుకు వాయిదా వేశారు. అంతకు ముందు రెండుసార్లు వాయిదా పడిన సభ మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశమై ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య రైల్వేల (సవరణ) బిల్లు 2024ను ఆమోదించింది. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ప్రతిపక్ష సభ్యులను శాంతిపరిచేందుకు ప్రయత్నించి బిల్లుపై సమాధానం ఇవ్వాల్సిందిగా రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అయితే ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళను ఉధృతం చేశారు. వారి తమ ఆందోళను తీవ్రంగా కొనసాగించడంతో పాల్ సభను వాయిదా వేశారు. అంతకు ముందు మధ్యాహ్నం జరిగిన జీరో అవర్‌లో బిలియనీర్ ఇన్వెస్టర్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించిన ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) పరిశోధనల ఆధారంగా ఒక నివేదిక ప్రచురితమైన నేపథ్యంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు పార్లమెంటు కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించాయని దుబే పేర్కొన్నారు. దుబే వ్యాఖ్యలను ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా ఖండించారు. దీంతో సభ అట్టుడికింది. ఈ ఆందోళన మధ్యే స్పీకర్ ఓమ్‌బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత కూడా ఇలాంటి ఘటనలో చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు కల్పించుకుని మాట్లాడుతూ ప్రతిపక్షాల వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రతిపక్షాలు రంగురంగుల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు వచ్చారని, పార్లమెంట్ వెలుపల ష్యాషన్ షో నిర్వహించారని ఎద్దేవా చేశారు. ఈ చర్య పార్లమెంట్ గౌరవాన్ని దిగజారుస్తుందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సభకు అంతరాయం కలిగించి సాధించేదేమీలేదన్నారు. దీని వల్ల ఓట్లు రావని వ్యాఖ్యానించారు. ఈ తరుణంలో ప్రతిపక్ష ఎంపిలు తమ ఆందోళను ఇంకా తీవ్ర తరం చేశారు. దీంతో సభను పాల్ మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు.

## అదానీకి ఆరు విమానాశ్రయాలు లీజుకిచ్చాం : కేంద్రం





**న్యూఢిల్లీ :** అదానీ గ్రూప్‌కు ఆరు విమానాశ్రయాలను లీజుకు ఇచ్చినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. పారదర్శక, పోటీ విధానం ద్వారానే వాటిని కట్టబెట్టినట్లు తెలిపారు. లక్నో, అహ్మదాబాద్, మంగళూరు, జైపూర్, గువహతి, తిరువనంతపురంలో ఉన్న ప్రభుత్వ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ)లను అదానీ సంస్థకు లీజుకు ఇచ్చారు. ఒకే సంస్థకు రెండు విమానాశ్రయాలు ఇవ్వవద్దని నీతి ఆయోగ్, ఆర్థిక వ్యవహారాల విభాగం (డిఇఎ) అభిప్రాయంతో ఉన్నట్లు తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సౌగతారాయ్ గురువారం లోక్‌సభలో అన్నారు. దీనికి మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందిస్తూ ఆయన వ్యాఖ్యలు వాస్తవం కాదని చెప్పారు. విమానాశ్రాలను లీజుకు ఇచ్చేందుకు లోతుగా పరిశీలించే విధానానిన అవలంభించినట్ల తెలిపారు. ఆరు విమానాశ్రయాల ప్రస్తుత విలువ సుమారు రూ.5,260 కోట్లు అని, పిపిపి కింద వాటిని అప్పగించినట్లు లిఖిత పూర్వక సమాధానంలో రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. అవసరమైన పని తీరు ప్రమాణాలన నిర్హణ కోసం పెట్టే పెట్టుబడి వ్యయాన్ని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియానే భరిస్తుందని, ఆ మొత్తం పిపిపి భాగస్వామి నుంచి అప్‌ఫ్రంట్ పేమెంట్ రూపంలో వస్తుందని తెలిపారు. ఆయా విమానాశ్రయాలలో అసిస్టెంట్ జనరల మేనేజర్ లేదా అంత కంటే తక్కువ స్థాయి ఉద్యోగులకు ఒక ఏడాది అదే విమానాశ్రయంలో కొనసాగిస్తారని, మరో రెండేళ్ళు డిప్యూటేషన్ పేరుతో కొనసాగించేలా కన్సెషన్ ఒప్పందం ఉన్నదన్నారు. ఈ మూడేళ్లలో కనీసం 60 శాతం ఉద్యోగులకు ప్రస్తుత ఉద్యోగకర్త ఎఎఐ నిబంధనలు, షరతులే వర్తిస్తాయని పేర్కొనానరు. ఈ ఒప్పందాని ఉద్యోగాలు అంగీకరించవచ్చని లేదా తిరస్కరించవచ్చని, ఒప్పందాన్ని అంగీకరించిన వారు ఎఎఐకి రాజీనామా చేసి కొత్త భాగస్వామి సంస్థ కింద చేరవచ్చన్నారు. తిరస్కరించిన ఉద్యోగులు మూడేళ్ళు ఒకే ఎయిర్‌పోర్ట్‌లో పని చేస్తారని, అప్పటి వరకు ఎఎఐ ఉద్యోగులుగానే ఉంటారని, తరువాత ఎఎఐ నుంచి విడిపోయినప్పుడు కొత్త యాజమాన్యమే ఉద్యోగుల వ్యయాన్ని భరిస్తుందని వివరించారు.

## హేమంత్ సోరెన్ కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం

### జెఎంఎం నుంచి ఆరుగురికి, కాంగ్రెస్ నుంచి నలుగురికి, ఆర్‌జెడి నుంచి ఒకరికి చోటు




**రాంచి :** వారం రోజుల క్రితం జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జెఎంఎం నేత హేమంత్ సోరేన్ తాజాగా మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. ఇందులో భాగంగా 11 మందికి చోటు కల్పించారు. వారంతా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అందులో ఆరుగురు జెఎంఎం పార్టీకి చెందిన వారు ఉండగా, నలుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒకరు ఆర్‌జెడి సభ్యుడు ఉన్నారు. వీరితో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ రాజ్‌భవన్‌లోని అశోక్ ఉద్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయించారు. జెఎంఎం ఎమ్మెల్యేలు సుదివ్యకమార్, దీపక్ బిరువా, రాందాస్ సోరెన్, చంద్రా లిండా యేగేంద్ర ప్రసాద్, హఫీజుల్ హసన్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దీపక్ పాండే సింగ్, శిల్పి నేహా టిర్కే, ఇర్ఫాన్ అన్సారీ, రాధాకృష్ణ కిషోర్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా జెఎంఎం ఎమ్మెల్యే స్టీఫెన్ మరాండీ ప్రమాణం చేశారు. కాగా, ఇటీవలే జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 81 నియోజకవర్గాలకు గానూ జెఎంఎం కూటమికి 56 స్థానాలు, ఎన్‌డిఎ కూటమికి 24 స్థానాలు లభించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జెఎంఎం చీఫ్ హేమంత్ సోరేన్ గత నెల 28న ప్రమాణ స్వీకారం చేశారు.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా మన్మోహన్‌సింగ్ ప్రమాణం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ చేత సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా గురువారం నాడు భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీం కోర్టులో మంజూరైన 34 న్యాయమూర్తుల స్థానాలలో న్యాయమూర్తుల సంఖ్య 33కు పెరిగింది. జస్టిస్ మన్మోహన్ (61) ప్రమాణస్వీకారం సుప్రీం కోర్టులో జరిగింది. ఆయన పేరును నవంబర్ 28న సుప్రీం కోర్టు కొల్లీజియం సిఫార్సు చేసింది. డిసెంబర్ 3న ఆయన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## షిండే శకం ముగిసింది..

### ఆయన మళ్లీ సిఎం కాలేరు : సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు



**ముంబయి :** మహారాష్ట్రలో గత పది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని బిజెపి బుధవారం అధికారికంగా ప్రకటించింది. డిప్యూటీ సిఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లు ఎన్నికయ్యారు. వారు గురువారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇక షిండే శకం ముగిసింది' అని వ్యాఖ్యానించారు. ఏక్‌నాథ్ షిండే బిజెపి ఇన్ని రోజులూ ఉపయోగించుకుందని.. ఇప్పుడు మాత్రం పక్కకు నెట్టేసిందని వ్యాఖ్యానించారు. 'షిండేని బిజెపి పావులా వాడుకుంది. ఇప్పుడు పక్కకు నెట్టేసింది. ఇక షిండే శకం ముగిసింది. ఆయన మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేరు. ఆయన అవసరం కూడా బిజెపికి లేదు. అవసరమైతే షిండే పార్టీని కూడా బిజెపి విచ్ఛిన్నం చేయగలదు. ఇది ప్రధాని మోదీ రాజకీయ పంథా' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మహాయుతికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ.. 15 రోజులైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారని రౌత్ అన్నారు. అంటే వారి కూటమిలో ఏదో లోపం ఉందని అర్థమవుతోందన్నారు. అది ఇవాళ కాకపోయినా తర్వాతైనా బయటకి వస్తుందని చెప్పుకొచ్చారు.

## సంభల్ హింసలో నిందితుల ఫోటోలను

# గోడలపై ప్రదర్శిస్తాం

- జిల్లా కలెక్టర్ రాజేందర్ పెన్సియా వెల్లడి
- ఇప్పటివరకు 400మంది నిందితుల ఫోటోలు సేకరించామని ప్రకటన
- బాబ్రీ మసీదు కూల్చివేతకు ముందు రోజైన డిసెంబరు 5న సంభల్‌లో భారీగా పోలీసు భద్రత



**సంభల్ :** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని సంభల్ జిల్లాలో పోలీస్ భద్రతను మరింతగా పెంచడం ఆ ప్రాంత పరిస్థితిని చెప్పకనే చెబుతోంది. 1992లో హిందువులు అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేసిన డిసెంబరు 6వ తేదీకి ముందురోజైన గురువారంను పరిగణనలోనికి తీసుకున్న సంభల్ అధికార యంత్రాంగం ముందస్తుచర్యలో భాగంగా భద్రతా బలగాలను మోహరింపజేయాలని నిర్ణయించింది. అదే సమయంలో సంభల్‌లో హింసాకాండకు కారకులైన వారి పోస్టర్లు వేయాలని నిర్ణయించింది. సంభల్‌లో అగ్నిప్రమాదం, విధ్వంసం వల్ల జరిగిన నష్టం రూ. ఒక కోటి కంటే ఎక్కువగానే ఉన్నదని పోలీసులు అంచనా వేశారు. సంభల్ హింసలో భాగస్వాములైన వారి పోస్టర్లను వేసి వారిగురించి అధికస్థాయిలో ప్రచారం చేయాలని అనుకుంటున్నాం' అని సంభల్ జిల్లా మేజిస్ట్రేట్ రాజేందర్ పెన్సియా 'పిటిఐకి' చెప్పారు. 'గత నెలలో షాహీ జమా మసీదు సర్వే సందర్భంగా సంభల్ జిల్లాలో చెలరేగిన హింసాకాండతో సంబంధం ఉన్నటువంటి 400మందికి పైగా వ్యక్తులను అధికారులు గుర్తించడం జరిగింది అని డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ చెప్పారు. శాంతి సంఘం సమావేశం 3గంటల సమయంలో జరుగనుందని, పరిస్థితికి సంబంధించిన అన్ని వివరాల గురించి చర్చిస్తామని తెలియజేశారు. ప్రస్తుతం మేము హింసకు బాధ్యులైన వారి పోస్టర్‌ను డిజైన్ చేస్తున్నాం. అది ఈ రోజుకు పూర్తి అవుతుంది. 400మందిని హింసకు పాల్పడిన వారిగా గుర్తించాం. ఇప్పటికే అరెస్ట్‌చేసిన వారిని మినహాయించి మిగతా వారి పోస్టర్లు వేస్తాం 'అని రాజేందర్ పెన్సియా తెలియజేశారు. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కృష్ణకుమార్ బిష్ణోయ్ చెప్పారు. మిగతా నిందితులను పట్టుకునే ప్రయత్నంలోనే ఉన్నామని చెప్పారు. సంభల్ హింసాకాండకు కారకులైన వారిలో 34మందిని ఇప్పటి వరకు అరెస్ట్ చేయగా, ఇంకా 83మంది వ్యక్తులు దొరకాల్సి ఉందని, 400మంది వ్యక్తుల ఫోటోగ్రాఫ్‌లను సేకరించామని, ప్రత్యేక గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నదని ఎస్‌పి కృష్ణకుమార్ బిష్ణోయ్ తెలియజేశారు. డ్యామేజీ రూ.1 కోటికి మించి ఉంటుందని, దీనిలో ట్రాన్స్‌ఫార్మర్లను తగులబెట్టడం, కెమెరాలను ధ్వంస ం చేయడం, వాహనాలకు నిప్పుపెట్టడం లాంటివి ఉన్నాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వారిని ఒకసారి గుర్తించడమే తర్వాయని, వెంటనే వారిపై ఛార్జిషీట్లు నమోదు చేస్తామని ఎస్‌పి తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నవంబరు 27 సంఘటన గురించి మాట్లాడుతూ సంభల్ హింసలో పాల్గొని ప్రజల ఆస్తులకు నష్టం కలిగించినవారి ఫోటోలను ముద్రించి పబ్లిక్ వాల్స్‌పై ప్రదర్శిస్తామని చెప్పింది. అయితే ఈ హింసకు సంబంధించిన పాల్గొన్నవ్యక్తులకు సంబంధించిన పలువురి ఫోటోలను ఇప్పటికే విడుదల చేశామని సంభల్ పోలీసులు చెప్పారు.ఈ ఫోటోలలో ఉన్న 9మందిని ఇప్పటికే గుర్తించామని, అయితే మాస్కులు ధరించిన మిగతా వ్యక్తులను కనుగొనుగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. వారి అరెస్ట్‌చేసేందుకు సహకరించినట్లయితే వారికి రివార్డును ప్రకటిస్తామని ఒక అధికార ప్రతినిధి ఒకరు ఇంతకుముందు చెప్పారు.

## ఇద్దరు మాజీ సర్పంచ్‌లను హత్యచేసిన నక్సలైట్లు



**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మాజీ సర్పంచ్‌లను నక్సలైట్లు హతమార్చినట్లు పోలీసులు గురువారం తెలిపారు. నక్సలైట్లు తమ కరపత్రాలలో మాజీ సర్పంచ్ సుక్లు పర్సా బిజెపి కార్యకర్త అని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ సుఖ్‌రామ్ అవ్లామ్ పోలీసు క్యాంపు ఏర్పాటులో పోలీసులకు సహాయం చేశారని ఆరోపించారు. పర్సాను బుధవారం భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య చేయగా, అవ్లామ్ అదే రోజు నైమెడ్ ప్రాంతంలో హత్యకు గురయ్యాడని ఇక్కడి అధికారి తెలిపారు. ఈ ఘటనలతో, బీజాపూర్‌తో సహా రాష్ట్రంలోని బస్తర్ డివిజన్‌లో ఈ సంవత్సరం ఇప్పటివరకు నక్సలైట్లు కనీసం 55 మందిని చంపినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, నక్సలైట్లు సోమవారం బిరియా భూమి గ్రామం నుండి పర్సాను అపహరించి, బుధవారం హత్య చేసినట్లు అధికారి తెలిపారు. బుధవారం రాత్రి నక్సలైట్లు మృతదేహాన్ని గ్రామ సమీపంలో పడేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఘటనా స్థలంలో లభించిన కరపత్రంలో, భైరామ్‌గఢ్ ఏరియా మావోయిస్టుల కమిటీ పర్సా హత్యకు బాధ్యత వహించిందని , అతను అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) కార్యకర్తగా ఉన్నాడని పేర్కొన్నట్లు అధికారి తెలిపారు. బుధవారం రాత్రి నైమెడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాదర్, కైకా గ్రామాలను కలిపే రహదారిపై సుఖ్‌రామ్ అవ్లాం మృతదేహం లభ్యమైందని అధికారి తెలిపారు. అవ్లామ్‌ను నక్సలైట్లు కిడ్నాప్ చేసి చంపినట్లు పోలీసులకు గురువారం ఉదయం సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారని ఆయన చెప్పారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, బీజాపూర్ పట్టణంలో నివసించే అవ్లామ్ వ్యవసాయ సంబంధిత పనుల కోసం తన గ్రామమైన కడేర్‌కు వెళ్లాడు. బుధవారం సాయంత్రం అతను వ్యక్తిగత పని కోసం ఖాదర్ నుండి కైకాకు వెళుతుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని అడ్డగించి అడవిలోకి తీసుకెళ్లారని అధికారి తెలిపారు. రాత్రి రోడ్డుపై మృతదేహం కనిపించిందని తెలిపారు. నక్సలైట్ల గంగలూర్ ఏరియా కమిటీ శిబిరం ఏర్పాటు చేయడంలో పోలీసులకు అవ్లామ్‌కు మద్దతిస్తోందని ఆరోపించిన కరపత్రం ఘటనా స్థలంలో లభించిందని అధికారి తెలిపారు. దుండగుల కోసం రెండు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ముడా కేసులో...కర్నాటక ప్రభుత్వం నోటీసులు

### సింగిల్ జడ్జిబెంచ్ తీర్పును సవాల్ చేస్తూ సిఎం సిద్ధరామయ్య అప్పీల్‌పై హైకోర్టు ఆదేశం

### 2025 జనవరి 25నాటికి విచారణ వాయిదా



**బెంగళూరు :** కర్నాటకలో మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) స్థల కేటాయింపుల కేసు రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ముడా స్థల కేటాయింపుల కుంభకోణంలో తనపై దర్యాప్తునకు అనుమతించిన గవర్నర్ నిర్ణయాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దాఖలు చేసిన అప్పీల్‌పై గురువారం కర్ణాటక హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వం సహా ఇతర ప్రతివాదులకూ నోటీసులు జారీ చేసింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్‌వి.అన్వరియా, జస్టిస్ కెవి.అరవింద్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 25 నాటికి వాయిదా వేసింది. తనకు ఎదురు దెబ్బ తగిలిన హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ అక్టోబరు 24న హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ముందు సిద్ధరామయ్య అప్పీల్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన సతీమణి పార్వతి బిఎం కు మైసూరు నగరాభివృద్ధి సంస్థ 14స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో తనపై విచారణకు థావర్ చంద్ గెహ్లాట్ ఆమోదించడాన్ని సవాల్‌చేస్తూ సిఎం సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను సెప్టెంబరు 24న జస్టిస్ నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. టిజె అబ్రహాం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై దాఖలు చేసిన మూడు పిటిషన్ల ఆధారంగా ఒక ప్రధాన ప్రాంతంలో ముడా ద్వారా 14సైట్ల కేటాయింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. తనపై విచారణకు గెహ్లాట్ ఆమోదం యొక్క చట్టబద్ధతను సిఎం సిద్ధరామయ్య సవాల్‌చేశారు. హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఆదేశాలను అనుసరించి మరుసటిరోజే ఇక్కడి ప్రత్యేక న్యాయస్థానం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసుల విచారణకు ఆదేశించింది.డిసెంబరు 2లోగా దర్యాప్తు నివేదికను సమర్పించాలని సూచించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి బిఎం, బావమరిది మల్లికార్జునస్వామి, దేవరాజ్, స్వామి వారి నుంచి భూమిని కొనుగోలు చేసి పార్వతికి కానుకగా ఇచ్చారని, మరికొంతమంది పేర్లను మైసూరులోని లోకాయుక్త పోలీసులు సెప్టెంబరు 27న నమోదు చేసి ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. సెప్టెంబరు 30న, లోకాయుక్త ఎఫ్‌ఐఆర్ నమోదును పరిగణనలోనికి తీసుకుని, సిఎంతో సహా ఇతరులపై కేసు బుక్ చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్)ను దాఖలు చేసింది. అంతేకాకుండా కేసును విచారిస్తోంది. ముడా పార్వతికి 3.16ఎకరాల భూమికి బదులుగా 50: 50 రేషియో స్కీమ్ కింద ప్లాట్లను కేటాయించింది. కేటాయించిన ప్లాట్లను ముడా రెసిడెన్షియల్ లేఓట్‌గా అభివృద్ధి చేసింది.వివాదాస్పద పథకం కింద అభివృద్ధి చెందని భూమికి బదులుగా భూమిని కోల్పోయేవారికి నివాస లేఔట్‌ల ఏర్పాటు కోసం ముడా 50శాతం అబివృద్ధి చెందిన భూమిని కేటాయించడం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆరోపణలకు తెరలేపిన ట్లైంది. మైసూరు శివార్లలోని కసరే గ్రామంలోని 464సర్వే నెంబర్‌లో ఉన్న ఈ 3.16ఎకరాల భూమిపై ముఖ్యమంత్రి భార్య పార్వతి బిఎం పై చట్టబద్ధమైన హక్కులేదని ఆరోపించబడింది. అయితే సైట్ల కేటాయింపు వివాదాలకు దారితీయడంతో పార్వతి తనకు ముడా కేటాయించిన 14సైట్లను రద్దు చేయాలని మైసూరు నగరాభివృద్ధి సంస్థను కోరగా ముడా ఆమె అభ్యర్థనను అంగీకరించిన విషయం విదితమే.

## లేటరల్ ఎంట్రీ ద్వారా 63 మంది నియామకం : కేంద్రం




**న్యూఢిల్లీ :** వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలలో లేటరల్ ఎంట్రీ ద్వారా 63 మంది స్పెషలిస్టులను 2019 నుంచి 2023 మధ్య కాలంలో నియమితులైనట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఇందులో 35 మంది కాంట్రాక్ట్ విధానంలో, మిగతా 28 మంది డిప్యూటేషన్ విధానంలో తీసుకున్నట్లు గురువారం రాజ్యసభకు వెల్లడించారు. 2018 నుంచి ప్రత్యేక పనుల కోసం విశిష్ఠ విజ్ఞానం, నిపుణత కలిగిన వారిని లేటరల్ ఎంట్రీ విధానంలో జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ స్థాయిలో తీసుకుంటున్నట్లు తెలిపారు. 2019లో ఎనిమిది మంది జాయింట్ సెక్రెటరీ స్థాయిలో నియమించగా, వారిలో ఐదుగురు కాంట్రాక్ట్, ముగ్గురు డిప్యూటీషన్ పద్ధతిలో చేరారని అన్నారు. 2021లో లేటరల్ ఎంట్రీ విధానంలో ముగ్గురిని జాయింట్ సెక్రెటరీలుగా, 18 మందిని డైరెక్టర్‌లుగా, తొమ్మిది మందిని డిప్యూటీ సెక్రెటరీలుగా నియమించినట్లు, వారిలో 14 మంది కాంట్రాక్ట్, 16 మందిని డిప్యూటేషన్ ద్వారా తీసుకున్నట్లు తెలిపారు. 2023లో 25 మందిని ఈ విధానంలో తీసుకున్నామన్నారు.

**ఖాళీల వివరాలు శాఖల వద్దే ఉంటాయి**

ఖాళీలు ఏర్పడడం, వాటిని భర్తీ చేయడమనేది నిరంతర ప్రక్రియ అని, ఖాళీల వివరాలు ఆయా మంత్రిత్వ శాఖలు లేదా విభాగాల వద్ద ఉంటాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తమ వద్ద ఏర్పడిన ఖాళీలను నిర్ణీత గడువులోగా ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలను కేంద్రం ఆదేశించినట్లు కేంద్ర ఉద్యోగ, సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖిత సమాధానంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఖాళీలపై అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా జవాబిచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగుల వివరాల గురించి అడిగిన మరో ప్రశ్నకు జవాబిస్తూ ఆ వివరాల కూడా ఆయా మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, యుపిఎస్‌సి, ఎస్‌ఎస్‌సి, ఆర్‌ఆర్‌బి , ఐబిపిఎస్ వంటి సంబంధిత నియామక ఏజెన్సీల వద్ద ఉంటాయన్నారు. కాంట్రాకు ఉద్యోగాలను జనరల్ ఫైనాన్షియల్ రూల్స్, 2017 నిబంధనల మేరకే తీసుకుంటారన్నారు.

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శుక్రవారం, డిసెంబరు 06

## బిజెపి ఖాతాలోకి మహారాష్ట్ర

మహారాష్ట్ర ఓటర్లు మహాయుతి కూటమికి సంపూర్ణ మెజారిటీ ఇచ్చినా ప్రభుత్వం ఏర్పాటుకు 12 రోజులు సమయం అవసరమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రచారానికి సారథ్యం వహించిన ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండె నుంచి ఆ పదవిని – అనగా మహారాష్ట్ర ప్రభుత్వ సారథ్య బాధ్యతను బిజెపి చేబట్టేటట్లు షిండేను ఒప్పించేందుకు ఈ వ్యవధి తప్పనిసరి అవసరమైంది. ఎట్టకేలకు గురువారం సాయంత్రం బిజెపినేత దేవేంద్ర సరిత గంగాధర్ ఫడ్నవీస్(55 సం.) ముఖ్యమంత్రిగా, ఏక్‌నాథ్ షిండే (శివసేన), అజిత్ పవార్(ఎన్‌సిపి) ఉపముఖ్యమంత్రులుగా మంత్రివర్గంపదవీ ప్రమాణం స్వీకరించింది. బిజెపి శాసనసభాపక్ష నాయకుని ఎన్నిక, మహాయుతి కూటమి నాయకుని ఎన్నిక జరగకమునుపే బిజెపి అధిష్టానం మంత్రివర్గ ప్రమాణస్వీకార తేదీని నిర్ణయించటం విశేషం. వివిధ వాదనలు, పదవుల డిమాండ్లు చేస్తున్న షిండేపై ఒత్తిడి పెంచే ఎత్తుగడగా దీన్ని చూడవచ్చు. మరో భాగస్వామ్య పక్షం ఎన్‌సిపి(అజిత్ పవార్) ముందే ముఖ్యమంత్రిపదవి బిజెపి చేబట్టేందుకు అంగీకరించింది. 288 స్థానాలుగల అసెంబ్లీలో బిజెపి 132 సీట్లు, శివసేన(షిండే) 57, ఎన్‌సిపి(అజిత్ పవార్) 41గెలుపొందాయి. కూటమిలో అతిపెద్ద పార్టీగా, ఏకపక్ష మెజారిటీకి 13సీట్ల దూరంలో ఉన్న బిజెపి ముఖ్యమంత్రి పదవి కోరుకోవటం సహజం. అయితే సంకీర్ణ రాజకీయాల్లో అలా అని నియమం ఏదీలేదు. 2014లో దేవేంద్ర ఫడ్నవీస్ తొలిసారి ముఖ్యమంత్రిత్వం చేబట్టారు. ఆయన పిన్నవయస్కుడేగాక మహారాష్ట్రకు మొట్టమొదటి బిజెపి ముఖ్యమంత్రి. నాడు అవిభాజ్య శివసేన–బిజెపి సంకీర్ణ భాగస్వాములు. బిజెపికి 122, శివసేనకు 63 సీట్లు లభించాయి. 2019లో అదే కూటమికి తిరిగి మెజారిటీ లభించింది. (బిజెపి 105, శివసేన 56) అయితే బిజెపి కేంద్రనాయకత్వం మౌఖికంగా ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి పదవి తమకు ఇవ్వాలని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే పట్టుబట్టాడు. అందుకు బిజెపి నిరాకరించింది. గవర్నర్‌ని అడ్డం పెట్టుకుని అప్పుడు నడిపిన డ్రామాలో ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా, అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా ఉదయాన్నే రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయటం, శరద్ పవార్ కుటుంబం ఒత్తిడితో అజిత్ పవార్ వెనక్కు వెళ్లిపోవటం, 80గంటల్లోనే ఆ ప్రభుత్వ రాజీనామా, రాష్ట్రపతి పాలన విధింపు వంటి ఘటనలు చకచకా జరిగిపోయాయి. అప్పుడు కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేన అనూహ్య సంగమం (మహా వికాస్ అగాఢి) ఏర్పడింది. ఆ కూటమి ప్రభుత్వానికి ఉద్ధవ్ థాక్రే ముఖ్యమంత్రి అయినారు. రెండున్నర సంవత్సరాల తదుపరి బిజెపి ప్రోద్బలంతో ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేన చీలిపోయింది. మెజారిటీ ఎమ్మెల్యేలు షిండే వెంట రావటంతో 2022 జూన్ 22న అగాఢి ప్రభుత్వం పతనమైంది, కొత్త సంకీర్ణం కొలువుతీరింది. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కావాలనుకున్నా, పార్టీ అధినాయకత్వం వ్యూహాత్మకంగా షిండేని ముఖ్యమంత్రిని చేసి, అంతకు రెట్టింపుకు పైగా సీట్లున్నప్పటికీ ఫడ్నవీస్‌ని ఉపముఖ్యమంత్రిగా నియమించింది. అటుతర్వాత కొద్దిమాసాలకు అజిత్ పవార్ ఎన్‌సిపిని చీల్చి మహాయుతి కూటమిలో చేరి మరో ఉపముఖ్యమంత్రి అయినారు. మెజారిటీ సీట్లున్న పార్టీకే ముఖ్యమంత్రి పదవి దక్కాలన్న నియమం లేదన్న షిండే వాదనకు అదే ప్రాతిపదిక. తన పాలన, పథకాల వల్లనే మహాయుతికి ప్రజలు మెజారిటీ సీట్లు ఇచ్చారన్నది ఆయన వాదన. చివరికి ప్రధాని నిర్ణయమే శిరోధార్యమన్నారు.

ఏమైతేనేం, మహారాష్ట్రపై తమ కాషాయ జెండా ఎగరాలనుకున్న బిజెపి నిరీక్షణ తిరుగులేనిరీతిలో ఫలించింది. శివసేన వ్యవస్థాపకుడు, హిందూత్వవాది బాల్‌థాక్రే జీవించి ఉన్నంతకాలం బిజెపి జూనియర్ భాగస్వామి. రెండు పార్టీలకు సిద్ధాంతమమేకత ఉంది. కాకపోతే బాల్‌థాక్రే స్థానికతవాదం, దక్షిణాది వ్యతిరేకత ఆయన్ను పైచేయిగా నిలబెట్టింది. శరద్‌పవార్ సోనియా గాంధీకి కాంగ్రెస్ అధ్యక్ష పదవి కట్టబెట్టటాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ నుంచి బయటకువచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)పేరుతో సొంత పార్టీ పెట్టుకోవటంతో మహారాష్ట్రలో కాంగ్రెస్ క్షీణింపు మొదలైంది. కాంగ్రెస్ లౌకికవాదానికి, శివసేన హిందూత్వకు పొంతనలేకపోయినా బిజెపిని అధికారానికి దూరంగా ఉంచేందుకు శరద్‌పవార్ మధ్యవర్తిత్వంతో అవకాశవాదాన్ని ఆశ్రయించి ఒక్కటై మహావికాస్ అగాఢి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. రెండున్నర ఏళ్లకు అది కూలిపోగా, మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారు.

హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయాలతో పార్టీపై, ప్రభుత్వంపై ప్రధాని నరేంద్రమోదీ పట్టు బిగిసింది. లోక్‌సభ ఎన్నికల్లో పరాజయాల తర్వాత మోదీని అదుపులో పెట్టేందుకు ప్రయత్నించిన ఆర్‌ఎస్‌ఎస్ సణుగుళ్లు సద్దుమణిగాయి. మోదీ కోరుకున్నట్లే ఆయన 'పరమ మిత్రుడు' ఫడ్నవీస్‌కు ముఖ్యమంత్రి పీఠం దక్కింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిసా ముఖ్యమంత్రులను కూడా మోదీయే ఎంపిక చేశారు. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరిగే బిహార్‌లో ముఖ్యమంత్రిని కూడా మోదీయే నిర్ణయించినా ఆశ్చర్యం లేదు!!

# రేవంత్ రెడ్డి పాసా? ఫెయిలా? తెలంగాణ ఏమంటున్నది!



ఎస్.కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాస య్యారా? లేక్ ఫెయిలయ్యారా ? అనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినందున ఈ చర్చ సహజమే. అయితే ఒక ముఖ్యమంత్రి పనితీరు లేదా ప్రభుత్వ పనితీరును కేవలం ఒక్క ఏడాదికాలంలోనే ఎలా అంచనా వేయగలం! ఎలాంటి నిర్ధారణకు రాగలం! పాస్ లేదా ఫెయిలు మార్కులు ఎలా వేయగలం? దానికున్న ప్రామాణికత ఏమిటి? ప్రాతిపదిక ఏమిటి? ఏ కొలమానంతో మార్కులను వేయగలం! ప్రభుత్వం ఏర్పడి కొత్త సంసారం సర్దుకునే లోపే లోక్‌సభ ఎన్నికలు వచ్చి పడ్డాయి. వాటి తర్వాతే పరిపాలనపై రేవంత్ ప్రభుత్వం దృష్టి పెట్టడానికి వీలవుతోంది. అంటే ఆరేడు నెలలుగానే పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, విధానాల రూపకల్పనకు ప్రభుత్వానికి వెసులుబాటు ఏర్పడిందని చెప్పాలి

సిఎం రేవంత్ రెడ్డి పరిపాలన ఎలా వుంది? ఆయన విజయాలు, అపజయాల సంగతి ఏమిటనే ప్రశ్నల కన్నా ముందు, ఎలాంటి సవాళ్ల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందో అర్థం చేసుకోవల సి ఉన్నది. ఆ సవాళ్ళలో మొట్టమొదట కనిపిస్తున్న 'భారీ పర్వతం' ఆర్థిక సమస్య. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ ఎస్ పార్టీ తొమ్మిదిన్నర సంవత్సరాలలో సంపద సృష్టించినట్టు, బంగారు తెలంగాణగా మార్చేసినట్టు క్లెయిమ్ చేసుకుంటూ ఉంటుంది. ఆ పార్టీ నాయకులు, లేదా కెసి ఆర్, కెటిఆర్ 'భజన బ్యాచ్'లు, 'భక్త బృందాలు' సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచా రం, వాస్తవంలో 'డొల్ల' అని ప్రజలకు తెలిసిపోయింది.

వరుసగా రెండుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాల న్న బిఆర్‌ఎస్‌కు బ్రేకువేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి. అపర చాణక్యుడిగా పేరున్న కెసిఆర్‌ను సామాన్య నాయకుడు రేవంత్ రెడ్డి ఓడించడం అసాధారణ విషయం. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చినందున రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కింది. మంత్రిగా కూడా పనిచేయని ఆయనకు సిఎం పదవి లభించడం విశేషం. తమ పాలనను 'ప్రజాపాలన'గా రేవంత్ నిర్వచించారు. ప్రజాపాలన ఏడాది ముగిసిన సందర్భంగా ప్రభుత్వం విజయోత్సవాలను నిర్వహిస్తోం ది. కెసిఆర్ హయాంలో ఎప్పుడూ ప్రజా ప్రభుత్వం లేదా ప్రజాపాలన అనే మాట వినబడలేదు. కెసిఆర్ పాలన అని మాత్రమే చెబుతూ వచ్చారు. అసలు ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారంటూ బిఆర్‌ఎస్, బిజెపిలు రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పిస్తున్నాయి.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం, అప్పుల పరిస్థితిని దాటి అభివృద్ధిని గాడిలో పెట్టడం మామూలు వ్యవహారం కాదు. అప్పులతో అతలాకుతలమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకుగాను ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోంది. 2014 నుంచి 2023 వరకు బిఆర్ ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7లక్షల కోట్ల అప్పులు చేసింది. వాటికి చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలు కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు అడ్డుగోడగా మారాయి.

ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో ఎప్పుడు జీతాలు పడతాయో తెలియని పరిస్థితి ఉండేది. ముందుగా ఆ పరిస్థితిని సిఎం రేవంత్ సాహసోపేతంగా మార్చగలిగారు. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించే పద్ధతిని పునరుద్ధరించడం ముఖ్యమంత్రికి ప్లస్ పాయింటు. ఇది ఉద్యోగుల్లో రేవంత్‌పై అభిమానం ఏర్పడడానికి కారణమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వం చెల్లించకుండా బకాయి పెట్టిన దాదాపు రూ.లక్ష కోట్ల బిల్లులను క్రమపద్ధతిలో 'క్లియర్' చేసే విధానాన్ని ముఖ్యమంత్రి అనుసరిస్తున్నారు.

కెసిఆర్ ప్రభుత్వం 'సంపద సృష్టి' పేరిట ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులు తీర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నది. కెసిఆర్ హయాంలో చేసిన అప్పులపై వడ్డీలు, కిస్తీల కింద రూ.64,516 కోట్లను ప్రతినెలా చెల్లించవలసిన పరిస్థితి నెలకొన్నది. చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్లలోపు ఉచిత గృహ విద్యుత్తు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, బియ్యం సబ్సిడీ, ఉపకారవేతనాలు, డైట్ చార్జీల పెంపు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు రూ.61,194 కోట్లను ఈ ఏడాదిలో ప్రభుత్వం ఖర్చు చేసింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల సంక్షేమానికి నవంబర్ నాటికే దాదాపు రూ.9,888 కోట్లను రేవంత్ ప్రభుత్వం ఖర్చు చేసింది.

ఒకవైపు కెసిఆర్ చేసిన అప్పులను తీర్చాలి. మరో వైపు ఎన్నికల సందర్భంగా తమ పార్టీ ఇచ్చిన 'గ్యారెంటీల' అమలుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఏకకాలంలో రైతులకు రూ.20,617కోట్ల రుణాన్ని మాఫీచేసి సిఎం రేవంత్ రెడ్డి కొత్త రికార్డు నెలకొల్పారు. రాష్ట్రంలోని 25.36లక్షల రైతు కుటుంబాలను 'రుణవిముక్తి' చేశారు. ఒక్క ఏడాదిలోనే రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి దాదాపు రూ.57వేల కోట్లు ఖర్చు చేశారు. 'రైతు భరోసా' సంక్రాంతి తర్వాత అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 2న ప్రకటించారు.

ఆగస్టు,సెప్టెంబర్‌లలో భారీవర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారంతో పాటు, బాధితులకు సహాయం అందించడానికి రూ.260 కోట్లు కేటాయించారు. మహాలక్ష్మి, గృహజ్యోతితో పాటు యువవికాసం పథకాలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసింది.



గతంలో నిర్లక్ష్యానికి గురైన నిరుద్యోగులకు ఉద్యోగాలపై భరోసాను కల్పించడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. తొలి ఏడాదిలోనే వార్షిక ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదలచేసి 54,520 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం సంచలనం సృష్టిస్తోంది. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో 7,750మందిని నియమించింది. మరో 6,496 ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. బిఆర్‌ఎస్ ప్రభుత్వం 8 మెడికల్ కాలేజ్‌లకు జిఓలు ఇచ్చినా, కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కెసిఆర్ విఫలమైనట్టు విమర్శలున్నవి.

ఉద్యోగాల కల్పనలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైంది. రేవంత్ ప్రభుత్వం 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టి దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డు నెలకొల్పింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి నియామకాలు జరుపుతోంది. డిఎస్‌సి ద్వారా 55 రోజుల్లో 11 వేలమందికి ఉద్యోగాలు ఇవ్వడం పెద్ద కుదుపు. గ్రూప్1 పరీక్షలు వద్దంటూ కెసిఆర్ పార్టీ కృత్రిమ ఉద్యమాన్ని నడిపించింది. పదేళ్లపాటు గ్రూప్1 ఉద్యోగాలు రాలేదు. యువత బలిదానాలతో రాష్ట్రాన్ని సాధించుకున్నాం. లక్షలాదిమంది ఉద్యమబాట పట్టి తెలంగాణను సాధించుకున్నారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని అనుకున్నారు. కానీ పదేళ్లపాటు నియామకాలు చేపట్టకపోవడం బిఆర్‌ఎస్ కు మైనస్. 2011 తర్వాత గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించలేదు.13 ఏళ్ల తర్వాత 563మంది గ్రూప్ 1అధికారులు తెలంగాణ నిర్మాణం లో భాగస్వాములు కాబోతున్నారు. గత ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను తోసిపుచ్చడానికి ఆస్కారం లేదు. చాలాకాలం పాటు యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించకుండానే కెసిఆర్ కాలయాపన చేశారు.రేవంత్ ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తి కాకుండానే వైస్ చాన్సలర్లను నియమించారు.

''తెలంగాణ రైతులు 63 లక్షల ఎకరాల్లో కోటి యాభై మూడు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను పండించారు. సన్నవడ్లకు ఇస్తున్న బోనస్‌తో కౌలు రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. వచ్చే పదేళ్లు మా ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. బోనస్ కొనసాగిస్తుంది.ఈ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత తెలంగాణ ప్రజలదే. ప్రభుత్వం పైన జరుగుతున్న విష్రపచారాన్ని తిప్పికొట్టాలి''. అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్ పాలనలో. 'రైతు బంధు' పేరిట రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.10వేలు అందించింది. చేతికి ఎముకలేని చందంగా బడా భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, సంపన్నులు, ఎన్‌ఆర్‌ఐలకు కూడా 'రైతుబంధు' అందింది. తాము ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే రైతుల రుణమాఫీ చేసినందున 'రైతుభరోసా' కు ఆర్థిక అవరోధాలు ఎదురవుతున్నవి. రైతు భరోసా అమలు కాలేదని రైతులలో అసంతృప్తి ఉన్న మాట నిజమే. ఇదే అదనుగా 'కెసిఆర్ వుంటేనే బావుండనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది' అంటూ బిఆర్‌ఎస్ ప్రాయోజిత మీడియా పెద్దఎత్తున ప్రచారం ప్రారంభించింది. రైతు భరోసాకు సీలింగ్ విధించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలోని కేబినెట్ ఉపసంఘం దీనిపై సమర్పించనున్న నివేదికపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోబోతున్నారు. భూస్వాములు, పెట్టుబడిదారులు, ఇతర సంపన్నులను 'రైతుభరోసా' నుంచి మినహాయించవచ్చు. ఇదే జరిగితే, చిన్న సన్నకారు రైతులంతా రేవంత్ రెడ్డి వైపునకు 'బదిలీ' కావడం ఖా యం. రేవంత్ లక్ష్యం కూడా వారే. అర్హులకే రైతుభరోసా అందించాలన్నది సిఎం ధ్యేయంగా కనిపిస్తోంది. భూస్వాములు, సంపన్నులకు ఆగ్రహం కలిగినా, దాన్ని ఎలా తిప్పికొట్టాలో రేవంత్ కు తెలుసు. హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ ప్రక్షాళన వ్యవహారం కూడా రేవంత్ సర్కార్‌కు కొంత తలనొప్పిగా మారిన మాట నిజం. ఇది ప్రజల వైపు నుంచి కన్నా బిజెపి, బిఆర్‌ఎస్ వైపు నుంచి ఎక్కువ దుష్ప్రచారం జరుగుతుండడం వలన, ప్రతిపక్షాల ట్రాప్‌లో సాధారణ ప్రజలు సులభంగా చిక్కుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఎవరెన్ని విధాలుగా అడ్డుపడినా తమ ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచంతో పోటీపడేలా తయారుచేయడానికి వెనుకాడబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 3న స్పష్టం చేశారు.

'హైదరాబాద్ ఎప్పుడూ ఆటో పైలట్ మోడ్'లో ఉంటుంది. ముఖ్యమంత్రి ఎవరైనా, ప్రభుత్వం ఏ పార్టీది అయినా చాలా సులువుగా ఇక్కడ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయి. అందుకు తగిన వాతావరణం, శతాబ్దాలుగా విస్తరించిన నగరం, మౌలిక సదుపాయాల కల్పన ఉండడమే. రేవంత్ ప్రభుత్వం బాగా పనిచేస్తోంది. ప్రతి ప్రభుత్వానికి కొన్ని ప్రాధాన్యతలు ఉంటాయి. హైడ్రా, మూసీ పునరుజ్జీవం వంటి చర్యలవల్ల మధ్యతరగతి జీవులకు ఇబ్బంది కలుగుతున్నది. కానీ భవిష్యత్తు తరాల కోసం ఇలాంటి కఠినమైన నిర్ణయాలు తప్పనిసరి'' అని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ ఇటీవల ఇంటర్వ్యూలో చెప్పారు. కెసిఆర్ హయాంలో జరిగిన చెరువుల ఆక్రమణ, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో భారీ అపార్టుమెంట్ల నిర్మాణానికి అనుమతులివ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడం, ఖాళీ చేయాలని ఒత్తిడితేవడం వలన ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిరాశ్రయులయ్యే పేదలకు ప్రత్యామ్నాయ పరిహారం ఇవ్వాలని మేధావులు సిఎం రేవంత్ కు సూచిస్తున్నారు.

నాటి కెసిఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు, రైతు బంధు చుట్టూ తెలంగాణ సమాజాన్ని తిప్పింది. మహా మానవ నిర్మిత ప్రాజెక్టుగా కాళేశ్వరంను అంతర్జాతీయంగా ప్రచారం చేయడం, భారతదేశంలో రైతుబంధు వంటి పథకాలు మరెక్కడా లేవని అన్ని రాష్ట్రాలలో ప్రచారం సాగించి దీన్ని 'బంగారు తెలంగాణ' గా చిత్రీకరించడం కెసిఆర్ 'ట్రిక్కు'. ప్రజలను ఒక మిథ్యా ప్రపంచంలో జీవించేలా చేయడం కెసిఆర్‌కే సాధ్యమైంది. అందువల్ల ప్రజలకు వాస్తవాలు తెలిపి, తాము చేపడుతున్న కార్యక్రమాలు, ఆర్థిక పరిమితులపై ప్రజల్ని కన్విన్సు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కత్తి మీద సాము లాంటిది.

## నేలతల్లిని కాపాడుకుంటేనే మనుగడ

మానవుడు అభివృద్ధి పేరుతో చేపడుతున్న అనేక స్వార్థపూరిత చర్యల వల్ల పర్యావరణం గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. వాతావరణంలోకి నిత్యం పెద్దయెత్తున్న విడుదలవుతున్న కలుషితాల వల్ల ఋతువులు గతి తప్పాయి. సహజవనరులు తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కోట్లాది ఎకరాల సాగు భూములు తమ సారాన్ని కోల్పోయి బీడు భూములుగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పచ్చిక బయళ్లు ధ్వంసం కావటం వల్ల కూడా మేత లేక ఏటా లక్షలాది పశువులు మృత్యువాత పడుతున్నాయని, వీటిని రక్షించుకోవాలంటే నేల క్షీణతను అరికట్టి, తిరిగి వాటిని పునరుద్ధరించటం ఒకటే మార్గమని పర్యావరణ వేత్తలు హితవు పలుకుతున్నారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం ప్రపంచ నేల దినోత్సవాన్ని 'నేల ల సంరక్షణ – మెజర్, మానిటర్ అండ్ మేనెజ్' అనే థీమ్‌తో జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య అండ్ వ్యవసాయ సంస్థ(ఎఫ్ఎఒ) ప్రపంచ దేశాలను కోరింది. సృష్టిలోని సమస్త జీవరాశి మనుగడకు కావాల్సిన ఆహారాన్ని, ఆవాసాన్ని అందించేది నేల తల్లే. జీవన ధాతువుగా నిలవాల్సిన ఆ నేలతల్లే మానవుని స్వార్థపూరిత చర్యల వల్ల వెదజల్లబడుతున్న కాలుష్యం వల్ల తల్లడిల్లుతుంది. భూమిని పుడమితల్లిగా పూజించే భారత్ వంటి దేశాలలో కూడా నేల క్షీణత, ఎడారీకరణ అత్యంత వేగవంతంగా సాగుతున్నాయి. వాతావరణ మార్పులు, మానవ ప్రేరిత చర్యల వల్ల భారత దేశంలో 32 శాతం నేల క్షీణతకు గురవుతుండగా, 25 శాతం భూమి ఎడారిగా మారిపోతుందని భారత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023లో యుఎన్‌సిసిడి విడుదల చేసిన తాజా నివేదికలో భారతదేశ జనాభాలో దాదాపు 18.39 శాతం మంది ప్రజలు భూక్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొం ది. దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాలలో భూమి క్షీణత అధికంగా కనిపిస్తుందని, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూ అండ్ కాశ్మీర్, కర్ణాటక, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో 23.95 శాతం భూమి క్షీణతకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.

జీవ పరిణామ క్రమంలో అత్యంత విలువైన, సమర్థవంతమైన, సజీవమైన పాత్రను పోషించిన భూమి నేడు అత్యంత వేగంగా క్షీణతకు గురి కావటం ఒక విషాదం. కోట్లాది జీవరాశుల మనుగడకు అవసరమైన ఆహారానికి జీవంపోసే నేల నేడు జీవాన్ని కోల్పోయి నిర్జీవంగా మారిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల ఏటా కనీసం 1.6 బిలియన్ హెక్టార్ల నేల క్షీణతకు గురవుతుందని, ఇది సుమారు 3.2 బిలియన్ల మంది ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగిస్తుందని పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా భూమి క్షీణతకు గురై ఎడారిగా మారిపోతుంది. గడిచిన 10 సం.లో సుమారు 15 లక్షల హెక్టార్ల సాగు భూమి ఎడారిగా మారిపోయింది. 2050 నాటికి ప్రపంచ జనాభాలో మూడొంతుల మంది తీవ్రమైన కరువును ఎదుర్కొంటారని ఆ సంస్థ హెచ్చరిస్తుంది. దీంతో కోట్లాదిమంది ప్రజలు పర్యావరణ శరణార్థులుగా మారి ఇతర ప్రాంతాలకు, లేదా ఇతర దేశాలకు వలస పోవాల్సి వస్తుంది. విచ్చలవిడిగా రసాయినిక ఎరువుల వినియోగం, యాంత్రిక వ్యవసాయీకరణ, ఏకరూపక వ్యవసాయ సంస్కృతి మన దేశానికి హరిత విప్లవం అందించిన విధానాలు. ఇవే ఇప్పుడు నేలతల్లి పాలిట శాపాలుగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా హరిత విప్లవ కాలంలో అనుసరించిన వ్యవసాయిక విధానాల వల్ల నేల నిర్మాణం పూర్తిగా మారిపోయింది. దీంతో పాటు అభివృద్ధి పేరుతో పెద్దయెత్తున్న సాగుతున్న అటవీ విధ్వంసం, అడ్డు అదుపూ లేకుండా సాగుతున్న పట్టణీకరణ వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. భారతదేశం భూమి క్షీణతను తగ్గించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని 2015లో పారీస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమెట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సదస్సులో ప్రకటించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 26 మిలియన్ హెక్టార్ల నేలని తిరిగి పునరుద్ధరించే లక్ష్యంతో ఖాఫ్ పార్టీస్ చేపట్టిన బాన్ ఛాలెంజ్‌లో భారతదేశం భాగస్వామిగా చేరింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాలలో నేల కలుషితమై తన సారాన్ని కోల్పోయి ఎడారులుగా మారిపోతుంది. సకల జీవరాశులకు జీవం పోసే నేల తన జీవాన్ని కోల్పోయి నిస్సారంగా మారితే సృష్టిలోని సకల జీవరాశుల మనుగడ ఒక పెను సంక్షోభంలో పడుతుంది. ఈ సంక్షోభాన్ని అరికడితేనే మానవ మనుగడ కూడా సాధ్యమవుతుంది, లేకుంటే వినాశనమే.

**డాక్టర్ కె. శశిధర్,** 94919 91918

## కుంటుపడ్డ కుల వృత్తులు

అవును ఇదీ నిజమే, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని అందరికీ తెలుసు, ఇక్కడ ఒక్కో ప్రాంతానికి ఒక్కో చరిత్ర ఉంటుంది, వివిధ రకాల జాతులు, వివిధ రకాల మతాలు, కులాలు, సంస్కృతులు, పద్ధతులు, ఆచారాలు. సంప్రదాయాలు పాటించే వాళ్ళు ఎక్కువగా ఉంటారు, అయితే మన తెలుగు రాష్ట్రాలలో కులవృత్తులకు ప్రాధాన్యత చాలా ఉంటుంది. వివిధ రకాల వృత్తులమీద ఆధారపడి గతంలో చాలావరకు గ్రామీణ ప్రాంతాలలో ప్రజ లు జీవించేవారు,

**పారిశ్రామిక విప్లవం:** ముందుగా పారిశ్రామిక విప్లవ రంగం తొంభై దశకం వచ్చిన తరువాత మిషన్ల వాడకం పెరిగింది, మనిషికి పని తగ్గింది, అటు రైతులకు పని తగ్గింది, గతంలో ఎడ్ల ద్వారా వ్యవసాయం చేస్తే దానికి కమ్మరి, వడ్రంగిలకు పని లభించేది, ఆ రోజుల్లో ఊరు వెళ్లిన ఊర్లో 'రచ్చ బండ', అని 'కచ్చిరు' దగ్గర వడ్రంగులు పనులు చేస్తూ ముచ్చట పెట్టేవాళ్ళు, నేడు అంతా మరుగున పడిపోయింది,

వాటి స్థానంలో ట్రాక్టర్ మిషన్ వచ్చి పూర్తిగా టెక్నాలజీ వచ్చి పని సులువుగా అయ్యింది, అదే విధంగా వృత్తులు చేసుకునే వాళ్లకు పనిలేక నగరాలకు వలసపోయి ఏదో ఒకపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు, టెక్నాలజి రావొద్దు అని కాదు, కొంత మనిషికి ఉపాధి దిశగా ఉండాలి. ఇది పెద్ద మొత్తం లో కూలీలకు కష్టంగానే మారింది అని చెప్పవచ్చు.

**సబ్బండ వృత్తులు కనుమరుగు:** గ్రామీణ పల్లెలలో చెరువులు, కుంటలు, దర్శనం ఇస్తాయి, ఇందులోనే మన చాకలి వాళ్ళ ఊర్లో ఉన్న వాళ్ల బట్టలు తెచ్చి చెరువుల్లో ఉతికే వాళ్ళు, నేడు మన చాకలి కరువయ్యారు, వృత్తి పూర్తిగా చాలా గ్రామాలలో మానేశారు, అలాగే కుమ్మరి కులస్థులు కూడా మట్టితెచ్చి కుండలను సంప్రదాయ పద్ధతిలో చేసేవాళ్ళు, నేడు వాళ్ళు కనిపించడం లేదు, కుండలను వేరే ప్రాంతం నుండి దిగుమతి చేసుకొని, మన దగ్గర అమ్ముకోవడం జరుగుతుంది,

అదేవిధంగా గౌడ్‌లు ఒక్క తాటి, ఈత చెట్లపైనే ఆధారపడి జీవిస్తున్నారు, వీళ్ళకష్టం కూడా వర్ణనాతీతం. సుమారు నలభై అడుగుల ఎత్తులో ఉన్న తాటి చెట్టు ఎక్కడం చాలా కష్టమైన పనిగా భావించాలి, గౌండ్ల కష్టానికి ఫలితం దక్కడం లేదు, ప్రజలు మోడ్రన్ మందులు ఎక్కువ ఖరీదుకు కొని ఆరోగ్యానికి హానికరం అయినా మరీ తాగుతున్నారు, కానీ మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే 'నిరా'కు ధర పెట్టకపోవడం చాలా బాధాకరం.ప్రజలు అంతా మోడ్రన్ టెక్నాలజీకి అలవాటు పడ్డ రోజులు అయ్యాయి, ఇదే కుల వృత్తుల వాళ్ళు మహా నగరాలలో కూలీకి పనిచేస్తూ జీవిస్తున్నారు, అదేవిధంగా మిగతా కులాల వాళ్ళు సైతం అరకొరగా వేరే పని చేపడుతూ జీవనం సాగిస్తున్నారు. కాబట్టి కొన్ని కుల వృత్తుల మీద ఆధారపడి జీవించే వాళ్లకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి అని కోరుకుందాం!

**కిరణ్ ఫిషర్**

## అందరివాడు... అంబేద్కర్



6 నవంబర్
అంబేద్కర్
వర్ధంతి

నవ బుద్ధుడు నవభారత దర్శకుడు గొప్ప విద్యావేత్త మేధావి రాజీపడని పోరాటయోధుడు ,రాజ్యాంగ పిత అందరి బంధువు ఆధునిక మనువు సమసమాజ స్వాప్నికుడు సమసమాజ స్థాపకుడు భారత సమాజానికి పరిచయం అక్కరలేని మహోన్నత వ్యక్తి అంతర్లేని సమాజం కోసం తన జీవితాన్ని ధారపోసిన ఉత్తముడు అన్ని వర్గాల ప్రజలు అభిమానించి గౌరవించే వ్యక్తులలో ఆయన ఒకరు ఆయనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ (14 ఏప్రిల్ 1891 – 6 నవంబరు 1956). ముఖ్యంగా సామాజిక తరగతుల అభివృద్ధికై ఆయన చేసిన మొదటి పోరాటం కులం మతం పైన. భారత సమాజంలో కులం యొక్క పునాదులు ఎంత బలంగా ఉన్నాయో అంబేద్కర్ గుర్తించారు. కులం మతం యొక్క సంబంధాలు ఈ సమాజాభివృద్ధి పై వాటి పాత్రను తెలుసుకున్నాడు. దాన్నుంచి పాఠాలు నేర్చుకుని అనుభవాలను విశ్లేషించి చెప్పారు. కుల మతాలలోని ఉన్న కుళ్ళునంత ఎండగట్టాడు. భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న మన వాదాన్ని తగలబెట్టాలని నిలువెత్తు చాటి మనువాదం నుంచి విముక్తి పొందడమే మార్గమని ఆ దిశగా నడిపించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్.

అంబేద్కర్ ఇప్పటి మధ్యప్రదేశ్‌లోని మహర్‌కులంలో భీమాబాయి , రాంజీ సక్ పాల్ దంపతులకు జన్మించారు. ఆయన మొదటి నుంచి ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. అంబేద్కర్ ఆరేళ్ల అప్పుడే తల్లి భీమాబాయి నీ కోల్పోయాడు. ఊహ తెలియని వయసు నుంచే అనేక కష్టాలు చూసి చూశాడు. అంబేద్కర్ తండ్రి రాంజీ ఉద్యోగం విరమణ చేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా చదువుపై ఉన్న మక్కువను మాత్రం అంబేద్కర్ చంపుకోలేదు. పాఠశాలలో ఇతర కులాలకు చిన్న పిల్లలకు దూరంగా ఓ గోనె పట్టా వేసుకొని పాఠాలను శ్రద్ధగా విని విజ్ఞానవంతుడయ్యాడు. చిన్నతనంలోనే అంటరానితనం ఎలా ఉంటుందో స్వయంగా అనుభవించాడు. ఓ రోజు మరో ఊరు నుంచి ఎడ్లబండిపై ప్రయాణిస్తుంటే బండి తోలేవాడు వీరిని తక్కువ కులం అని బండి నుంచి దించేశాడు. అలాగే కుళాయి నుంచి నీళ్లు తాగుతుంటే ఇతర కులస్తులు దండించిన తీరు అంబేద్కర్‌ను వేదనకు గురిచేసింది. చిరుప్రాయంలోనే అవమానాలను చీదరింపులు ఎలా ఉంటాయో ఆ పసి హృదయానికి అర్థమైంది. అంబేద్కర్‌లో చదువుకోవాలనే తపన అంటరాని గుర్తించిన ఓ బ్రాహ్మణుడు అన్నంపెట్టి ఆదరించాడు. విజ్ఞానాన్ని అందించాడు. ఆ గురువు పేరును తన పేరులో మొదటగా చేర్చుకుని గురువుని గౌరవించాడు అంబేద్కర్. కొలంబియా లండన్ విశ్వవిద్యాలయాల నుంచి పిహెచ్‌డి, డిఎస్‌సి, పట్టాలు అందుకున్నాడు. ఉన్నత విద్య అభ్యసించిన అంబేద్కర్‌పై ఆధిపత్య పెత్తందారి వర్గాలు అసూయతో అక్కసు వెళ్లగక్కాయి. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రజా ఉద్యమాలను బలపరుస్తూ పోరాటయోధుల అక్రమ కేసులను తీసుకొని వాదించాడు. దళితుల్ని చైతన్యం చేయటం కోసం దళిత విముక్తి సంఘాన్ని 1924 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర లోని మహర్ లోని చౌదరి చెరువులో ఆధిపత్య కులాలకే హక్కు ఉండేది. ఆయన ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలేను గురువుగా చెప్పుకున్నాడంటే ఆయన గొప్పతనాన్ని నేటి సమాజం అర్థం చేసుకోవచ్చు. 1927 డిసెంబర్ 25న అంబేద్కర్ మనుస్మృతి నిదహనం చేయడం పెద్ద దుమారం రేపింది. అంబేద్కర్ సంపాదకత్వంలో ముక్ నాయక్ పక్షపత్రిక నడిచింది. 1927 సంవత్సరంలో బహిష్కృత భారతి మరాఠీ పక్ష పత్రిక ప్రారంభించాడు. కులాన్ని ఉపయోగించి విలువైన రచనల్ని అందించాడు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీని 1936 సంవత్సరంలో స్థాపించాడు. కమ్యూనిస్టులను బల పరచాల్సిన అవసరాన్ని గుర్తించి బొంబాయ్ నియోజకవర్గంలో డాంగే కమ్యూనిస్టు నాయకులతో కలిసి ఎన్నికలలో పాల్గొన్నాడు. బొంబై కౌన్సిల్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన గళాన్ని వినిపించాడు. ప్రజల డబ్బును ఇష్టా రీతిగా ఖర్చు చేయడం తగదని నాయకులను సూచించడం. రూపాయలు ఐదు వందలకు బదులుగా 75 నిర్ణయిస్తే సముచితంగా ఉంటుందని అంబేద్కర్ స్పష్టం చేశాడు. కార్మిక కర్షక సమస్యలను సభల్లో లేవనెత్తి చర్చకు పెట్టాడు. దేశంలోని లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచాలని అణిచివేయబడుతున్న వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరుకున్నాడు. నీ నిచ్చెన్న మెట్ల కులవ్యవస్థను సమూలంగా నిర్మూలన చేయడం కోసం అనేక వర్గాలను అన్వేషించాడు. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు కులాంతర వివాహం సహపంక్తి భోజనాలు భూములను జాతీయ లాంటి తదితర అంశాలను సూచించాడు. దళిత హక్కుల కోసం సామాజిక హోదా కోసం ఆయన ఎన్నో పోరాటాలు నిర్వహించారు. స్వాతంత్రం అనంతరం ఏర్పడిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ రచన కమిటీకి అంబేద్కర్ చైర్మన్ గా ఉన్నాడు. రాజ్యాంగ రచనలో సింహభాగం అంబేద్కర్ కృషే.' రాజ్యాంగం ఎంత ఉన్నతమైందో అది అమలు కానప్పుడు చెత్త బుట్టలో పడేసిన చిత్తు కాగితంతో సమానమేనని అనగలిగాడు అంబేద్కర్. రాజ్యాంగ అమలు పై ఆయన అనుమానాలు వ్యక్తం చేశాడు. 1951 ఫిబ్రవరి 5న అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందలేదు. కాంగ్రెస్కు సభలో మెజార్టీ ఉన్న ఆ బిల్లు ఆమోదం పొందక పోవడంతో అంబేద్కర్ ఆవేదనకు చెందాడు. బిల్లు ఆమోదం లభించినందుకు నిరసనగా న్యాయశాఖ మంత్రి పదవిని రాజీనామా చేశాడు. 'మహిళలు సాధించిన ప్రగతినే.... నేను దేశప్రగతికి కొలమానంగా భావిస్తానని' ప్రకటించిన మహోన్నత వ్యక్తి స్త్రీ పక్షపాతి అంబేద్కర్. 'హిందువుగా పుట్టడం నా చేతుల్లో లేకపోయినా హిందువుగా మాత్రం చనిపోనని ' చెప్పిన ఆయన 1956 అక్టోబర్ 14న నాగపూర్లో బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. బౌద్ధం స్వీకరించి రెండు నెలలు గడవకముందే 1956 డిసెంబర్ 6న భారత సభ్య సమాజం నుంచి ఆ మహానుభావుడు భౌతికంగా దూరం అయ్యాడు.ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ, ది బుద్ధ అండ్ హిజ్ ధర్మ, కుల నిర్మూలన, శూద్రులు అంటే ఎవరు, అస్పృశ్యులు అంటే ఎవరు, బుద్ధుడు ధర్మం, ఇలాంటి ముఖ్య రచనలు వారివి. భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవకు గుర్తింపుగా 1991 సంవత్సరంలో భారతరత్న అవార్డును ప్రకటించి గౌరవించింది. భారత రాజ్యాంగ కర్తగా ఆయన ఉన్నత స్థాయి శిఖరాలకు ఎదిగి ఒదిగిన తీరు మంత్రముగ్ధులను చేస్తుంది. కులం మతం పట్ల ఈ సమాజం గమనం పట్ల ఆయనకున్న అవగాహన, ఆచరణ అణగారిన జనాలను ఆలోచింపచేస్తోంది. నేటితరంలో ఉన్న యువత అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తూ ముందుకు నడవడమే నేటి సమాజంలో ఉన్న యువత ముఖ్య లక్ష్యంగా తీసుకోవాలి.....

**నరేష్ జాటోత్,** 8247887267

# హామీలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలి

ఆర్‌టిసి జెఎసి డిమాండ్

ఉద్యోగుల ఆధ్వర్యంలో 'చలో బస్ భవన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారించాలని ఆర్ టిసి జెఎసి డిమాండ్ చేసింది. గత ఎన్నికల సందర్భంగా ఆర్‌టిసి కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో గురువారం చలో బస్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఏలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని సైతం ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. దీనివల్ల ప్రభుత్వంపై గాని, యాజమాన్యంపై గాని ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిసినా కావాలనే జాప్యం చేస్తోందని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తి వేయాలని ఆయన డిమాండ్‌చేశారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు మాట్లాడుతూ మోటార్ వెహికల్ ట్యాక్సుల భారాన్ని కర్ణాటక ప్రభుత్వం భరిస్తోందని, ఇక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో కాం గ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత అక్కడ ఆర్‌టిసి సిబ్బందిని పెంచుతుం తెలంగాణలో మాత్రం సిబ్బందిని తగ్గిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశా రు. కారుణ్య నియామకాల వయో పరిమితిని ప్ర భుత్వ జీవో ప్రకారం ఆర్టీసి ఉద్యోగులకు కూడా 44. సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. జెఎసివైస్ చైర్మన్ కమలాకర్ గౌడ్ మా ట్లాడుతూ 2017 వేతన సవరణ జరిగినా, దానికి అనుబంధంగా ఉన్న అవన్స్ మాత్రం పెంచలేదని, 2013 వేతన సవరణలో జరిగిన అలవెన్సులనే ఇస్తూ శ్రమ దోపిడీ వేస్తోందని అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్ రాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను తీసివేసి 4 కోడ్‌లుగా విభజించటాన్ని ఆయన తప్పు పట్టారు. విభజించిన 4 కోడ్ కూడా రవాణా రంగ కార్మికులకి అను కూలంగా లేవన్నారు. ఆర్‌టిసి కార్మికులతో 12నుండి16 గంటలు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటోందన్నారు. కన్వీనర్ ఎండి మౌలానా , కోకన్వీనర్ కత్తుల యాదయ్య మాట్లాడుతూ సిసిఎస్ కు పాలకమండలి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# ఆర్‌టిసికి పూర్వ వైభవం దిశగా చర్యలు

ఏడాది కాలంలో అనేక మార్పులు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే రాష్ట్రంలో అతి ముఖ్యమైన ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్‌టిసి కి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేవి ధంగా చర్యలు చేపట్టింది. ఒకవైపు ప్రజలకు మెరుగైన ప్రయాణాన్ని కల్పించడంతో పాటు సంస్థ ఉద్యోగుల సమస్యలను సైతం ఒక్కొక్కటిగా పరిష్కరిసస్తూ ముందుకు వెళ్లుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది కొలువుదీరిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గత డిసెంబర్ 9 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు ఈ పథకం కింద 116.12 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని రూ.3913.81 కోట్లు రవాణా ఖర్చులను ఆదా చేసుకున్నారు. ఈ పథకం విజయవంతంగా అమలు కావడంలో ఆర్‌టిసి ఉద్యోగులు కీలక పాత్ర పోషించడంతో పాటు నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తున్నారు. ఆర్‌టిసి బస్సుల్లో రోజువారిగా సగటున 58 లక్షల మంది ప్రయాణిస్తుండగా ఇందులో 45 లక్షల మంది మహిళ లే ఉంటున్నారు. ఈ పథకం అమల్లోకి రాకముందు మహిళా ప్రయాణికులు 40 శాతం కాగా ఇప్పుడు అది 65 శాతానికి పెరిగింది. దీంతో ఆర్‌టిసి ప్రభుత్వ సహకారంతో ఈ ఏడాది కాలంలోనే 1389 కొత్త బస్సుల అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు హైదరాబాద్‌లో మెట్రో డీలక్స్ పాస్‌లను పునరుద్ధరించడంతో పాటు మెట్రో ఎక్స్‌ప్రెస్, జనరల్ పాసు దారులకు ఎసి బస్సుల్లో 10 శాతం రాయితీ కల్పించింది. అంతేకాకుండా హై దరాబాద్, శ్రీశైలం మార్గం ఓ 10 రాజధాని ఎసి బస్సులు, పలు జిల్లాలకు 75 డిలక్స్‌లు, హైదరాబాద్ నగరంలో 125 మెట్రోడీలక్స్ బస్సులనుఅందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా పర్యవరణ పరిరక్షణ చర్యల్లో భాగం గా హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లలో 251 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. అంతేకాకుంగా దశల వారిగా హైదరాబాద్‌లో 2400 ఎలక్ట్రిక్‌బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. వీటిలో పాటు ఆర్‌టిసి ఉద్యోగుల సంక్షేమానికి సైతం పెద్దపీట వేస్తోంది. చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న 2017 పిఆర్‌సి ప్రకటించి 21 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన వేతనాన్ని గత మే నుంచి అందజేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 42,057 మంది ఉద్యోగులు, 11,014 మంది రిటైర్డ్ ఉద్యోగులకు లబ్ది చేకూరింది. అందేవిధంగా 2013 బాండ్ల బకాయి లు రూ.280 కోట్లను విడుదల చేసి ఉద్యోగుల బ్యా ంక్ ఖాతాల్లో నగదు జమ చేసింది. అంతే కాకుం డా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ప్రభుత్వం తార్నాకలోని ఆర్‌టిసి ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దింది. వీటిలో పాటు ఉద్యోగులపై పని భారం తగ్గించేందుకు 3083 పోస్టుల భర్తీని వేగవంతం చేసింది.

## డ్రగ్స్ అమ్ముతూ దొరికిన లీలాకృష్ణ

పోలీసులకు చేతికి చిక్కడం ఇది నాల్గోసారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రగ్స్‌కు అలవాటు పడి అమ్మకందారుగా మారిన 24 ఏండ్ల లీలా కృష్ణ అనే యువకుడు.. ఎవరికి ఏ రకమైన డ్రగ్ కావాలన్నా సప్లై చేసే స్థాయికి ఎదిగాడు. ఇప్పటికే మూడుసార్లు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడిన లీలా కృష్ణ గురువారం నాలుగోసారి ఎక్సైజ్ ఎస్టిఎఫ్ పోలీస్. లకు పట్టుబడ్డాడు. వివరాల్లోకెళ్తే... హైదరాబాద్ నిజాంపేట్ కుశాల్ పార్క్ హై టెన్షన్ లైన్ రోడ్డులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సిఐ నాగరాజు బృందం గురువారం తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో లీలా కృష్ణ డ్రగ్స్ అమ్ముతున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు. అతని బ్యాగును పరిశీలించగా, 17.07 ఓజీ కుష్ గంజాయి, 2.34. గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్, 2 ఎల్ఎస్‌డి బ్లాస్ట్, 220 గ్రాముల ఎండు గంజాయి లభించింది. పట్టుబడిన డ్రగ్స్, గంజాయి విలువ రూ.1.40 లక్షల వరకు ఉంటుందని సిఐ నాగరాజు తెలిపారు.

## రూ.5లక్షల ఆశిష్ ఆయిల్ పట్టివేత



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ఒడిశా నుంచి నుంచి హైదరాబాద్‌కు కారులో ఆశిష్ ఆయిల్‌ను తరలిస్తున్న ఇద్దరి నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం మేరకు గురువారం ఎస్‌టిఎఫ్ బృందం తనిఖీలు నిర్వహించగా, 1.5కేజీల ఆశిష్ ఆయిల్ దొరికింది. దీని విలువ రూ.5 లక్షలు, కారు విలువ రూ.5 లక్షలు ఉంటుందని ఎస్‌టిఎఫ్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కేసులో కర్ణాటకకు చెందిన కొండే మల్లికార్జున్, హైదరాబాద్ చెందిన మహమ్మద్ రహమాన్ ఖాన్ నన్ను అరెస్ట్ చేశామని తెలిపారు. హైదరాబాద్ కు చెందిన మహమ్మద్, ఒడిశాకు చెందిన రమేష్, గంగాధర్‌లు పరారీ లో ఉన్నట్టు పేర్కొన్నారు. ఇదిలావుండగా, పురానాపూల్ ప్రాంతంలో 1.1 కేజీల గంజాయిని కూడా పట్టుకొన్నామని సిఐ వెల్లడించారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతనిధి:** జిల్లాలో ఇందిరా క్రాంతి మహిళా శక్తి పథకం కింద నిర్వహించిన అనేక కార్యక్రమాల ద్వారా మహిళలను కోటేశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ ,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాత్యులు దామోదర్ రాజ నర్సింహ్మా అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలు 2024 ఇందిరా క్రాంతి పథకం మహిళా శక్తిలో భాగంగా గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా క్యాంటీన్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ రోజు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాత్యులు దామోదర్ రాజనర్సింహ్మా పుట్టిన రోజు సందర్భంగా మంత్రికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మా ట్లాడుతూ మహిళా శక్తి పథకం రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు సమాజ ఆర్థిక ప్రగతికి ప్రధాన మైనదని మంత్రి పేర్కొన్నారు . ఇందిరా క్రాంతి పథ కం మహిళల ఆర్థిక స్వలాంబనాన్ని పెంచి స్వ యం ఉపాది అవకాశాలను సృష్టించడమే ప్రధాన ఉద్యేశ్యం అని మహిళా శక్తి పథకం కింది మ హిళా సంఘాలకు మాత్రమే ఈ క్యాంటీన్ నిర్వహణ భాద్యతలు అప్పగించబడిందన్నారు. మహిళలు సాధికారత ఆర్థిక స్వాలంబన పెంపొందించాలని అన్నారు. ఈ క్యాంటిన్ మహిళా సంఘాలకు ఆర్థికంగా బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంకా ఈ మహి ళా క్యాంటిన్లు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. సమాజంలో మహిళా శక్తిని ప్రోత్సహించే దిశగా ఈ తరహా కార్యక్రమాలు విజయవంతం కావాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## బుద్ధి, జ్ఞానం కోల్పోయిన కెటిఆర్, హరీశ్ రావు

మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్** అధికారం కోల్పోయాక కెటి ఆర్, హరీశ్ రావుకు బుద్ధి, జ్ఞానం లేకుండా పోయిం దని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ ఈర వత్రి అనిల్ విమర్శించారు. గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికా రాన్ని గుంజుకోవాలని బావబామ్మర్దులు హరీశ్ రావు, కెటిఆర్‌లు దుర్మ ర్గపు ఆలోచనలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిరోజు ఎదో అయినట్లు రోడ్లమీద పడి హడావుడి చేస్తున్నారని అన్నారు. కెటిఆర్ మంత్రిగా పనిచేసిండా సిఎం రేవంత్ రెడ్డి అన్నట్లు సినిమా వాళ్ళతో తిరిగిండా? అని ప్రశ్నించారు. మంత్రిగా పనిచేసినా కనీసం జ్ఞానం లేదన్నారు. పదేళ్లు కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావులు ప్రజలను మోసం చేసినందుకు సిగ్గుప డాలన్నారు. కెటిఆర్ గ్లోబెల్స్ అయి ఉండి తమను గ్లోబెల్స్ అంటుండ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చింద న్నారు. పదేళ్లలో అధికారంలో ఉండి మీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.బిఆర్ఎస్‌ఉంటదో, గంగల కలుస్తదో, బిజెపిలో కలుపుతరో తెలియదన్నారు.మీరు చేసిన అప్పులకు ప్రజలు తిరస్కరించారని హెచ్చరించారు.

## పంచాయతీల విలీనంపై జోక్యం చేసుకోలేం : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శంసాబాద్ మండలంలో 51 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయాలనే ప్రభుత్వ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. శంసాబాద్ మండలంలోని 51 పంచాయతీలను శంషాబాద్ మున్సిపాలిటీలో విలీన ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ మాజీ సర్పంచ్ పద్మావతి ఇతరులు వేసిన పిటిషన్లను కొట్టివేసింది. గురువారం చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. మున్సిపాల్టీలో కలిపితే పన్నుల భారం పెరుగుతుందని పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, బహదూర్గూడ, హమీదుల్లానగర్ మొదలైన గ్రామాల విలీనాన్ని అడ్డుకోవాలన్న పిటిషన్లను కొట్టివేసింది. ప్రభుత్వం మున్సిపాలిటీ చట్టాన్ని తీసుకువచ్చిందని, విలీనాన్ని అడ్డుకోరాదని ప్రభుత్వ వాదనను ఆమోదించింది.

## సినీ నటుడు అల్లు అర్జున్‌పై కేసు నమోదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినీ నటుడు అల్లు అర్జున్‌తో పాటు ఆయన సెక్యూరిటీ సిబ్బందిపైన చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పుష్ప2 సినిమా విడుదల సందర్భంగా సంథ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చేశారు. తెలంగాణ న్యాయవాదుల ఫిర్యాదు చేశారు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా ఆర్‌టిసి క్రాడ్ రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహిళ మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతి వర్మ ఆధ్వర్యంలో న్యాయవాదులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## కవితను కలిసిన దికొండ కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత నివాసంలో గురువారం భారత జాగృతి సమావేశం జరిగింది. సమావేశం అనంతరం కవితను మర్యాదపూర్వకంగా నాయకురాలు దికొండ కవిత కలిశారు.

## 7న రాష్ట్రవ్యాప్తంగా ఆటోబంద్‌కు పిలుపు

ఆటో, క్యాబ్‌ల బంద్‌కు ఆటో, క్యాబ్ సంఘాల జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7వ తేదీన ఒకరోజు తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా ఆటో, క్యాబ్‌ల బంద్‌కు ఆటో, క్యాబ్ సంఘాల జెఎసి కన్వీనర్ బి. వెంకటేశం పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్ల దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారం కావటం లేదన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, సంవత్సరానికి 15వేలు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలని, ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, హైదరాబాద్ నగరంలో అక్రమంగా నడుస్తున్న ఆటోలను నిషేధించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ప్రమాద బీమాను రూ. 10 లక్షలకు పెంచి, సాధారణ మరణాలకు వర్తింప చేయాలని కోరారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలనే తదితర డిమాండ్‌ల పరిష్కారం కోసం తలపెట్టిన ఒక రోజు ఆటో బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ 'విభజన రాజకీయాల' వివాదాగ్ని

అయోధ్య 'రామాయణ్ మేళా'లో ప్రతిపక్షాల కులగణన సమర్థింపుపై కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సంభల్‌లో హింస, అల్లర్ల అంశం రాజకీయ దుమారం లేపుతున్న సమయంలో ఆరాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తాజాగా చేసిన కీలక వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. గతంలో అయోధ్య, ఇటీవల సంభల్, బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న పరిణామాలను ఉటంకిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టి సామాజిక విభజనకు పాల్పడే వ్యక్తులు అంతటా ఉన్నారని, వారు తప్పుడు వివరణలతో ప్రజలను మభ్యపెడుతుంటారని, అలాంటి వ్యక్తులు, శక్తులతో చాలా ప్రమాదమని యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. గురువారం నాడు అయోధ్యలో నిర్వహించిన 'రామాయణ్ మేళా'కు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రవచించారు. సమాజాన్ని ఏకతాటి మీదకు తీసుకొచ్చిన మహనీయుడు రాముడు అని కీర్తించారు. అయోధ్యలో మొగల్ పరిపాలకుడు బాబర్ సైన్యం ఏమి చేసింది, సంభల్, బంగ్లాదేశ్ పరిణామాలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయనే విషయమై మాట్లాడుతూ చేసిన వ్యాక్యలు వివాదాస్పదంగా మారి ప్రతిపక్షల అగ్రహానికి దారితీసింది.

కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్షాలను లక్ష్యం గా చేసుకుని ఆయన తన ప్రసంగం చేశారు. సమాజాన్ని విభజించే కుట్రలను మనం గతంలోనే తిప్పి కొట్టి ఉంటే ఈ దేశం వలసరాజ్యం గా మారి ఉండేది కాదన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించేవారు విజయం సాధించారని, కులం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిం చి, ఐక్యతను నీరుగారుస్తున్న వ్యక్తులు ఇప్పటికీ సమాజంలో ఉన్నారని ప్రతిపక్షాలను ఉద్దేశించి పరోక్షంగా చురకలు వేశారు. కాంగ్రెస్ ఎంపి మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ యోగి ఆదిత్యనాథ్ బంగ్లాదేశ్ పరిణామాలను సంభల్ అల్లర్లతో ముడిపెట్టడం శోచనీయమన్నారు.

## హరీష్‌ను అరెస్టు చేయెుద్దు

కేసు కొట్టేయండి : హరీష్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసును కొట్టేయాలంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో ఆయనకు ఊరట లభించింది. ఈ కేసు విచారణ జరపవచ్చునని, అయితే హరీష్‌రావును అరెస్టు చేయరాదని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఏవిధమైన కఠిన చర్యలు తీసుకోరాదని కూడా చెప్పింది. రాజకీయ దురుద్దేశంతో, కక్షసాధింపుతో రియల్ ఎస్టేట్ వ్యాపారి జి.చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని హరీష్ సవాలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ లక్ష్మ ణ్ విచారించారు. ప్రాథమిక విచారణ, పరిశీలన చేయకుండానే పోలీసులు కేసు నమోదు చేశారన్నారని పిటిషనర్ లాయర్ వాధించారు. రాధకిషన్‌రావు ద్వారా ఫోన్‌ట్యాపింగ్ చేయించారనే ఫిర్యాదుకు ఆధారాల్లేవన్నారు. ఇదే వ్యవహారంపై గౌడ్ గతంలో పిటిషన్ వేసి హైకోర్టు నుంచి వాపస్ తీసుకున్నారన్నారు. పిటిషనర్ కీర్తిప్రతిష్టలను దెబ్బతీసేందుకే ఫిర్యాదు చేశారన్నారు. చట్టప్రక్రియను అమలు చేయడం లేద న్నారు. ఫిర్యాదు చేసిన గౌడ్ తనపై ఎలక్షన్ పిటిషన్ వేశారని, ఫోన్ ట్యాపింగ్ పిటిషన్ వేసి వెనక్కి తీసుకున్నారని, కేసుపై కేసు పెట్టి ఇబ్బంది పెట్టి అరెస్టు అయితే ప్రతిష్ట దెబ్బతింటుందని చెప్పారు. అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని, కేసు విచారణపై స్టే ఇవ్వాలని కోరారు. అరెస్టు నుంచి మినహాయింపు ఇచ్చిన హైకోర్టు, కేసు విచారణపై స్టేకు నిరాకరించింది. గౌడ్‌కు నోటీసులు ఇచ్చింది. విచారణను ఈ నెలాఖరుకు వేసినట్లు తెలిపింది.

## మృతదేహాలకు రీపోస్టుమార్టానికి హైకోర్టు 'నో'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పూలకొమ్మ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలకు తిరిగి పోస్టుమార్టం నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్‌కౌంటర్‌పై జ్యుడిషియల్ విచారణ, బంధువుల సమక్షంలో రెండోసారి ఇంక్వెస్ట్ చేసేందుకు కూడా అనుమతించలేమని వెల్లడించింది.




ఇప్పటికే ఆరుగురు మృతదేహాలను బంధువులకు అప్పగించామని, హైకోర్టు ఆదేశించిన కారణంగా మల్లయ్య మృతదేహం మాత్రమే భద్రపర్చామని ప్రభుత్వం చెప్పింది. మల్లయ్య మృతదేహాన్ని కూడా బంధువులకు అప్పగించాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది. అప్పగింతకుముందు ఫొటో, వీడియో తీసుకోవడానికి మల్లయ్య భార్యను. ఆమె తరపు న్యాయవాదిని అనుమతించాలంది ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమంటూ మృతుడు మల్లయ్య భార్య కె.ఐలమ్మ అలియాస్ మీనా వేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు.మల్లయ్య మృతదేహాన్ని పిటిషనర్, ఆమె లాయర్ సమక్షంలో అప్పగించాలని, సెల్‌ఫోన్‌ద్వారా ఫొటోలు తీసుకునేందుకు వారిని అనుమతించాలని పోలీసులను ఆదేశించారు ఈ నెల 26కి విచారణను వాయిదా వేశారు.

# భారత్‌లో మేమూ పెట్టుబడి పెడతాం : పుతిన్

'మేక్ ఇన్ ఇండియా'పై ప్రశంసలు



**మాస్కో :** భారత్‌లో పెట్టుబడులు పెడితే అది రష్యాకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఆ దేశ అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ అన్నారు. అందువల్ల భారత్‌లో ఉత్పత్తి కార్యకలాపాల నిర్వహణకు తమ దేశం పెట్టుబడులు సమకూరుస్తుందని పుతిన్ చెప్పారు. మాస్కోలో జరిగిన 15వ విటిబి ఇన్వెస్టిమెంట్ ఫోరమ్ సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ, ''భారత్‌లో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రష్యా సిద్ధంగా ఉంటుంది, ఇప్పటికే రోస్నెఫ్ట్ సంస్థ 20 బిలియన్ డాలర్ల మేరకు భారత ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద పెట్టుబడులు సమకూర్చింది'' అని చెప్పారు. రోస్నెఫ్ట్ అనేది రష్యన్ ఫెడరేషన్‌లో అతిపెద్ద చమురు ఉత్పత్తి కంపెనీ. చిన్న మధ్యతరహా పరిశ్రమలవృద్ధికి బ్రిక్స్ దేశాలమధ్య పరస్పరం మద్దతు, సహకారంఉండాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు భారత్‌లో ఎంతో స్థిరమైన పరిస్థితులను మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడులు ఆకర్షించేందుకు అమలుచేస్తున్న 'మేక్ ఇన్ ఇండియా' పథకాన్ని పుతిన్ ఎంతగానో ప్రశంసించారు. భారతదేశంలో పెట్టుబడులు పెడితే ఎంతో లాభదాయకంగా ఉంటాయని అనేక కంపెనీలు ఎంతో ఆసక్తితో ఉన్నాయంటూ మోదీ మేక్ ఇన్ ఇండియా పథకాన్ని ప్రశంసించారు. ఈ పథకంవల్ల ఉత్పత్తిరంగం ఎంతో ఊపు అందుకుంటుందని, విదేశీ పెట్టుబడులను గణనీయంగా ఆకర్షిస్తుందన్నా రు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఈ పథకం ఎంతో కీలకపాత్ర వహిస్తుందన్నారు. 2014 సెప్టెంబరు 25వ తేదీన మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' పథకాన్ని ప్రారంభించింది. దేశంలో పెట్టుబడులు పెంచేందుకు, నవీనీకరణ పద్ధతులు అమలు చేసేందుకు, ప్రపంచ ప్రఖ్యాతమైన మౌలిక సదుపాయాలను భారత్‌లో అభివృద్ధి చేసేందుకు, ఒక ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా భారత్‌ను రూపుదిద్దేందుకు ఈ మేక్ ఇన్ ఇండియా దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తూ వచ్చింది. మోదీ అనుసరిస్తున్న ఈ విధానాలను పుతిన్ ఎంతగానో ప్రశంసించారు. 'భారత్‌కు మొదటి ప్రాధాన్యం' అనే మోదీ విధానం ఆ దేశంలో పెట్టుబడుల పెరుగుదలకు, మదుపరులకు లాభాలు సమకూర్చడానికి దోహదం చేస్తోందని పుతిన్ అన్నారు.

# వివాదాస్పద వక్ఫ్ ఆస్తుల వివరాలివ్వండి

రాష్ట్రాలకు పార్లమెంటరీ కమిటీ లేఖలు

**న్యూఢిల్లీ :** వక్ఫ్ ఆస్తులు ఏవైనా వివాదాల్లో ఉంటే సంబంధిత సమాచారాన్ని తమకు పంపించాలని పార్లమెంటరీ కమిటీ రాష్ట్రాలలో ప్రభుత్వాలకు లేఖలు రాసింది. తమ తమ పరిధధులలో ఏవైనా వక్ఫ్ ఆస్తులు వివాదాల్లో ఉంటే ఆ వివరాలు తమకు పంపాలని వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ గురువారం నాడు ఒక సమావేశంలో కోరింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ జగదంబికా పాల్ ఈ విషయం చెప్పారు. వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాల చివరివారం వరకూ ఈ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించిన తర్వాత కమిటీ సమావేశం జరగడం ఇదే మొదటిసారి. అవసరమైతే రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను కూడా కమిటీ ఎదుట హాజరుపరుస్తామని కూడా జగదంబికాపాల్ చెప్పారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీలో ఉన్న పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, శాసన, న్యాయ మంత్రిత్వశాఖలకు చెందిన అధికారులు గురువారంనాడు కమిటీ ఎదుట హాజరయ్యారని, సమాధానాలు చెప్పారని అన్నారు. ''వారి సమాధానాలను 887 పేజీలలో నమోదు చేశాం, రాబోయే రోజుల్లో వాటిని పరిశీలిస్తాం'' అని జగదంబికా పాల్ చెప్పారు. ఈ కమిటీ తదుపరి సమావేశం డిసెంబరు 11,12 తేదీలలో జరుగుతుంది. మంత్రిత్వశాఖాధికారులు చెప్పిన సమాధానాలను సరిగ్గా నమోదు చేయలేదని, ఈ విషయాలను రాబోయే రోజుల్లో ప్రశ్నిస్తామని కమిటీలో సభ్యుడు ఒకరు చెప్పారు. ఈ సవరణ బిల్లు తీసుకురావడాన్ని ప్రతిపక్షాలు, ముస్లిం గ్రూపులు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ చర్య తమ మతపరమైన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని విమర్శించారు. రాష్ట్రాలలో ప్రభుత్వాలుగానీ, ఇతర అధికార సంస్థలుగానీ అనధికారికంగా వక్ఫ్ ఆస్తులను ఆక్రమించినట్లు ఏమైనా ఆరోపణలు ఉంటే సచార్ కమిటీ చెప్పినవిధంగా ఇందుకు సంబంధించిన తాజా వివరాలను, సమాచారాన్ని సేకరించి వాటిని నమోదు చేస్తామని జగదంబికాపాల్ చెప్పారు. 2005 2006 సంవత్సరాలలో వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల గురించి సచార్ కమిటీకి సమాచారాలు తెలియజేశాయి. సచార్ కమిటీకి తెలియజేసిన సమాచారం ప్రకారం ఒక్క ఢిల్లీలోనే ఈ విధంగా 316 రకాల మైనారిటీ ఆస్తుల వివాదాలు ఉన్నాయి. రాజస్థాన్‌లో 60 వివాదాలు, కర్ణాటకలో 42 వివాదాలు ఉన్నాయని సచార్ కమిటీకి ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా మధ్యప్రదేశ్‌లో 53, ఉత్తర ప్రదేశ్‌లో 60, ఒడిశాలో 53 ఆస్తి వివాదాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన వివరాలు కూడా ఇవ్వాలని ఆయా రాష్ట్రాలను పార్లమెంటరీ కమిటీ కోరిందని జగదంబికాపాల్ చెప్పారు.

## అతిథి ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అతిథి ఉపాధ్యాయుల కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ, ఇంగ్లీష్ , సిఆర్టీ ఉద్యోగానికి ఉపాధ్యాయులుగా పని చేసేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు మాత్రమే విధులు నిర్వహించాల్సి ఉంటుందని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు రెండు రోజులలో గడువు లోగా దరఖాస్తులను కస్తూర్బా పాఠశాలలో అందించాలని కోరారు.

## పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల పరిధిలోని గోపాల్ దిన్నె గ్రామ సమీపంలో మూడు ముక్కలాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి నగదు స్వాదీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె. రాణి కథనం ప్రకారం మండల పరిధిలోని గోపాల్ దిన్నె గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి, కురుమయ్య, శ్రీనివాస్ రెడ్డి అనే నలుగురు వ్యక్తులు గ్రామానికి సమీపంలోని గోపాల్ దిన్నె రిజర్వాయర్ సమీపంలోని వ్యవసాయ పొలంలో మూడు ముక్కలాట ఆడుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు వల పని పట్టుకున్నారు. వారి నుంచి 52 పేక ముక్కలు , 9వేల 190 రూపాయల నగదు స్వాదీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె. రాణి తెలిపారు.



## సంక్షేమ పథకాలపై అవగాహన

**ప్రజాపక్షం / నారాయణపేట :** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గురువారం ఉదయం నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి, పేరాపల్ల, కోటకొండ గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశానుసారంగా డిపిఆర్వో రషీద్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు 6 గ్యారంటీలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామీణ ప్రజలకు పల్లె జానపదాలతో రుణమాఫీ ఆరోగ్యశ్రీ, 500కె గ్యాస్ సిలిండర్ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు ప్రజలకు అందిస్తుందని రైతన్నల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారి ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటుందని కళాకారులు ఆటపాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు గ్రామ మాజీ సర్పంచులు , ప్రజా ప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రవిశంకర్ , కిరణ్ , నర్సింహ, బాలయ్య, చల్లా లక్ష్మీ , అరుణ, రాధా , జ్యోతి, సుగుణ , జహీర్ తదితరులు పాల్గొన్నారు.



## విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి : ఎస్పి యోగేష్‌గౌతమ్

**ప్రజాపక్షం / మాగనూర్ :** పోలీస్ సిబ్బంది విజువల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ యోగే,వ గౌతమ్ తెలిపారు. గురువారం ఉదయం వార్షిక తనిఖీల్లో మాగనూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ నిర్వహించి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి ఇచ్చిన కిట్ ఆర్టికెల్స్‌ను తనిఖీ నిర్వహించారు. వారికి ఇచ్చిన కిట్ ఆర్టికల్స్ అన్ని నీట్‌గా క్రమ పద్ధతిలో ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి వారి డ్యూటీ ల గురించి అడిగితెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమ శిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజి అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకోని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ సిఐ చంద్రశేఖర్ , ఎస్ఐ ఆశోక్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పాఠశాలకు కంప్యూటర్, టెలివిజన్ వితరణ

**ప్రజాపక్షం / మక్తల్ :** మక్తల్ మండలంలోని ఉప్పరపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామ వాస్తవ్యులైనటువంటి కీర్తిశేషులు తిప్పారెడ్డి, రామచంద్రరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీకాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పాఠశాలకు 60వేల విలువైన కంప్యూటర్ , టెలివిజన్ లను అందించడం జరిఇగింది. దాతలు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన విద్యార్థులు చిన్నప్పటి నుండే కంప్యూటర్ పట్ల అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో పాఠశాలకు కంప్యూటర్ , టీవీలను అందించినట్లు పేర్కొన్నారు. మేము అందించిన కంప్యూటర్ , టెలివిజన్లను విద్యార్థులు సద్వినియోగ పర్చుకోవాలని సభాముఖంగా కోరారు. అనంతరం పాఠశాలకు కంప్యూటర్ , టెలివిజన్లను అందించిన దాతలను పాఠశాల తరపున ప్రధానోపాద్యాయులు, పాఠశాల చైర్మన్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శివమ్మ, ఉపాధ్యాయులు పావని, జగదీష్ , గ్రామస్తులు, దామోదర్ రెడ్డి, లింగారెడ్డి, రవితేజ, గోవర్ధన్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న 7 టిప్పర్లు, ఒక జెసిపి ఓనర్లపై కేసులు



**ప్రజాపక్షం / నారాయణపేట :** నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సింగారం గ్రామ శివారు నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్ల ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఎర్రమట్టితో నిండి ఉన్న ఒక టిప్పర్ను , 6 కాలి టిప్పర్లను , ఒక జేసిపిని ఆర్ఐ ప్రతాప్ రెడ్డి సింగారం శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా ఆ టిప్పర్ల ఓనర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# రానున్న రోజుల్లో ఆర్‌టిసికి స్వర్ణయుగం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** రాబోయే రోజుల్లో ఆర్టీసీ కి స్వర్ణయుగం రాబోతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేయ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రోడ్డు రవాణాసంస్థ ఆధ్వర్యంలో గురువారం నాడు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో నిర్వహించిన ప్రజా పాలన ప్రజావిజయోత్సవాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మా యొక్క హామీల్లో ఒకటి అయిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం జరిగింది అని ఆయన చెప్పారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థను, గత బిఆర్ఎస్ ప్రభుత్వ అమ్మివేయాలని చూసిందని, కానీ ప్రజా ప్రభుత్వం మాత్రం ఆర్టీసీ ని బ్రతికించుకోలని తాపత్రయం పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఒక మంచి ఆలోచన ఉంటే ఎంత మార్పు వస్తుందో నేటి ఆర్టీసీ వ్యవస్థను చూస్తే సరిపోతుంది అని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఉచిత బస్సు ప్రయాణం ద్వారా నే 1 కోటి 30 లక్షల మహిళా టికెట్ల ఇవ్వడం చాలా గొప్ప విషయం అని, రాష్ట్ర వ్యాప్తంగా 6000 కోట్ల రూపాయలు మహిళలకు ప్రయాణం ద్వారా ఆదా జరిగింది అని ఆయన చెప్పారు. ఇంకా మెరుగైన వసతులు ప్రయాణ ప్రాంగణంలో కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. మీరు ప్రయాణికులకు చేసేసేవలు ద్వారా ప్రయాణికుల ఆశ్శీస్సులు మీకు తప్పకుండా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. మహిళలకు చిన్నపిల్లలకు,ఫీడింగ్ మదర్స్ కి ఒక చిన్న రూమ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని అలాగే ప్రయాణికులసౌకర్యార్థం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అందరం కలిసి కట్టుగా పనిచేసి ఆర్టీసీకి మంచి పేరు తీసుకువద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు చేసిన మహిళా కండెక్టర్లు యాదమ్మ, అపర్ణలను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు, ప్రయాణికుల తో ఆర్టీసీ సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథీలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఆర్ఎం సంతోష్ కుమార్, డిఆర్ ఎంఓ సాయిధర్మతేజ్,డిఆర్ఎంఎం శ్యామల డియం సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సేవే పరమావధిగా పనిచేయాలి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** సేవే పరమావధిగా పనిచేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం నాడు మహబూబ్‌నగర్ పట్టణంలోని శివశక్తి నగర్‌లోని శివాలయం నూతన పాలకవర్గ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులతో దేవాలయ శాఖ ఇన్స్పెక్టర్ వీనాద్రి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ఈ దేవాలయాన్ని కాపాడుకుందామని, ఒక కుటుంబం మాదిరిగా అన్ని కులాల వారిని కలుపుకుని అందరిని కలుపుకుని ముందుకు పోవాల్సిన బాధ్యత మీ పైన ఉందని, ఎలాంటా ఆధ్యాత్మిక కార్యక్రమం చేపట్టినా అందరు కల్గి ఉత్సవంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఇక్కడ గత ఎన్నో సంవత్సరాలుగా మహా శివరాత్రి ,శ్రీరామ నవమి పండుగనుఎంతో గొప్పగానిర్వహిస్తారని, రానున్న రోజుల్లో ఇంకా ఎన్నో దైవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని, దేవాలయ ప్రాంగణంలో అన్ని రకాలవసతులు ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి ఎండోమెంట్ నుంచి కూడా అత్యధిక నిధులు మంజూరు చేసి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని ఆయన హామీఇచ్చారు. అంతకుముందు ఆలయ అర్చకులుపూర్ణకుంభంతో ఎమ్మెల్యే కి ఘనంగా స్వాగతం పలికారు. శివునికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయఅర్చకులు ఎమ్మెల్యే కి వేద ఆశీర్వాదం తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఎల్లంగారి భరత్ కుమార్, వి.రాము, వెంకటయ్య, జగదీశ్వర్, పి.సోని, కె.కార్తిక్, తదితరులుపాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నరసింహ్మాస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలి అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం నాడు న్యూగంజ్, సింహాగిరి లోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఎంతో ప్రాముఖ్యత, విశిష్టత కలిగి, అన్ని రకాల పండుగలను ఘనంగా జరుపుకునే ఆనవాయితీతో జరుపుకోవడం గొప్ప విషయమని ఇలాంటిదేవాలయాన్ని కాపాడుకుని, భక్తులకు ఎలాంటిఇబ్బందులూ లేకుండా, అసౌకర్యం కలగకుండా ఇంకా అనేక భక్తి కార్యక్రమాలు చేయాలని ఆయన సూచించారు. ఇంకా ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పలుకూరి తిరుమలా చార్యులు ఆలయ కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కి అర్చకులు వేదాశీర్వాదం అందించితీర్ధప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, గ్రంథాలయ సంస్థచైర్మన్ మల్లు నరసింహరెడ్డి, మార్కెట్ కమిటీచైర్మన్ బెక్కరి అనిత, మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఆలయ ఈఓ రంగాచారి, హస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీసభ్యులు బెజ్జుగం రాఘవేందర్, ఆలయ కమిటీ సభ్యులుపోల శ్రీనివాస్, తిరుపతి నాయక్, సంజీవగౌడ్, కొత్త చంద్రశేఖర్, బూరమోని నరసింహులు,యచ్చం భాస్కర్, రామకృష్ణయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులుపాల్గొన్నారు.

## పాడి పశువులలో ఉత్పాదకత పెంచాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పివి నరసింహారావు పశువైద్య విశ్వ విద్యాలయం పశువైద్య కళాశాల రాజేంద్రనగర్, పశువైద్య పశు సంవర్ధక శాఖ, విజయడెయిరి ఇప్పపాడ్, జాకినలపల్లి, గుండగుంటపల్లి , బొమ్మ రాసిపల్లి గ్రామాలలో గురువారం పశువైద్యశిబిరాలు నిర్వహించారు. ఈశిబిరాలకు విచ్చేసి రైతులనుద్దేశించి అదనపు కలెక్టర్ దేవసహాయం మాట్లాడుతూ ఈశిబిరాల్లో ఎదకురాని పశువులకు, చూడినిలవని పశువులకు, గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు దీర్ఘకాల వ్యాధులు ఉన్న పశువులకు శస్త్రచికిత్సలు అవసరమైన పశువులకు నిపుణులైన వైద్యులు చేస్తారని తెలిపారు. నాగర్‌కర్నూల్ పాడి పశువుల పెంపకం, గొర్రెల పెంపకంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. రైతులకు సరైన మెళుకువలు, యాజమాన్య పద్ధతులలో శిక్షణ ఇచ్చినట్లయితే పశువుల ఉత్పాదకత పెంచవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలైన mgnregs ద్వారా పశుగ్రాసాల సాగు, పశువులషెడ్లు, గొర్రెలషెడ్లు నిర్మించుకునే అవకాశం ఉంటుంది. అవసరమైనవాళ్లు ఎంపిడిఓను సంప్రదించాలన్నారు. పశువులకు, గొర్రెలకు అవసరమైన అన్ని టీకాలు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇంచార్జీ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కెసిఎస్‌రెడ్డి, విజయడైరి డిడి ధనరాజ్, డాక్టర్ పద్మజ, డాక్టర్ సురేఖ, డాక్టర్ లక్ష్మి ,డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి చార్జిషీట్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని బిజెపి కల్వకుర్తి కార్యాలయంలో గురువారం సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై బిజెపి నాయకులు చార్జిషీట్ విడుదల చేశారు. గురువారం కల్వకుర్తి నియోజకవర్గ బిజెపి ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ జాతీయ బిసి కమీషన్ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ తెలంగాణప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే ప్రజాధనంతో ప్రభుత్వ సంబరాలు చేసుకుంటుందన్నారు. వందరోజుల్లో గ్యారంటీలు పూర్తిచేస్తామని సంవత్సరకాలంలో హామీలు అమలుచేస్తామని చెప్పిందికాని ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేదన్నారు. ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు, గ్యారంటీలపై కాంగ్రెస్ నాయకులు స్పందించాలన్నారు. ఏడాదిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రజలకుజరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నిఅంశాల్లో విఫలమయ్యారన్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ యెన్నంశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలిదుర్గాప్రసాద్, మాజీ జడ్పిటిసి కండెహరిప్రసాద్, తాలుకాలోని ముఖ్యమైన నాయకులు గోరటి నర్సింహ్మా, బండలరామచంద్రారెడ్డి, దండుశ్రీనివాసులు, పెద్దయ్యయాదవ్, బోడనర్సింహ్మా, సురేందర్‌గౌడ్, శ్రీకాంత్‌సింగ్, పాల్గొన్నారు.

### అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయుల

## దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం / మద్దూరు :** మద్దూరు మండలం పెదిరిపాడ్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో అతిథి అధ్యాపకుల , ఉపాధ్యాయులకు అర్హత కలిగన మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ గౌరమ్మ ప్రకటనలో తెలిపారు. పేదిరిపాడ్ కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో కెమిస్ట్రీ బోధించేందుకు బీఈడి, సంబంధిత సబ్జెక్టులో పీజీ, జిల్లా స్థానికత కలిగి ఉన్న మహిళలు , పిఈటి , సిఆర్‌టి హింది కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు డిసెంబర్ నుండి మార్చ్ వరకు అతిథి అధ్యాపకులుగా బోధించాల్సి ఉంటుందన్నారు. సిఆర్టి హింది తాత్కాలిక పద్ధతి కేజీబివి కోస్గిలో పని చేయవాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 6 నుండి 9వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పెదిరిపాడ్ , మద్దూరు మండలంలో అందించాలని, పూర్తి వివరాలకై సెల్ నంబర్ 741635326కు సంప్రదించాలని కోరారు.

## తల్లిదండ్రులపైనే పిల్లల భవిష్యత్తు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల పైన ఆధారపడి ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మన పిల్లలు బాగా కష్టపడి చదువుకుంటే వారి భవిష్యత్తుకు బాటలు వేసిన వాళ్లము అవుతామని, ప్రతి రోజు పిల్లలు కాలేజ్‌కు వచ్చి చదువుకునే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, వారు చదువుతున్నారా లేదా అన్న విషయాన్ని గమనించి వారికి సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన సూచించారు. మన పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఇక దూర ప్రాంతాలకు పోకుండా మన పాలమూరు యూనివర్సిటీలోనే ఇంజనీరింగ్ మరియు లా వంటి నూతన కోర్సులు కూడా వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్నాయని ఆయన చెప్పారు. మెడికల్ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఆయన హామీఇచ్చారు. మంచిగా చదువుకుని మంచి ర్యాంకు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్,లెక్చరర్స్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## అవినీతి నిరోధక వారోత్సవాలు

**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి :** డిసెంబరు 3 నుండి 9 వ తేదీ వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ డి.జానకి,ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీస్ లైన్ స్కూల్ నుండి తెలంగాణా చౌరస్తా వరకు అవినీతి వ్యతిరేక ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో ఏసీబీ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు. అవినీతి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, సమాజంలో పారదర్శకతను పెంపొందించేందుకు పౌరులంతా కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్పీ అన్నారు. అవినీతి పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ ముఖ్య పాత్ర పోషిస్తుందని ,స్ఫూర్తిదాయకమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ ఇన్స్పెక్టర్లు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, లింగస్వామి, ఎంఈవో లక్ష్మణ్ సింగ్, పోలీస్ లైన్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ శంభుప్రసాద్,ఆర్వీఎంఓ, బాబు యాదవ్, ఏసీబీ సిబ్బంది,పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



## ఘనంగా నవాబ్‌పేట్ మార్కెట్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబ్‌పేట మండల కేంద్రంలో నూతనంగా ఎంపిక చేసిన మార్కెట్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగాజరుపుకున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో రైతులకు చేసిన రుణమాఫీ వారి మిత్తిలకే సరిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. ఒక్క జడ్చర్ల నియోజకవర్గంలోనే 31544 మంది రైతులకు మొత్తంగా 250 కోట్ల వరకు రుణమాఫీ జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ని కొల్లూరును మండలం చేయాలని కోరారని గుర్తు చేశారు. తప్పకుండా రాబోయే రోజుల్లో కొల్లూరు గ్రామాన్ని మండల కేంద్రాంగా ఏర్పాటు చేసేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఇప్పటివరకు జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్ల కోసం 153 కోట్ల నిధులను తీసుకోచ్చానని చెప్పారు. నిన్న రాత్రి దొండ్లపల్లి నుంచి ఇప్పటూరు వరకు దాదాపు 1 కోటి 68 లక్షలతో బిఎట్ రోడ్డు కు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వ పాలన 2022 లో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుచ్చర్కల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 5 లక్షలతో శంకుస్థాపన చేసి పని పూర్తి చేయలేదని విమర్శించారు. అదే కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నేను 10 లక్షలతో శంకుస్థాపనచేసి నేడు కొబ్బరికాయ కొట్టి ప్రారంభం చేశానని తెలిపారు. నవాబ్ పేట్ మండల కేంద్రంలో 6 ఎకరాల భూమిని కేటాయిస్తే మినీ స్టేడియంను మంజూరు చేయిస్తానని తెలిపారు.



## కలెక్టర్‌ను కలిసిన శశికుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ క్యాంపు కార్యాలయంలో గురువారం తెలంగాణప్రైవేట్ హస్పిటల్ నిరుపేదల బాధలసంఘం రాష్ట్ర అధ్యక్షులు శశికుమార్‌గౌడ్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్‌ను కలిశారు. ఈసందర్భంగా జిల్లాలోని పలు అనుమతులులేని ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రభుత్వ హస్పిటల్‌లో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ యువ నాయకులు బాధగొని నాగార్జునగౌడ్, సత్యం పాల్గొన్నారు.

### బోధనాభ్యసన సామాగ్రిని ఉపయోగించి

## పాఠ్యాంశాల బోధన : డిఇఒ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రతి ఉపాధ్యాయుడు విద్యాసంవత్సరంలో విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు దానికి ఉపకరించే బోధనాంశాలు , బోధన పద్ధతులు వాటికి పట్టేసమయం కావాల్సిన బోధనాభ్యసన సామాగ్రి , మూల్యాంకనం తదితర అంశాల రూపకల్పనువిధిగా చేసుకొని ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాల విద్యాబోధన కొనసాగించాలని డిఇఓ రమేష్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం తెలకపల్లి మండల పరిధిలోని రాంరెడ్డి పల్లి, చిన్నముద్దునూరు ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. రాంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఉదయం 9గంటల ప్రార్థన సమయానికి డిఇఓ రమేష్‌కుమార్ హాజరై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం తరగతిగదిలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు అందించారు. అనంతరం నాగర్‌కర్నూల్ మండలపరిధిలోని నాగనూల్ మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను విద్యార్థులకోసం వండే కూరగాయలను పరిశీలించారు. వండేందుకు సిద్ధంగా ఉంచిన కూరగాయల నాణ్యతను పరిశీలించారు. కోడిగుడ్లు బాగున్నాయా, చెడిపోయాయో అని తనిఖీచేశారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆహార పదార్థాలు, బోజనం వండేందుకు వినియోగించే పదార్థాలు కలుషితంకాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఏమైన సమస్యలుంటే సెక్టోరియల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. రానున్న ఇంటర్మీడియట్ , పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని సూచించారు.




## వెంటనే రుణమాఫీ అమలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలోభాగంగా రూ.2లక్షల రుణమాఫీ అర్హత ఉన్న రైతులందరికి వెంటనే మాఫీచేయాలని తెలంగాణరైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. జిల్లాకేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40లక్షలకుపైగా రైతులకు 31వేలకోట్ల మాఫీచేస్తామని ప్రకటించి నేటికి నాలుగు విడతలుగా దాదాపు 20వేలకోట్లు మాఫీచేశారని ప్రభుత్వ లెక్కలప్రకారం ఇంకా 11వేలకోట్లు రైతులకు రుణాలుమాఫీ చేయాల్సి ఉందని ప్రస్తుత నాల్గో విడతలో రేషన్‌కార్డులేని రైతులకు మాఫీచేశారని వివిధ రకాల సాంకేతిక కారణాలతో మాఫీకాని సన్నచిన్నకారు రైతులు లక్షల్లో ఉన్నారని వారందరికి తక్షణమే సాంకేతిక కారణాలు సరిచేసి వెంటనే మాఫీచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రాష్ట్రప్రభుత్వం రైతుబంధుస్థానంలో రైతుభరోసా పేరుతో రైతాంగానికి పెట్టుబడిసాయం ఎకరాకు రూ.7500 ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించి నేటికికూడా వానాకాలం యాసంగి సీజన్‌లకు రైతుభరోసా ఇవ్వలేదని రైతుభరోసా ఇవ్వకపోవడంతో రైతులు పెట్టుబడికోసం ప్రైవేట్ వ్యాపారస్తులను సంప్రదించి తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే రైతుభరోసా రైతుల అకౌంట్‌లో జమచేయాలని వారు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా కమిటిసభ్యులు వెంకటేష్, నాయకులు శివరాములు, కుర్మయ్య, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.



## సిఎం పర్యటనపై మంత్రి ఏర్పాట్లు

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి:** ఈనెల 7న సిఎం రేవంత్ రెడ్డి జిల్లాకు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో, కార్యకర్తలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం ఆయన మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల గ్రామంలో నకిరేకల్ నియోజకవర్గ రైతుల కల నెరవేర్చనున్న ఉదయసముద్రం రిజర్వాయర్ కు కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి,ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరానికి వెంకట్ రెడ్డి స్వగ్రామానికి వచ్చి, చిరకాల స్వప్నానికి పునాది రాయి వేసి ఫ్లోరిన్, భూగర్భ జలాల అడగంటుతనానికి పరిష్కార మార్గానికి శంకుస్థాపన చేస్తున్న నేపథ్యంలో జిల్లా రైతులు కృతజ్ఞత భావంతో సిఎం కు హర్షద్వానాలతో ఘన స్వాగతం పలకాల్సిందిగా ఆయన కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ను, ప్రాజెక్ట్ పనులను, పైలాన్‌లను సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లపై విశ్లేషించారు. అదే విధంగా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఇరిగేషన్ అధికారులు, మండల ప్రభుత్వం అధికారులు, మండలం కాంగ్రెస్ అధ్యక్షులు ఉషయ్య, మాజీ జడ్పీటీసీ సత్తయ్య, జిల్లా నాయకులు వద్దే భూపాల్ రెడ్డి, సట్టు సత్తయ్య, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ రాష్ట్ర నేత పోతు భాస్కర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. వైట్ హౌజ్‌లో మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్కర్ రానున్న రోజుల్లో మరెన్నో పదవులు అలంకరించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



**అన్నవితరణ కార్యక్రమం :** కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమాన్ని రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలిమినేటి అభినయ్, బైరు శైలేందర్, జహీర్, నాయకులు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, రుద్రంగి రవి, నాగుల వాసు, లింగస్వామి, అఖిల్ నాయుడు, సాయి పాల్గొన్నారు.

## పర్యాటక అభివృద్ధికి రూ. 100 కోట్లు ఇవ్వండి



**ప్రజాపక్షం/ హాలియా:** నాగార్జునసాగర్ పర్యాటక అభివృద్ధికి వంద కోట్ల రూపాయలు ఇవ్వాలని నల్గొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శకావత్ ను కోరారు. గురువారం ఎంపీ రఘువీర్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక శాఖ పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శకావతను కలిసి వినతి పత్రం అందజేశారు. దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ రఘువీర్ రెడ్డి తెలిపారు. కేంద్రమంత్రి త్వరలోనే నిధుల విడుదల చేస్తామని ఎంపీ రఘువీర్ రెడ్డికి హామీ ఇచ్చారని తెలిపారు. నల్గొండ జిల్లాలోని పర్యాటక కేంద్రాలైన పానగల్, రాచకొండ, దేవరకొండ ఖిల్లాలకు కూడా టూరిజం డెవలప్మెంట్ కింద ప్రత్యేక నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరినట్టు ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి చెప్పారు.

## భోజనం నాణ్యతలో రాజీపడొద్దు



**ప్రజాపక్షం/డిండి:** విద్యార్థినిలకు అందించే భోజనం విషయంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని డిండి మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడుతూ భోజనంలో నాణ్యత, పరిశుభ్రత, మోను సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంతృప్తి వ్యక్తం చేసిన ఎంఈవో రాష్ట్రంలో గురుకులాలు, హాస్టలలో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంట స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, కేర్, వార్డెన్ అశ్విని, ఏఎన్ఎం వెంకటమ్మ, ఉపాధ్యాయులు వెంకటయ్య పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం / అయిజ :** ఆర్యవైశ్యులు విద్య,వైద్యం,వ్యాపార ,రాజకీయ రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధించినవారము అవుతామని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటి చైర్మన్, శ్రీశైలం సత్రం చైర్మెన్ మిడిదొడ్డి శ్యామసుందర్ పేర్కొన్నారు. గురువారం అయిజ పట్టణలోని కన్యాకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం కమిటి ప్రమాణ స్వీకారానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వైశ్యులు సంఘటితంగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు ఉండాలని ఆయన అన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు ఓబయ్యశెట్టి తన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేశారు. అలాగే ఆర్యవైశ్య సంఘం యువజన మహిళా విభాగ సంఘం ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మేడిశెట్టి బాలస్వామి,గద్వాల పట్టణ అధ్యక్షులు బిలకంటి రాము,నాయకులు బచ్చు నాగరాజు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో... అతలాకుతలం!

రైతులు 'కన్నీటి సంద్రం'



**ప్రజాపక్షం/ హాలియా :** అకాల వర్షాలు రైతులు ఆరు కాలం శ్రమించి పండించిన పంటను అస్తవ్యస్తం చేసింది. ఆరబోసిన ధాన్యం, చేతికొచ్చిన పంట ఈ అకాల వర్షాలకు నీటమయమయ్యాయి. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పండించిన పంటను అకాల వర్షం చేసింది. మంచి పంట... గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన రైతులకు అన్నిటా అవరోధాలే ఎదురవుతున్నాయి. తేమ శాతం కోసం రోడ్లపై పోసిన ధాన్యం ఇక కోద్దాం అని కోత యంత్రాలను సిద్ధం చేసుకున్న రైతులకు ఒక రాత్రి కురిసిన వర్షం తో వరి అంతా నేలమట్టమై నీటిలో మునిగింది. ఆ పంటను చూసిన రైతు గుండెలవిసేలా రోదించాడు. ఆరు నెలల కష్టం ఒక్క రాత్రి తో నీటిపాలైన్ తీరు రైతులను తీవ్ర మనోవేదనకు గురిచేసింది. కోసేందుకు సిద్ధమైన వరి పంట నేలమట్టమై నీటిలో తేలియాడుతుంటే ఇక పంట ఎలా చేతికి వస్తుందో అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరానికి 45 వేల రూపాయలు ఖర్చు చేసి పండించిన పంట చేతికొచ్చే అవకాశం లేక అల్లాడుతున్నాడు. తేమ శాతం కోసం రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. నీటిలో పోగ మిగిలిన ధాన్యం తడిచిపోవడం తో దానిని తిరిగి ఆరబెడుతున్నారు. ఈ సమయంలో ధాన్యం రంగు మారుతుండడంతో రైతులు మరింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తగిన నష్టపరిహారంనష్టపరిహారం అందించడంతో పాటు రంగు మారిన ధాన్యాన్ని కూడా అన్ని ధాన్యం కొలువుల కేంద్రాలలో కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



## మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబాలు అభివృద్ధి

కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం పగిడిపల్లిలోని పాత డిఆర్డిఓ కార్యాలయంలో ప్రజా పాలన విజయోత్సవాలలో నేడు జిల్లా సమైక్య సమావేశం నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని, తద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. జిల్లాలో 17 మండల సమైక్య ద్వారా జిల్లా సమైక్యను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. బ్యాంకు ద్వారా రుణాలు తీసుకొని చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకొని ఆర్థికంగా మహిళలు స్థిరపడుతున్నారని అన్నారు. బలోపేతం చేయడానికి మహిళలకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండు జతల స్కూల్ యూనిఫామ్‌లు కుట్టించే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను కూడా మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగిందన్నారు. మహిళలకు గృహ జ్యోతి, గృహలక్ష్మి , ఉచిత బస్సు సౌకర్యం, వంటి పథకాలను తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లాలో ఐదు మహిళా శక్తి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మహిళ సంఘాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. మహిళా శక్తి ద్వారా జిల్లాలో కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు రేణుక, డిపిఎంలు, ఏపీఎంలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఎం కప్ 2024 క్రీడలకు ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లాలోని 23 మండలాల్లో 36 విభాగాలంలో నిర్వహించే క్రీడలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి వెబెక్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈనెల 7,8తేదీల్లో గ్రామ స్థాయిల, 10 నుండి 12వ తేదీ వరకు మండల, మున్సిపాలిటీల స్థాయిలో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 16 నుండి 21 వరకు జిల్లా స్థాయి, 27 నుండి 2 జనవరి 2024 వరకు రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడాల నిర్వహణకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని క్రీడల్లో జిల్లాను ముందువరసలో ఉంచేలా కృషి చేయాలన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు, ఆసక్తిగల క్రీడాకారులు తమ పేరును htpp://cmcup2024. telangana. gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆట స్థలాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. మండల, పురపాలక, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి జి రామచంద్రరావు, డిఆర్డిఓ వివి అప్పారావు, డిపిఓ నారాయణరెడ్డి, సిపిఓ ఎల్ కిషన్ నాయక్, డిటిడిఓ శంకర్, రెవెన్యూ డివిజన్ల అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కుమారుడిని కడతేర్చిన...



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నవమాసాలు మోసి కంటికి రెప్పవలె కాపాడు కోవాల్సిన కన్నతల్లే కన్న కొడుకు పాలిట మృత్యువు అయ్యింది. 11 నెలల కొడుకని కూడా కనికరం లేకుండా ఆమె ప్రవర్తించిన తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కన్నతల్లే కన్నకొడుకును కడతేర్చిన సంఘటన హుజూర్‌నగర్ మండలంలోని లక్కవరం గ్రామంలో జరిగింది. పట్టణ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం లక్కవరం గ్రామానికి చెందిన రణపంగు నవీన్‌కు 2018లో గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన మమతతో వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె సాన్వీ,11 నెలల కుమారుడు హయాన్‌లు జన్మించారు. నవీన్ సింధు ప్రైవేటు ఆసుపత్రిలో కౌం పౌండర్‌గా పనిచేస్తుండగా, ఆయన సతీమణి మమత ఇంటి వద్దనే ఉంటుంది. బుధవారం రాత్రి నవీన్ తన పనులు ముగించుకొని ఇంటికి వెళ్ళగా కుమార్తె సాన్వీ మాత్రమే ఉండటాన్ని గమనించిన నవీన్ భార్య మమత,కుమారుడు హయాన్‌ను ఇంటి సమీపంలో వెతుకుతుండగా, మమత తన కుమారుడుతో ఇంటి సమీపంలోనే ఉన్నటువంటి బావిలో దూకడం గమనించిన నవీన్ గ్రామస్తుల సహాయంతో భార్య మమతను కాపాడగా, కుమారుడు హయాన్ నీట మునిగి మృతిచెందడం జరిగిందని నవీన్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ చరమందరాజు దర్యాప్తు చేపట్టారని ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రభుత్వ విద్యా సంస్థలకు అందించే బియ్యం నాసి రకం, నాణ్యతలేని బియ్యాన్ని సరఫరా చేయడం ద్వారా ఆ బియ్యంతో వండిన ఆహారాన్ని తినడం వలన విద్యార్థులు అనేక చోట్ల నిత్యం అస్వస్థతకు గురవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు అన్నారు. గురువారం దేవరకొండ మండలంలోని పెంచికల్ పహాడ్ వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతలేని బియ్యంతో వండిన ఆహారాన్ని తిని ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అన్నారు. వారిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. నిత్యం ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కొరవడిందని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యత గల ఆహారాన్ని అందించాలని అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నిత్యం పర్యవేక్షించేలా చూడాలని మధ్యాహ్న భోజనానికి పెంచిన బిల్లులను వెంటనే అమలు చేసి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దాసరి రమేష్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో వృద్ధ దంపతుల బైఠాయింపు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం:** స్లాట్ బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ సంస్థాన్ నారాయణపురానికి చెందిన వృద్ధ దంపతులు తహసిల్దార్ కార్యాలయం ముందు సుమారు మూడు గంటలపైగా బైఠాయించారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన జక్కిడి బాల్ రెడ్డి తన పేరుపై ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో 36 ఎకరాలు తన కుమారుడైన జక్కిడి శ్రీనివాస్ రెడ్డికి రిజిస్ట్రేషన్ చేశానని తెలిపారు. కుమారుడు ప్రస్తుతం తమను పట్టించుకోకపోవడంతో తన పేరుపై ఉన్న నాలుగు ఎకరాల 10 గుంటల భూమిని అమ్మకానికి పెట్టానని తెలిపారు. అందులో భాగంగా బుధవారం కొనుగోలుదారునికి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్‌ను బుక్ చేసుకున్నానని తెలిపారు. గురువారం 12 గంటలకు స్లాట్ సమయం ఇవ్వగా స్థానిక తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయకుండా నా కుమారుడు జక్కిడి శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేశాడు. కనుక రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తున్నానని తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన వృద్ధ దంపతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయకుంటే తాను ఇక్కడే ఆత్మహత్యాయత్నం చేసుకుంటామని హెచ్చరించారు. అయినా కూడా తహశీల్దార్ స్పందించకపోవడంతో కార్యాలయం ముందు సుమారు మూడు గంటలకు పైగా బైఠాయించారు. తమ పేరుపై ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ తహసిల్దార్ ఉద్దేశపూర్వకంగా నిలిపివేయడం పట్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## ఆశాలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** ఆశ వర్కర్లకి గత సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న లెప్రసి సర్వే , పల్స్ పోలియో టిబి సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత సిలివేరు ప్రభాకర్ డిమాండ్ చేశారు.గురువారం బిఆర్టియూ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా డిఎంహెచ్ఓ ను కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ప్రభాకర్, ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ఇవ్వకుండానే మళ్లీ సర్వే చేయాలని చెప్పడం సరికాదన్నారు.సర్వే కు ఉపయోగించే రిజిస్టర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్‌లో లేని పనులను ఆశ వర్కర్లచే వైద్యాధికారులు చేపిస్తున్నారని తక్షణమే వాటిని నిలిపివేయాలని, సబ్ సెంటర్ డ్యూటీలు ఆశాల పరిధిలో లేకపోయినా ఒక వైపు డ్యూటీలు వేసి మరోవైపు సర్వేలు చేయాలని, ఫీల్డ్ లో ఉండాలని చెప్పటం వల్ల మానసిక పని ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. సబ్ సెంటర్ డ్యూటీ లు తమ పరిధిలోకి రాదని తేల్చి చెప్పిన ఆశా వర్కర్లకు జీతాలు చేయడం లేదని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఇది ఇలాంటివి మళ్లీ పునరావతమైతే డిఎంహెచ్ఓ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆశాలు ఎ భారతమ్మ,ధనమ్మ, పుష్పలత, లలిత, గీత, జానకి, యశోద, అనసూయ, ఆరీఫా బేగం, జి వెంకటమ్మ, కె అనసూయ, వసంత, సునీత, పద్మ, మంజుల, కళ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రూ. 15.20 లక్షల విలువైన 19తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకోని రెక్కి నిర్వహించి తాళాలు పగులకొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు కేసు వివరాలను వెల్లడించారు. సూర్యాపేట బస్టాండ్ ఆవరణలో అనుమానస్పదంగా తిరుగుతున్న జనగామకు చెందిన శీలంచెట్టి వెంకటరమణ అనే వ్యక్తిని పట్టణ సిఐ తన సిబ్బందితో కలిసి అదుపులో తీసుకోని విచారించారు. ఇప్పటికే అనేక దొంగతనాల కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు గుర్తించారు. 2021, 2022లో పట్టణంలో 2, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మరో 30 దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితున్ని అరెస్టు చేసి రూ. 15.20లక్షల విలువైన 19 తులాల బంగారంను స్వాదీనం చేసుకోని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సూర్యాపేట డిఎస్‌పి రవి పర్యవేక్షణలో కేసును చేధించిన సిఐలు రాజశేఖర్, వీరరాఘవులు, ఎస్ఐలు ఏడుకొండలు, టెక్నికల్ టీం సిబ్బంది కరుణాకర్, కృష్ణ, సైదులు, శివ, మధు, జిల్లా పోలీస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్ సిబ్బంది సుధాకర్, రవిలను జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అభినందించి రివార్డును అందించారని తెలిపారు.

## రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి పోరాటం



**ప్రజాపక్షం/దేవరకొండ:** రజక వృత్తి దారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం నిర్వహించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలో రజక వృత్తిదారుల విస్తృత స్థాయి సమావేశం కందుకూరు శ్రీను అధ్యక్షతన పట్టణంలోని ప్రజా భవన్ పల్లా పర్వత్‌రెడ్డి హాల్లో నిర్మాణ బాధ్యులు మొగిల్ల వెంగలయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, రాష్ట్ర నాయకులు పగిళ్ల జోజి, గోరుకంటి కృష్ణలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సంఘ నిర్మాణం, సభ్యత్వం, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించి సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని రజకులు రజక వృత్తిదారుల సమస్యలపై నిరంతరం ప్రత్యక్ష పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు. క్షేత్ర స్థాయి నుండి మండల, జిల్లా , నియోజకవర్గం మునిసిపాలిటి పరిధిలో ఉన్న రజక సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల, అధికారుల ద్వారా, ప్రజా ప్రతినిధుల ద్వారా సమస్యల పరిష్కారం కోసం ఉన్న జీవోల ఆధారంగా చేసుకొని, ముందుకు సాగాలన్నారు. ప్రధానంగా దేశంలో ఇప్పటికే 18 రాష్ట్రాలలో, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులను ఎస్సి జాబితాలో ఉన్నారని కనుక తెలంగాణ లో కూడా రజకులను ఎస్సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ చేసుకున్న రజక సొసైటిలకు 30లక్షలతో పాటు సబ్సిడి రుణాలు ఖాతాల్లో జమ చేయాలని, 55 సంవత్సరాలు నిండిన రజకులకు 4వేల పెన్షన్ మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నిర్మాణ బాధ్యులుగా వెంగలయ్య, కన్వీనర్‌గా కందుకూరు శ్రీను, కో కన్వీనర్‌గా పగిళ్ల బుచ్చయ్యను నియమించారు.

## ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి



**ప్రజాపక్షం / గద్వాల :** ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలను ధరించాలని మాటలకన్న చేతలు ద్వారా మార్పును చూపించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోస్ పేర్కొన్నారు. గురువారం ఐసిడిఓ సమావేశం హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా చేనేత ,జౌళీశాఖ ఆధ్వర్యంలో చేనేత సంబరాల కార్యక్రమంను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపరిపాలన విజయోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. దేశంలో వ్యవసాయం తర్వాత చేనేత రంగం 2వ స్థానంలో ఉందని అన్నారు. గద్వాల చేనేత చీరలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఖ్యాతి పొందాయని, భౌగోళిక గుర్తింపు ( జియోట్యాగ్) కూడా సాధించాయని తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన గద్వాల చీరల స్టాల్స్‌ను ప్రారంభించి చేనేత కార్మికుల నైపున్యతను, డిజైన్లను, ఉత్పత్తులను పరిశీలించారు. ఫ్యాషన్ షో, వ్యాసరచన,ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు,మెమొంటోలు అందజేశారు. విద్యార్థులకు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావు,చేనేత మరియు జౌళిశాఖ సహాయ సంచాలకులు నాగలత,సహాయ సంచాలకులు భిక్షపతి,జెడ్పి సిఈఓ కాంతమ్మ,జిల్లా అధికారులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# మహానగరి

## ఎంపి ప్రియాంకాగాంధీతో నీలిమ భేటీ



ప్రజాపక్షం /ఖైరతాబాద్ : లోక్‌సభ ఎంపి ప్రియాంకాగాంధీని న్యూఢిల్లీ 10 జన్‌పథ్ లోని ఆమె నివాసంలో కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. ఇటీవల వయనాడ్ ఎంపి స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ప్రియాంకాగాంధీ ఘన విజయం సాధించడం పట్ల ఆమె శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో పార్టీని బలోపేతం చేసే అంశాలపై ప్రియాంకాగాంధీ చర్చించినట్టు నీలిమ తెలిపారు.

## కాలనీలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ప్రజా పక్షం/అబ్దులాపూర్‌మెట్ : పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని పసుమముల పెద్ద అంబర్‌పేట కూంట్లూర్‌లోని పరిధిలోని వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ రెడ్డి, కౌన్సిలర్లు దేవిడి గీతా వేణుగోపాల్‌రెడ్డి, చేవుల హరిశంకర్, సిద్దేక్కి క్రిష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోత్తపల్లి జేపాల్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువుతో పాటు సమాజంపై అవగాహన

జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి



ప్రజాపక్షం/చంపాపేట: విద్యార్థుల్లో నిగూఢంగా దాగిఉండే సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహిస్తే, వారు భవిష్యత్తులో అద్భుతంగా రాణిస్తారని జిహెచ్‌ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా లాల్‌బహదూర్‌నగర్, సరూర్‌నగర్ ఉన్నత పాఠశాలలోని 8, 9వ, తరగతి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా గురువారం జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్‌కు మూడు బస్సుల్లో రెండువందల మంది విద్యార్థులను తరలించి చెత్తను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తి తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువు ఆటపాటలతో పాటు, సమాజంలో అనేక విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రాంకీ ఇంచార్జ్ వేణు, నాయకులు ఉపేందర్, పలుసం శ్రీధర్‌గౌడ్, శివగౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్ రెడ్డి, నరేశ్, రోహిత్, నరేందర్ పాల్గొన్నారు.

## రోడ్డుపై చెత్తవేయకుండా చర్యలు

హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాత నాయక్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : రోడ్డుపై వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని, తడి, పొడి చెత్తను పేరు చేసి జిహెచ్‌ఎంసి రిక్షాలోనే వేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ ప్రజలను కోరారు. గురువారం డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో 6 రిక్షాలను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను రోడ్డుపై వేయడం వల్ల దుర్గంధం వాసనతో రోగాల బారిన పడతారని దోమల బెడద ఎక్కువ అవుతుందని, ప్రజలు గమనించి ప్రతి ఒక్కరు తడి పోడి చెత్తను వేరు చేసి రిక్షా, ఆటో వాళ్లకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజు గౌడ్, చందు, జవాన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నత్తనడకన అభివృద్ధి పనులు

ఎల్‌బి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆగ్రహం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : హస్తినాపురం డివిజన్‌లోని జయకృష్ణ ఎంక్లేవ్ కాలనీలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను గురువారం ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మ శ్రీనివాస్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ జయకృష్ణ ఎంక్లేవ్‌లో దాదాపు 3వేల గజాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్విమ్మింగ్ పూల్, షటిల్ కోర్టు, ఇండోర్ జిమ్, ఆఫీస్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. పనులు నత్తనడకన నడుస్తున్నయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవిండ్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సవాలుగా వాతావరణంలో మార్పులు

ఐఎఫ్సీ ఇండియా కంట్రీ హెడ్ వెండీ వెర్నర్




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : వాతావరణంలో మార్పులు సవాలుగా మారాయని ఐఎఫ్సీ ఇండియా కంట్రీ హెడ్ వెండీ వెర్నర్ తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో "సస్టైనబుల్ ఫ్యూచర్: ది నెట్ జీరో డైలాగ్" అనే అంశంపై హోటల్ అవాసాలో సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫిన్లాండ్ కాన్సుల్ జనరల్ ఎరిక్ ఆఫ్ హాల్స్‌ట్రామ్, సందీప్ కుమార్ సుల్తానియా, వెండి వెర్నర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెండీ వెర్నర్ మాట్లాడుతూ మార్పులు మన జీవితాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. మన ఆర్థిక వ్యవస్థ, వ్యక్తిగత వ్యాపారాలు, సమాజం, మన గ్రహ భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. గతంలో స్థిరత్వం, లాభదాయకత పరస్పర విరుద్ధంగా భావించే వారన్నారు. వ్యాపారులు లాభాలపై మాత్రమే దృష్టి పెట్టేవారని తెలిపారు. సామాజిక ప్రభావాన్ని పట్టించుకునే వారు కాదన్నారు. కానీ ఈ రోజుల్లో ఈ రెండు లక్ష్యాలు కలిసి నడవాల్సి ఉందన్నారు. నియమాలు, అవసరాలు, వాతావరణ సవాళ్ళ ప్రభావాన్ని పరిగణలోకి తీసుకోకుండా వ్యాపారులు తమ ఆపరేషనల్ రిస్క్‌లను అన్ని వనరులను తిరిగి ఉపయోగించే సర్క్యులర్ ఎకానమీ మోడళ్లు కీలకమన్నారు. వనరులను పునర్వినియోగం చేసుకోకపోతే,భవిష్యత్తులో మరిన్ని సమస్యలకు కారణం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఫిక్కీ నేషనల్ కమిటీ ఆన్ ఎన్విరాన్మెంట్, క్లైమేట్ చేంజ్, అడ్వైజర్,గ్రీన్కో గ్రూప్ కో చైర్మన్ డాక్టర్ పీ రాంబాబు తదితరులు 300 మందికి పైగా పాలసీ మేకర్లు, కార్పొరేట్ నాయకులు హాజరయ్యారు.

## ఫీజులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని

# 10న కలెక్టరేట్‌ల ముట్టడి

ఆర్.కృష్ణయ్య పిలుపు




ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రాష్ట్రంలోని 16లక్షల 75వేల మంది విద్యార్థులకు రూ.4వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజులు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా చలో కలెక్టరేట్, ఆర్‌డిఒ, ఎంఆర్‌ఒల ముట్టడిని నిర్వహించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ బిసి విద్యార్థి సంఘం వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్యతో పాటు పలువురు బిసి సంఘం నేతలు చలో కలెక్టరేట్ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొచ్చి 11 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా స్కాలర్‌షిప్‌లకు బిల్లులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. కాంట్రాక్టర్లకు వందల కోట్లు బిల్లులు చెల్లించడంపై ఉన్న శ్రద్ధ భావి తరాలైన విద్యార్థులకు ఫీజులు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. పెండింగ్ ఫీజుల కోసం కాలేజీలు నాలుగు రోజులు బంద్‌చేస్తే తానే జోక్యం చేసుకొని, విద్యార్థులు చదువు దెబ్బతింటుందని యాజమాన్యాలకు నచ్చజెప్పి పునఃప్రారంభించానని తెలిపారు. కొంతమంది ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి లేనిపోని సాకులు చెప్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చి ఎత్తివేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పేద వర్గాల చదువులకు వెన్నుదన్నుగా నిలిచే ఈ స్కీం జోలికొస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని కృష్ణయ్య హెచ్చరించారు. ఏపిలో ఉన్నత విద్య విద్యార్థికి ఏడాదికి రూ.20 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు, కర్ణాటకలో రూ.15వేల స్కాలర్‌షిప్‌లు చెల్లిస్తున్నారని, కానీ, తెలంగాణ ప్రభుత్వం కేవలం రూ.5,500 ఇస్తూ చేతులు దులుపుకొంటున్నదని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లను కనీసం రూ.20వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి సంఘం నేతలు గొరిగె మల్లేశ్ యాదవ్, నీల వెంకటేశ్, జిల్ల అంజి, నంద గోపాల్, రాజేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్ సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : జిల్లాలోని రాజేందర్ నగర్ ఇవిఎం గోడౌన్స్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గురువారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇవిఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇవిఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇ విఎం భద్రపరిచిన గోడౌన్ ను వారి సమక్షంలో సీల్ వేయించడం జరిగినది. కార్యక్రమంలో కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జ్ బొమ్మ రాములు, రాజవర్ధన్ రెడ్డి ఎలక్షన్ సుపరిటెండెంట్, కె.రఘు టెక్నికల్ మానేజర్ రంగారెడ్డి, సంబంధిత అధికారులు, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, సిపిఐ, బిజెపి తోపాటు ఇతర పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో గర్భిణులను గుర్తించాలి

జిల్లా మెటర్నల్, చైల్డ్ హెల్త్ అధికారిణి డాక్టర్ పూనమ్

ప్రజాపక్షం/కొందుర్గు: గ్రామాల్లో గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలని జిల్లా మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ అధికారిణి డాక్టర్ పూనమ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే సమీక్ష సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పూనమ్ మాట్లాడుతూ ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణీలను గుర్తించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే, వారికి ఐరన్ మాత్రలు, టిటి ఇంక్షన్ ఇవ్వాలని, మొదటి, రెండవ పరీక్షలను పిహెచ్‌సీ వైద్యురాలి వద్ద చేయించాలని, మూడవ, నాలుగవ పరీక్షలు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో చేయించాలని సూచించారు. రెండు సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ సంపూర్ణమైన వ్యాక్సిన్లు ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిధి దాటిన గ్రామాల నుంచి వచ్చిన వారికి కూడా వైద్యం చేయాలని, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తప్పని సరిగా యూనిఫాం ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, వైద్యాధికారిణి అమృతా జోసఫ్, డిపిఎంఓ అక్రమ్, హెల్త్ ఎడ్యుకేటర్ జె శ్రీనివాసులు, సిబ్బంది లూథియా, శ్రీనివాసులు, అశ్వక్, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## చిరు ఉద్యోగులను కనికరించని గత ప్రభుత్వం



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: గత ప్రభుత్వ చిరు ఉద్యోగులను కనికరించలేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విఆర్‌ఎలు సమస్యలతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యేకు అందజేశారు. నందిగామ మండల కేంద్రానికి చెందిన కరోబార్ల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్ల సమస్యలపై శాసన సభలో మాట్లాడేందుకు కృషి చేస్తానని వివరించారు. వీఆర్‌ఏలతో ఇష్టం వచ్చినట్లు పనులు చేయించుకున్నారే తప్పా వారిని పర్మినెంట్ చేయడంలో మాత్రం గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోపాటు రెవిన్యూ శాఖ నుండే వారికి తప్పించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్‌ఏలతోపాటు విఆర్‌ఓలను సైతం తప్పించి ధరణి తీసుకువచ్చి అనేక గందరగోళం సృష్టించారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న కారోబార్లకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నాన్చుడు దోరణి అవలంభించారని వాపోయారు. విధి నిర్వాహణలో జీవన ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని మాకు నెలకు రూ.18వేల నుండి రూ.25వేల వరకు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కారోబార్లు ఎమ్మెల్యేను కోరారు. 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో విఆర్‌ఎలకు పేస్కేల్, వారసుకలు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నాన్చుదు దోరణి అవలంభించిందని ఎమ్మెల్యేకు వివరించారు.

### పర్యాటక ప్రాంతంగా కొండారెడ్డిపల్లి పెద్దచెరువు

కేశంపేట : కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి పోమాల్‌పల్లి పెద్దచెరువు కట్ట అధునీకరణ కోసం తయారు చేసిన ఎస్టిమేషన్‌ను గురువారం కాంగ్రెస్ నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. చెరువు కట్టను సుందరీకరణ చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు సుమారు 4.5 కోట్లు ఖర్చవుతుందని, చెరువు కట్ట అధునీకరణ కోసం కావాల్సిన నిధులను వెంటనే మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, బ్లాక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

## క్రీడా పోటీలతో ప్రతిభ వెలుగులోకి

ఎంపిడిఒ లక్ష్మీ అనురాధ



ప్రజాపక్షం/కొందుర్గు: సిఎం కప్ 2024ను విజయవంతం చేయాలని ఎంపిడిఒ లక్ష్మి అనురాధ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లక్ష్మి అనురాధ మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల ప్రతిభ క్రీడాకారులు వెలుగులోకి వస్తారని, ఇందుకోసం గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. సీఎం కప్ క్రీడా పోటీలను ఈ నెల 7,8 తేదీలలో రెండు రోజుల పాటు గ్రామ పంచాయితీ స్థాయిలో, 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు మండల స్థాయిలో, 16వ తేదీ నుంచి 21వ వరకు ఆరు రోజుల పాటు జిల్లా స్థాయిలో, ఈ నెల 27 నుంచి 2 జనవరి, 2025 వరకు ఏడు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. క్రిడల నిర్వహణకు మండల ప్రత్యేకాధికారి చైర్మెన్‌గా, తాను కన్వినర్‌గా, తహాశీల్దార్, పంచాయితీ అధికారి, ఎంఈవో, ఎస్సై, ఉన్నత పాఠశాల పిడిలు సభ్యులుగా మండల కమిటిని ఎన్నిక చేయడం జరిగిందని తెలిపారు. సీఎం కప్ పోటీలలో అథ్లెటిక్, రన్నింగ్ 100 మీటర్లు, 200మీటర్లు, లాంగ్ జంప్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగ పోటీలను నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ స్థాయిలో గెలుపోందిన వారు, మండల స్థాయికి వస్తారని, అక్కడ గెలుపోందిన వారు జిల్లాస్థాయికి వెళ్తారని తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారుల వివరాలు తప్పని సరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అప్పుడే వారు పోటీలలో పాల్గొనెందుకు అవకాశం ఉంటుందని ఎంపిడివో వివరించారు. ఎన్నికలకు సంబంధించి మండలంలో ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించడం జరిగిందని, అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందని, చిన్న చిన్న మరమ్మత్తులు ఏమైనా ఉంటే చేయించాలని గ్రామ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో తహాశీల్దార్ రమేష్ కుమార్, ఇంఛార్జి ఎంఈవో గాయత్రిదేవి, ఎంపివో లాలయ్య, ఏపిఎం జయమాలిని, ఏపివో నర్సింగ్ రావు, పంచాయితీ కార్యదర్శులు బాబయ్య, చేవెళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమృత్ నిధులు తెలంగాణ హక్కు

ప్రజాపక్షం/షాద్‌నగర్: అమృత్ నిధులు తెలంగాణ హక్కు అనే విషయాన్ని బిజెపి నేతలు మరచిపోతున్నారని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌తోపాటు వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు రఘు, చెంది తిరుపతిరెడ్డిలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సులోచన కృష్ణారెడ్డి మాట్లాడుతూ అమృత్ నిధులు తెలంగాణ హక్కు అనే విషయాన్ని మరచిపోవద్దని, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విమర్శించే నైతిక హక్కు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి లేదని సూచించారు. ఎంపి డికె అరుణను కాంగ్రెస్ టార్గెట్ చేయాల్సిన పని లేదని, చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గతం లోదాని కంటే అదనంగా రూ.90కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నియెజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తుంటే అది చూసి ఓర్వలేక నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు అగ్గనూరి బస్వం, మహ్మద్ ఇబ్రహీం, యాదగిరి యాదవ్, గంగనమోని సత్తయ్య, లింగారెడ్డిగూడ అశోక్ ఉన్నారు.



## పనితీరును ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయించడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ప్రశ్నించారు. గురువారం షాద్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయించడంతోపాటు నిర్భందాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ మంత్రి తన్నీరు హరిష్ రావు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ అరెస్టులు నిలిపివేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలు దృష్టి పెంటాల్సింది పోయి ప్రతిపక్ష నేతల అరెస్టులపై పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ప్రతిపక్ష నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేయడంతోపాటు రెండు సార్లు మంత్రిగా పనిచేసిన హరిష్‌రావును అరెస్టు చేయడం సరికాదని హెచ్చరించారు. అధికారం ఎవరికి సొంతం కాదనే విషయాన్ని గ్రహించాలని, అధికార దాహంతో కక్షపూరిత రాజకీయాలకు పాల్పడటం రాజకీయ ధర్మం కాదనే విషయం గుర్తించాలని సూచించారు. అక్రమంగా అరెస్టు చేసిన హరిష్‌రావును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

## పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)బాలాపూర్ మండల సమితి కార్యకర్తలు నంది హిల్స్ లో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రవీంద్రాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం ఎర్రజెండా సరైన బాట అని నమ్మి ప్రజలు భారత కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై ప్రజా సంఘాల నాయకులుగా పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తూ నేడు సోషలిస్టు నిర్మాణమే కర్తవ్యంగా సమ సమాజ స్థాపన కోసం ఎర్రజెండా చేత భూమి నిస్వార్థంగా జనం కోసం పనిచేస్తున్నటువంటి కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలని, వారు పార్టీకి పట్టుకొమ్మలని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అయ్యిందని కమ్యూనిస్టులు ప్రజల కోసం చిత్తశుద్ధితో నిస్వార్థంగా జీవితాలను త్యాగం చేసి పనిచేస్తున్నారని నిజమైన కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీకే సొంతమని చెప్పారు. ఒక నూతన సమాజ నిర్మాణం కోసం పోరాడుతున్న పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని పార్టీ సభ్యత్వాన్ని పెంచుకోవడంతో పాటు అన్ని ప్రాంతాలకు విస్తరించాలని, మండల నాయకత్వం శాఖలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలాపూర్ సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్ రెడ్డి, జర్పుల శివనాయక్, జాజాల అంజయ్య, బండ యాదమ్మ యాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## ప్రభుత్వ ఏడాది వేడుకల్లో కళాయాత్ర

**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు 2024 భాగంగా గురువారం కళాయాత్ర జరిగింది. తెలంగాణా సాంస్కృతిక సారథి కళాకారుల బృందాలు జిల్లాలోని ఆల్వాల్ మండలంలోని మచ్చబొల్లారం, శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి, మేడ్చల్ మండలంలోని రాజా బొల్లారం, మేడిపల్లి మండలంలోని మేడిపల్లి, ఫిర్జాదిగూడ, మియాపూర్ మున్సిపల్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ ఉష, గ్రామ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## బోడుప్పల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బద్దుల శ్రీకాంత్ యాదవ్ ఎన్నికయ్యారు. హోరా హోరిగా జరిగిన ఎన్నికల్లో తుది విజయం తనదే నన్నారు. ఈ సందర్భంగా బద్దుల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో నాకు ఓట్లు వేసి గెలిపించిన యూత్ కాంగ్రెస్ నాయకులకు, నగర కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్‌లో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## తొక్కిసలాటలో మహిళ మృతి

### బాధ్యులపై కేసు నమోదు చేయాలి: ఏఐఎస్ఎఫ్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి :** ప్రీమియర్ షో తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన ఉదంతంలో ఆ సినిమాకు సంబంధించిన హీరో అర్జున్‌తో సహా బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ బుధవారం బెనిఫిట్ షో సందర్భంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కారణంగానే తొక్కిసలాట కారణంగా సినిమా చూసేందుకు వచ్చిన రేవతి మృతి చెందటం విచారకరమని, ఇలాంటి షోల పేరిట సినిమా వర్గాలు చేస్తున్న దోపిడీకి అరికట్టాలని, ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, బెనిఫిట్ షోలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వరాదని కోరారు. సినీ వర్గాలు దండుకొనేందుకు ప్రభుత్వాలు ఇష్టారీతిగా టికెట్ల ధరలను వేల రూపాయల కొద్దీ పెంచేందుకు అనుమతి ఇవ్వటం సరైన నిర్ణయం కాదన్నారు. ప్రజా సమస్యల గురించి ప్రజానీకం ఆందోళనలు చేసేందుకు ప్రజలు గుమి కూడరాదంటూ నానా రకాలుగా ఆంక్షలు విధిస్తూ అనుమతులు ఇవ్వక పోగా అరెస్టులు సైతం చేసే ప్రభుత్వాలు జనం పెద్ద సంఖ్యలో వస్తారని తెలిసీ విలాసంగా మారిన సినిమా ప్రచారం కోసం సినీ హీరోలు ప్రజా కూడలి ప్రాంతాల్లో ఉండే సినిమా హాళ్లకు వచ్చేందుకు ఎలా అనుమతులిస్తారని ప్రశ్నించారు. సినిమా టికెట్లు పెంచేందకు ప్రభుత్వ జిఓలు విడుదల చేయటం అదేమైనా ప్రజా అభివృద్ధి పని అని భావిస్తున్నారా అని విమర్శించారు.

## ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శివసాయి ఎన్‌క్లేవ్ కాలనీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం 4వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ మంత్రి,మేడ్చల్ ఎంఎల్‌ఏ చామకూర మల్లారెడ్డిని శివసాయి ఎన్‌క్లేవ్ అధ్యక్షులు,టిడిపి నాగారం అధ్యక్షులు కొండా జంగారెడ్డి ఆహ్వానించారు.వార్షికోత్సవం సందర్భంగా 6,7వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్,వీరన్న గౌడ్,సమీర్ తదతరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సురేష్



**ప్రజాపక్షం/అల్వాల్:** పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవ పురస్కారాల ప్రదానోత్సవం త్యాగరాయ గానసభ చిక్కడపల్లి లో ఘనంగా నిర్వహించడం జరిగింది. మచ్చ బొల్లారం డివిజన్‌లోని సురేష్ సేవా సమితి వ్యవస్థాపకుడు నార్ల సురేష్ గత 24 సంవత్సరముల నుండి చేస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ సేవ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సేవా మార్గం నిరంతరం కొనసాగే ప్రక్రియ అని మనం సంపాదించిన ధనంలో కొంతైనా సేవా కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణు గోపాల చారి, రిటైర్డ్ జడ్జి మధుసూదన్ రావు, డాక్టర్ రాధా కుసుమ, మురళి మోహన్, రాజు, చంద్రశేఖర్ వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజయ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/బోడుప్పల్:** ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణలో నిర్వహించిన ఎన్నికలలో మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిలుముల అజయ్ కుమార్ రెడ్డి ఎన్నికయ్యారు. నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ఎన్నికల్లో చిలుముల అజయ్ డ్డి 1446 ఓట్లతో విజయాన్ని సాధించారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ముందుకు సాగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో యువతకు సముచితంగా అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మేడిపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తన గెలుపు కోసం కష్టపడ్డ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని, పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరిని కలుపుకొని పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నాణ్యతా ప్రమాణాలతో, జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అన్నారు. సిఫిల్‌గూడ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ శ్రీకాంత్, వర్క్స్ ఇనస్పెక్టర్ రజనీకాంత్, సత్యనారాయణ, కిషోర్, సిఫిల్‌గూడ కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, ఓం రాజ్, సోమయ్య, శేషగిరిరావు, చంద్రకళ, చంద్రకాంత్, పైడిరాజు, కిరణ్‌కుమార్, సుష్మిత, వనమాల, సంధ్య, వెంకటేశ్వర్లు, మాధవి, నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెద్దేముల్ వాసి అతీఫ్‌కు డాక్టరేట్

**ప్రజాపక్షం/పెద్దేముల్:** మండల కేంద్రమైన పెద్దేముల్‌కు చెందిన సయ్యద్ అతీఫ్‌కు డాక్టరేట్ వరించింది. హైదరాబాద్‌లోని షాదన్ ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫేసర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ అతిఫ్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ అండ్ మైక్రో ఫైనాన్స్‌పై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫెరోజాబాద్ జిల్లా కేఎఎస్ యూనివర్సిటి నుండి పెద్దేముల్ గ్రామానికి చెందిన సయ్యద్ అతిఫ్‌కు గౌరవ డాక్టర్‌తో సత్కరించారు. మారు మూల ప్రాంత వాసికి రుదైన గౌరవ దక్కడం పట్ల గ్రామస్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## గురుకులాల అభివృద్ధికి కృషి

### టిపిసిసి ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గురుకులాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని టిపిసిసి ఉపాధ్యక్షుడు మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో అంకుషాపూర్ గ్రామంలోని ప్రిన్స్‌టన్ గురుకుల పాఠశాలను టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ గురుకులాల అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి సర్కారు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. నేరుగా ఆయన వంట గదులు వంట సామగ్రి, కూరగాయలు, వంటకు వినియోగించే నూనె, పప్పుదినుసులు తదితర సామగ్రి ఏ పరిస్థితుల్లో ఉన్నాయన్న విషయాలను చూశారు. వంటశాలల్లో పదార్థాలకు వినియోగించే గిన్నెలు గరిటెలు శుభ్రంగా ఉంటున్నాయా లేదా అని చూసిన వజ్రేష్ యాదవ్ విద్యార్థులకు వడ్డించే స్థలాల్లో పరిస్థితులు వడ్డించే తీరును చూడటంతో పాటు విద్యార్థులతో కల్సి వారి కోసం చేసిన వంట పదార్థాలను తిని చూసారు. విద్యార్థులను ప్రతి రోజు వంట పదార్థాలు వేడిగా రుచిగా పరిశుభ్రంగా ఉంటున్నాయా లేదా కడుపునిండా పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించే విషయంలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకొన్నా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు మామిడ్ల ముత్యాలు యాదవ్, మండల అధ్యక్షులు కర్రె రాజేష్, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటి డైరెక్టర్ చిలుగురి మచ్చెందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధా కృష్ణ ముదిరాజ్, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, డిసిసి కార్యదర్శి,ఆంజనేయులు యాదవ్, కావడి మాధవ్ రెడ్డి, కోరుబోతు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి :** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో స్వయం సహాయ సంఘాల ద్వారా ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగగలుగుతున్నారని జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రతి మహిళా ఒక వ్యవస్థాపకురాలిగా మారి పలువురికి ఉపాధి కల్గించే స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిల్పారామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న ఇందిరా మహిళా బజార్ ఓపెనింగ్ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నుండి నలుగురు మహిళా వ్యవస్థాపకులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సిఎంతో పాటు జిల్లా కలెక్టర్ గౌతం సందర్శించారు. మహిళా శక్తిలో భాగంగా ప్రతి మండలంలో ఒకటి చొప్పున మహిళా క్యాంటిన్, 100 మందికి బ్యాక్ యార్డ్ పౌల్ట్రీలాంటివి అందిస్తున్నారన్నారు. మూసీ నిర్వాహక ప్రాంతాల్లో నుండి పునరావాసం కల్పించిన ప్రతాపసింగారం గ్రామ పంచాయతి సమావేశం ద్వారా మహిళా సభ్యులను కొత్త సంఘాలలో చేర్పించి మహిళా శక్తి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

## బాలమల్లేష్‌కు ఘన నివాళులు

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



**ప్రజాపక్షం/తాండూరు:** బాలమల్లేష్ మరణం పార్టీకి తీరనిలోటని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజలయక్ష్మి పండిత్ అన్నారు. గురువారం తాండూరు పట్టణంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం పట్టణ కార్యదర్శి ఫీర్ మహ్మాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన రాష్ట్ర కార్యదర్శిగా వికారాబాద్ జిల్లా బాధ్యులుగా పనిచేసిన బాలమల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ల చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా తమ సంతాపాన్ని ప్రకటించి వారు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన బాలమల్లేష్ పార్టీలో ఆఫీసు గార్డ్ స్థాయి నుండి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేశారని గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయికి ఎదగాడనికి బాలమల్లేష్ పోరాట పటిమ ఇందుకు నిదర్శనమన్నారు. పార్టీ పట్ల నిష్టంగా సౌమ్యుడిగా అందరిలో మంచి మనిషిగా పేరు సం పాదించారని అన్నారు. బాలమల్లేష్ మరణం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తీరని లోటని అన్నారు. కార్యవర్గ సభ్యుడు రవింద్ర మునీర్ ఆహ్మద్, అబ్దుల్లా, కౌన్సిల్ సభ్యుడు నసీమా బేగం, సురేష్,చంద్రయ్య, ఖాదర్, జగదాంబ ఉన్నారు.

## భూపతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/దుండిగల్:** టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోసం పని చేస్తూ నేటికీ కాంగ్రెస్ పార్టీలోనే ఉండి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ అన్నివిధాలుగా అండగా ఉంటున్న నర్సారెడ్డి భూపతిరెడ్డిపై ఇకపై ఆరోపణలు చేసే ముందు వారి స్థాయి తెలుసుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే కబ్జాలపై ప్రశ్నించిన నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆరోపణలకు సమాధానం చెప్పకుండా అదే కబ్జాలు చేసిన చెంచాలతో అసత్యాలు మాట్లాడించిన ఎమ్మెల్యే బహిరంగ చర్చకు సిద్ధమా..?

### కబ్జాలు చేసిన భూముల వద్దనే తేల్చుకోవడానికి మీరు సిద్ధమా?

గడిచిన పదేళ్ళు అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాల్లో ప్రభుత్వ భూములు చెరువులు పార్కులు కబ్జాలు ప్రత్యక్ష, పరోక్ష సహకారం అందించిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ అనుచరులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కబ్జాల కట్టడి, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని ఎమ్మెల్యే ఎమ్మెల్సీ చేసిన అక్రమాలపై అతి త్వరలోనే ప్రజాక్షేత్రంలో చట్ట పరంగా శిక్ష పడుతుందని హెచ్చరిస్తున్నామని హ్యాట్రిక్ ఎమ్మెల్యే కుత్బుల్లాపూర్ లో దాదాపు 25 మంది అనుచరులతో 900 ఎకరాలకు కబ్జ పెట్టించి



కమిషన్లు తీసుకున్నది నిజం కాదా..? చెరువుల్లో 9 సంవత్సరాల్లో కబ్జాలకు సహకరించారాని అన్నారు. తక్షణమే ఆరోపనులు వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ శ్రేణులు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ ఏ.బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు సదానందం ముదిరాజ్, జిల్లా ఫిషెర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షులు పోచి మహేశ్ ముదిరాజ్, మైనారిటీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ సమీర్ ఖాన్, రాష్ట్ర ఓబిసి సెల్ జాయింట్ కో ఆర్డినేటర్ భరత్ గౌడ్, కుత్బుల్లాపూర్ మైనారిటీ సెల్ అధ్యక్షులు జలీల్ ఖాన్, మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రెటరీ బత్తుల చిరంజీవి, దుండిగల్ మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఫాతిమా, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు దాసరి మహేశ్, మాజీ వార్డ్ సభ్యుడు పరశురాం గౌడ్, సీనియర్ నాయకులు జక్కుల మల్లేశ్, పిఎసిఎస్ సభ్యులు శ్రీనివాస్, ధర్మారెడ్డి, రవి నాయక్, బండ్ల విజయ్ కుమార్ నాయకులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలలో స్పీకర్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని 52లక్షలతో ఎన్కతల 33/1కేవి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభించిరు. మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్దిదారులకు మంజురైన 66కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, 25 సిఎంఆర్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చంద్రన్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ, పూర్వ ప్రాథమిక పాఠశాల పిల్లలకు యునిపామ్ పంపిణీ చేశారు. మొరంగపల్లి గ్రామంలో 25లక్షల రూపాయలతో నిర్మించిన నూతన హెల్త్ సెబ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నీ తప్పకుండా అమలవుతాయని అన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసాలపై డిసెంబర్ 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తారని అన్నారు. అర్హులైన వారందరికి ఈ రెండు పథకలు అందుతాయి అన్నారు. వికారాబాద్ నియోజకవర్గనికి పరిశ్రమలు తీసుకురావడానికి ప్రయత్నీలు చేస్తున్నాను. పరిశ్రమల ఏర్పాటు తో యువతకు ఉద్యోగ అవకాశాలు వాస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజురు చేసిన నివాస గృహలకు సోలర్ పైలట్ ప్రాజెక్టును మోమిన్‌పేట్ మండలలంఓ అమలు చేస్తాం అన్నారు. త్వరలో అన్ని రోడ్ల పనులను ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గోన్నారు.



## ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ ఆర్‌టిసి బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో నాలుగు అమలవుతున్నాయి, అందులో ముఖ్యంగా మహిళలకు ఉచిత ప్రయాణిన్ని అధికారంలోకి వచ్చిన ఇరువై నాలుగు గంటలలోనే అమలు చేశమని అన్నారు. మహిళా ప్రయాణికులు పెరగడంతో బస్సులలో రద్దీ పెరిగింది. డిమాండ్ కూడా బాగా ఉన్నాది వికారాబాద్ డిపోకు యాబై నూతన బస్సులు కావాలని మంత్రిని కోరితే ఆరు బస్సులు పంపారు అన్నారు. ఆర్థిక పరిస్థితులను సరిచేయడానికి కష్టపడుతున్నారు. నవంబర్ 30నాటికి మహలక్ష్మి పథకంలో భాగంగా రాష్టంలో 114 కోట్ల మంది మహిళలు అర్‌టిసి బస్సులలో ఉచితంగా ప్రయణించారు. 3,856 కోట్ల రూపాయల చార్జీల డబ్బులు మహిళలు ప్రయాణిస్తే పథకం వచ్చిన తరువత ఆరవై శాతం మంది ప్రయణిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలోని మైదు బస్ డిపోల ద్వారా ఇప్పటివరకు రెండు కోట్ల ముపై మూడు లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయణించారు. 85కోట్ల చార్జీల డబ్బులు మహిళలకు ఆదా అయ్యాయి. మహిలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత ప్రయాణికి అయిన ఖర్చులో భాగంగా 1,375 కోట్లను ప్రభుత్వం తిరిగి అర్‌టిసి కి చెల్లించింది. లభాలు వచ్చే రూట్టలో బస్సులు నడపాలని అన్నారు. బస్టాండ్ ను అభివృద్ధి చేయడానికి నావంతు కృషి చేస్తాన్నారు. డీపో మేనేజర్, ఆరుణ ,పట్టాణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టరేట్ నుంచి 2కె రన్




**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సిఎం కప్2024 క్రీడా పోటీల సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి 2కె రన్ జరిగింది. తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రహదారి పక్కన చెత్త వేస్తే జరిమానా



**ప్రజాపక్షం/కాప్రా :** రహదారి పక్కనే చెత్త వేస్తున్న చిరువ్యాపారులపై జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలోని భాగంగా ఈసిఐఎల్ చౌరాస్తా నుండి చక్రిపురం వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఐదుగురు వ్యాపారస్తులపై జరిమానాలు విధించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, సానటరీ జవాన్ రాజన్, రామ కృష్ణ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

## ప్రయాణికులకు తప్పని తిప్పలు

### పట్టించుకోని సంబంధిత అధికారులు...!!



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** అక్నాపూర్ సమీపంలో డబుల్ రోడ్డు కొంత మేరకు పూర్తిగా కంకర తేలడంతో నాలుగు నెలల కిందట రోడ్డును తవ్వి కంకర వేశారు. ఈ రోడ్డును కొత్తగా వేసేందుకు కిలోమీటరు మేర మధ్యలో బీటీ రోడ్డును కాంట్రాక్టర్ తొలగించి కంకర పరిచే పనులు చేపట్టారు. ఈ కంకర వేసి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఈ మార్గంలో పరిచిన కంకరతో ముందు వెళ్తున్న వాహనాలతో దుమ్ములేచి దిచక్రవాహనదారులపై పడి ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో ఉవ్వెత్తున వెలువడే కంకర దుమ్ముతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనాదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## పెద్దేముల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**ప్రజాపక్షం/పెద్దేముల్:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మండల కేంద్రమైన పెద్దేముల్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ దివ్యాంగుల దినత్సోవాన్ని పురష్కరించుకుని పెద్దేముల్ మండల వనరుల కేంద్రంలో చిన్నారి దివ్యాంగులకు ఆట పోటిలు నిర్వహించారు. అంగ వికలాంగులను అందరికి చేయుతను ఇవ్వాలని సూచించారు. ఈ ఆట పోటిలలో గెలుపొందిన చిన్నారులకు పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు, శ్రీకాంత్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## నేటి నుంచి శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/అల్వాల్:** అల్వాల్ పట్టణ కేంద్రంలోని వందల సంవత్సరాల అతి పురాతనమైన దక్షిణ తిరుపతిగా పిలవబడే శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నేటి నుండి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల15 వరకు జరుగుతాయని మంగళవారం విజయదశమి శుభ సందర్భంగా స్వామి వారి తిరు కళ్యాణం జరుగుతుందని ఆలయ వంశం పరంపర్య చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సెంచర్ ఆలయ కార్య నిర్వహణ అధికారి వీరేశం వెల్లడించారు. ఆలయంలోని బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయడం భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా మంచినీటి సౌకర్యం వివిధ మౌలిక సదుపాయాలను కల్పించామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతినిత్యం పూజ నైవేద్య సేవా కార్యక్రమాలు పొందుతూ, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని భక్తులు దర్శించి ధరించగలరని తెలిపారు.

## డబిల్‌పురా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా డా.కల్పన

**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి :** ప్రజా పాలనలో భాగంగా డబిల్‌పురాలోని పశు వైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నూతనంగా డాక్టర్ కల్పనను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. సమాజంలో పశువుల సంరక్షణ కోసం వెటర్నరీ సంబంధిత వైద్య సేవలు, ఆరోగ్య పరిశోధనలు ఎంతగానో అవసరమని జిల్లా పశు సంవర్ధక అధికారి డా.సుధాకర్ అన్నారు.ఈ విషయంలో తమ వద్ద ఉండే జంతువుల వైద్య సేవలకు గాను ప్రభుత్వ వెటర్నరీ సేవలను వినియోగించుకోవాలన్నారు.

క్రీడ

# 6 ఏళ్ల తర్వాత మిడిలార్డర్‌లో రోహిత్!




ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో శుభారంభం చేసిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి అడిలైడ్ వేదికగా ప్రారంభం కానున్న పింక్ బాల్ టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకో నుంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూర మైన రోహిత్ శర్మ.. పింక్ బాల్ టెస్ట్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అయితే రోహిత్ శర్మ గైర్హాజరీలో ఓపెనర్‌గా ఆడిన కేఎల్ రాహుల్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. దాంతో అతన్నే ఓపెనర్‌గా కొనసా గించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయిం చింది. రాహుల్ ఓపెనర్‌గా ఆడనుండటంతో రోహిత్ శర్మ మిడిలార్డర్‌లో ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కెరీర్ ఆరంభంలో మిడిలార్డర్‌లో ఆడిన రోహిత్ శర్మ.. మళ్లీ 6 ఏళ్ల తర్వాత అదే స్థానంలో బరిలోకి దిగనున్నాడు. దాంతో మిడిలా ర్డర్‌లో రోహిత్ శర్మ గణంకాలు ఎలా ఉన్నాయనే ఆతృత అభిమానుల్లో నెలకొంది. 2018లో చివరిసారిగా మిడిలార్డ ర్‌లో ఆడిన రోహిత్ శర్మ.. ఆ తర్వాత ఓపెనర్‌గా బరిలోకి దిగి అసాధారణ ప్రదర్శనతో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇన్నాళ్లకు మళ్లీ రోహిత్ మిడిలార్డర్‌లో ఆడుతుండ టంతో అతని ఆట ఎలా ఉంటుందో ననే అంచనాలు పెరిగిపోయాయి. ఇప్పటి వరకు రోహిత్ శర్మ మిడిలార్డ ర్‌లో 30 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. మూడో స్థానంలో 4 మ్యాచ్‌లు ఆడిన రోహిత్.. కేవలం ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేసి 107 పరు గులే చేశాడు. నాలుగో స్థానంలో ఒకే ఒక్క మ్యాచ్ ఆడిన రోహిత్ 4 పరుగులే చేశాడు. ఐదో స్థానంలో 9 మ్యాచ్‌లు ఆడిన రోహిత్.. 3 హాఫ్ సెంచరీలతో 437 రన్స్ కొట్టాడు. ఆరో స్థానంలో 16 మ్యాచ్‌లు ఆడిన రోహిత్.. 3 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీ లతో 1037 రన్స్ చేశాడు. మిడిలార్డర్‌లో రోహిత్ నాలుగు సార్లు డకౌటయ్యాడు. పింక్ బాల్ టెస్ట్ లోనూ రోహిత్ శర్మ 6వ స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. రోహిత్ 6వ స్థానంలో బ్యాటింగ్ చేస్తేనే.. నాథన్ లయన్‌ను సమర్థవంతంగా ఎదు ర్కొంటాడని భావిస్తున్నారు.

## చరిత్ర సృష్టించిన 'సన్‌రైజర్స్' హైదరాబాద్ బ్యాటర్..




టీమిండియా యువ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్‌కు సారథ్యం వహిస్తున్న అభిషేక్ శర్మ.. మేఘాలయతో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 11 సిక్సర్లతో వీరవిహారం చేశాడు. 28 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. తద్వారా టీ20ల్లో భారత్ తరఫున అత్యంత వేగంగా సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. భారత్ తరఫున గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ కూడా 28 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. అతను కూడా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనే ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 11 సిక్సర్లు బాదిన అభిషేక్ శర్మ.. టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న అత్యధిక సిక్స్‌ల రికార్డ్‌ను అధిగమించాడు.ఈ ఏడాది అభిషేక్ శర్మ 38 టీ20 ఇన్నింగ్స్‌లు ఆడి 87 సిక్సర్లు బాదాడు. రెండేళ్ల క్రితం 2022లో సూర్యకుమార్ యాదవ్ 41 ఇన్నింగ్స్‌ల్లో 85 సిక్సర్లు బాదాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మేఘాలయ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 142 పరుగులు చేసింది. మేఘాలయ ఇన్నింగ్స్‌లో అర్పిత్ భటేవారా(31) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం పంజాబ్.. అభిషేక్ శర్మ విధ్వంసకర శతకంతో 9.3 ఓవర్లలోనే విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

## 100 పరుగులకే ఆలౌట్

### తొలి వన్డేలో మహిళా భారత జట్టు ఓటమి!




ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత మహిళా జట్టు పరాజయం చూసింది. ఈ పోరులో ఆతిథ్య ఆస్ట్రేలియా, భారత మహిళా జట్టును 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా 100 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా కూడా తడబాటుకు గురైంది. లక్ష్యం 101 పరుగులే కావడం వల్ల వికెట్లు పడినా కూడా ఆస్ట్రేలియా పెద్దగా ఇబ్బంది పడలేదు. కేవలం 16.2 ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు జార్జియా వోల్ (46; 42 బంతులు 6 ఫోర్లు, 1 సిక్స్), ఫోబ్ లిట్చ్ ఫీల్ (35; 29 బంతులు 8 ఫోర్లు) మంచిగానే రాణించారు. ఎల్లిస్ పెర్రీ, బెత్ మూనీ, అన్నాబెల్ సుదర్‌ల్యాండ ఆష్లేగ్ గార్డ్నర్, తాహ్లియా మెక్‌గ్ర విఫలమయ్యారు. భారత బౌలర్లలో రేణుకా ఠాకూర్ 3, ప్రియా మిశ్రా 2 వికెట్లు పడగొట్టారు. భారత్ డౌన్ కెరీర్‌లో మొదటి వన్డే ఆడుతోన్న ఆస్ట్రేలియా బౌలర్ మెగాన్ స్కట్ (5/19) ఐదు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టింది. భారత్ బ్యాటర్లను బెంబేలెత్తించింది. భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ (23) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెతో పాటు హర్లీన్ డియోల్ (19), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (17), రిచా ఘోష్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. ఓపెనర్లు ప్రియా పునియా (3), స్మృతీ మంధాన (8), దీప్తి శర్మ (1), సైమా ఠాకూర్ (4), టిటాస్ సధు (2), ప్రియా మిశ్రా (0) పరుగులు చేశారు ఆసీస్ బౌలర్లలో మెగాన్ స్కట్ (6.21195) వికెట్లు పడగొట్టగా, కిమ్ గార్త్, గార్డెనర్, సదర్లాండ అలానా కింగ్ తలో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో భారత్ మహిళ జట్టు మూడు వన్డేల మ్యాచ్ ఆడనుంది. రెండో వన్డే బ్రిస్బేన్ వేదికగా డిసెంబర్ 8న జరుగనుంది. మూడో మ్యాచ్ డిసెంబర్ 11న నిర్వహించనున్నారు.

రీల్



## ఓటీటీలో దేవరకి సెన్సేషనల్ రెస్పాన్స్..

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం దేవర కోసం తెలిసిందే. అయితే ఈ చిత్రం పార్ట్ 1 గా మొదట థియేటర్స్ లోకి వచ్చి సోలోగా ఎన్టీఆర్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలిచి అదరగొట్టింది. ఇక ఈ చిత్రం థియేటర్స్ లో మంచి వసూళ్ల తర్వాత ఓటీటీలో రిలీజ్ కి వచ్చింది. అయితే ఈ సినిమా థియేటర్స్ తర్వాత ఓటీటీలో వచ్చి అదరగొట్టింది. దిగ్గజ స్ట్రీమింగ్ యాప్ నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కి వచ్చిన ఈ చిత్రం ఇపుడు ఓటీటీలో సాలిడ్ రెస్పాన్స్ ని అది కూడా గ్లోబల్ లెవెల్లో అదరగొడుతున్నట్టుగా మేకర్స్ చెబుతున్నారు. అయితే ఈ సినిమాని ఇటీవల గ్లోబల్ భాషల్లో కూడా స్ట్రీమింగ్ కి తీసుకురాగా లేటెస్ట్ గా అయితే నాలుగు వారాలు కంటిన్యూగా నెట్ ఫ్లిక్స్ లో పలు దేశాల్లో ట్రెండ్ అవుతున్న సినిమాగా దేవర నిలిచినట్టు మేకర్స్ చెప్తున్నారు. మరి దేవర 2.8 మిలియన్ వ్యూస్ అలాగే 8.1 మిలియన్ హావర్స్ స్ట్రీమింగ్ చేసినట్టుగా తెలుపుతున్నారు. ఇలా మొత్తానికి అయితే దేవర సినిమా ఓటీటీలో కూడా మంచి రెస్పాన్స్ తో దూసుకెళ్తుంది అని చెప్పాలి.



## పుష్ప–2 అల్లు అర్జున్ విశ్వరూపం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటించిన లేటెస్ట్ అవైటెడ్ సినిమానే పుష్ప 2. దర్శకుడు సుకుమార్ తో చేసిన ఈ క్రేజీ అండ్ మ్యాడ సీక్వెల్ కోసం అభిమానులు పాన్ ఇండియా ఆడియెన్స్ ఓ రేంజ్ లో ఆసక్తిగా ఎదురు చూడగా ఎట్టకేలకు సినిమా థియేటర్స్ లో పడిపోయింది. గతంలో పార్ట్ 1 కి బన్నీ ఏ రకంగా తన పెర్ఫార్మన్స్ తో మెస్మరైజ్ చేసాడో ఈసారి అంతకు మించి అందించాడు అని చెప్పడంలో సందేహం లేదు. మెయిన్ గా అల్లు అర్జున్ నటనా విశ్వరూపం సినిమాలో ఎవరి కళ్ళు తిప్పుకొనివ్వకుండా చేస్తుంది. ఆ జాతర సీక్వెన్స్ కానీ క్లైమాక్స్ ఎపిసోడ్ లో తన ఎమోషనల్ అండ్ ఇంటెన్స్ పెర్ఫామెన్స్ లు గాని అల్లు అర్జున్ కి స్పెషల్ అప్లాజ్ ని తీసుకొస్తాయి అలాగే ఈసారి కూడా డెఫినెట్ గా నేషనల్ అవార్డ్ బన్నీకి వచ్చినా ఆశ్చర్యం లేదనే చెప్పాలి. ఆ రేంజ్ లో బన్నీ ఈ సినిమాకి ప్రాణం పెట్టేసాడు.




## 'జటాయు' పవర్ చూపెట్టనున్న విజయ్ దేవరకొండ..?

టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాను విడి12 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సరికొత్త లుక్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఇక ఈ సినిమాతో బాక్సాఫీస్ దగ్గర విజయ్ దేవరకొండ సాలిడ్ సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, విజయ్ దేవరకొండ నెక్స్ట్ మూవీకి సంబంధించి సినీ సర్కిల్స్‌లో ఓ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. విజయ్ దేవరకొండ తన నెక్స్ట్ చిత్రాన్ని క్లాసిక్ చిత్రాల దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి డైరెక్షన్‌లో చేయబోతున్నాడట. గతంలో ఇంద్రగంటి 'జటాయు' అనే పవర్‌ఫుల్ కథను విజయ్‌కి నెరేట్ చేశారని.. ఇప్పుడు ఈ సినిమాను తన నెక్స్ట్ చిత్రంగా విజయ్ తెరకెక్కించేందుకు ఆసక్తిగా ఉన్నాడని టాక్ వినిపిస్తోంది.ఈ సినిమా టైటిల్ 'జటాయు' మాత్రమే కాదు.. ఇందులో విజయ్ చేయబోయే పాత్ర కూడా చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ సర్కిల్స్ టాక్. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే.

### గ్రేటర్ హైదరాబాద్‌పై కాంగ్రెస్ సర్కార్

# వరాల జల్లు

**గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.5,942 కోట్లు విడుదల**
**భారీ ఫ్లైఓవర్లు, రోడ్డు విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్**
**ఇక ఊపందుకోనున్న ప్రాజెక్టు పనులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌పై కాంగ్రెస్ సర్కార్ వరాల జల్లు కురిపించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జిహెచ్ ఎంసి) చేపట్టే ప్రాజెక్టులకు భారీ మొత్తంలో రూ.5,942 కోట్ల నిధులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టులు నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ ఇన్నొవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్‌సిటీ) ప్రాజెక్టుల్లో భాగంగా చేపట్టనున్న ఫ్లైఓవర్ల నిర్మాణం, రహదారుల విస్త రణ కోసం రూ.5,942 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నిధులకు పరిపాలన అనుమతులు ఇస్తూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే టెండర్లు ఆహ్వానించి, ఈ నిధులతో పనులు చేపట్టాలని ఉత్తర్వులలో ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజాపాలన విజయోత్సవాల్లో హెచ్‌సిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెల్సిందే. తాజాగా జిహెచ్‌ఎంసిలోని ఆరు జోన్‌లలో 5 ప్యాకేజీల్లో చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా సికింద్రాబాద్ జోన్‌లోని ఏటిసి సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం కోసం అత్యధికంగా రూ.940 కోట్లు విడుదలకు అనుమతులు ఇచ్చింది. శేరిలిం గంపల్లి జోన్‌లో ఖాజాగూడ, ఐఐఐటి జంక్షన్, విప్రో జంక్ష న్‌ల అభివృద్ధికి రూ.837 కోట్లు, మీయాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి అల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు లేన్‌ల ఫ్లైఓవర్, లింగం పల్లి నుంచి గచ్చిబౌలి వైపు మూడు వరుసలతో అండర్‌పాస్ నిర్మాణానికి రూ.530 కోట్లు విడుదల చేసింది. ఎల్.బి.నగర్ జోన్‌లో టికెఆర్ కాలేజీ జంక్షన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు ఆరు లేన్‌ల ఫ్లైఓవర్ కోసం రూ.416 కోట్లు, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్ నగర్ జంక్షన్ వరకు మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.398 కోట్లు, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, హాఫీజ్ బాబాన గర్, శాస్త్రీపురం జంక్షన్‌ల రోడ్డు విస్తరణకు రూ.594 కోట్లు, విడుదల చేస్తూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల లేమితో ఇప్పటి వరకు ప్రాజెక్టు పనుల విషయంలో అధికార వర్గాల్లో సిదిగ్ధత నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రాజెక్టు పనులు ఊపందు కోనున్నాయి.

### చట్టాలు, సమాజం పట్ల

# విద్యార్థుల్లో అవగాహన

**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులు చట్టాలతో పాటు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర ఛైర్మన్ మామిడి రిషికేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 300 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ శాసనసభ పనితీరును విద్యార్థులకు వివరించారు. యువత డ్రగ్స్ భారిన పడకుండా జీవితంలో ఉన్నత శిఖరాలకు వెళ్లా లని, బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పియుసి ఛైర్మన్ శంకరయ్య మాట్లాడుతూ జవహర్ బాల్ మంచ్ ఆధ్వ ర్యంలో అసెంబ్లీ సందర్శన ద్వారా విద్యార్థిని, విద్యార్థులు కింది స్థాయిలో గ్రామ, మండల, జిల్లా పరిషత్తుల చట్టసభ లపై కూడా అవగాహన పెంచుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. రిషికేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూరైన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి మండలికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, సేట్ట్ కో ఆర్డినేటర్లు జిట్టా సునిల్ కుమార్, అంబటి తులసి, వికారా బాద్ జిల్లా చైర్మన్ రాఘవేంద్ర గౌడ్, మంచిర్యాల జిల్లా కో ఆర్డినేటర్ సాయి కృష్ణ, రాహుల్ సింగ్ తదితరు పాల్గొన్నారు.

## నేడు 'శంభు నుండి ఢిల్లీ'కి..

(మొదటి పేజీ తరువాయి)

ఉండదని మా నాయకులు చెబుతున్నారని చెప్పారు. ఇదిలా ఉంటే రైతుల ఢిల్లీ మార్చ్ ప్లాన్ నేపథ్యంలో అంబాలా పోలీ సులు హైఅలర్ట్ ప్రకటించారు. అంబాలా జిల్లా ఎస్‌పి సహా సీనియర్ పోలీస్ అధికారులు అందరినీ సరిహద్దు ప్రాంతా నికి పంపించి భద్రతను అంచనా వేసి దానికి సంబంధించిన ఒక లెక్క చెప్పాలని కోరారు. హర్యానా వైపు సరిహద్దులో కేంద్ర పారామిలిటరీ బలగాలను సైతం అధికసంఖ్యలో మోహరింపజేశారు. తమ మార్చ్‌పై పునరాలోచించాలని, ఢిల్లీ పోలీసుల అనుమతి పొందిన తర్వాతనే ఏదైనా చర్య తీసుకోవాలని అంబాలా పోలీసులు బుధవారం కోరిన విషయం తెలిసిందే. అయితే పరిపాలనా యంత్రాంగం ఇప్ప టికే భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163ను విధించింది.అంబాలా జిల్లా పరిధిలో ఐదుగురు లేదా అంత కుమించి వ్యక్తులు గుమిగూడటంపై ఆంక్షలు విధించింది. నిరసన ప్రదేశంలో ఆంక్షలు అతిక్రమించిన వారికి నోటీ సులు జారీ చేశారు. అది మనకు పంజాబ్‌హర్యానా సరిహద్దు మాదిరిగా కనిపించడంలేదని, కానీ ఒక అంతర్జాతీయ ప్రాదే శికంగా మాత్రం కనిపిస్తోందని, ఒకవేళ వారు వారి మార్గం లోనే వెళ్లాలని అనుకుంటున్నారేమో కానీ వారినే కాదు కనీసం ఒక పక్షిని కూడా ఆ మార్గం నుంచి దాటనీయమని సర్వన్‌సింగ్ పంధేర్ విలేకరులకు చెప్పారు. హర్యానాలోని ఖనౌరీ సరిహద్దునుండి కవాతుకు ఇంకా ప్రణాళిక లేదని చెప్పారు. ఖనౌరీ సరిహద్దు ప్రాంతం నుంచి ఢిల్లీకి కవాతు సాగడానికి మేం ఎలాంటి ప్రకటనా చేయలేదని, అయినప్ప టికీ అక్కడ పోలీసులు భారీగా మోహరించారని పంధేర్ తెలి యజేశారు.అంతకు ముందు రోజు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మన్ దీప్ సింగ్ సిద్ధు (పాటియాలా రేంజి), పాటియాలా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నానక్ సింగ్ శంభు సరిహ ద్దులో సర్వన్‌సింగ్ పంధేర్‌ను, సుర్జీత్‌సింగ్ ఫుల్‌ను కలిశారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ కింద రైతులు సమీకరించబడి దేశ రాజధాని ఢిల్లీకి కాలినడకన కవాతు నిర్వహించాలని ప్రకటన చేసిన విషయం విదితమే. రైతుల పంటకు కనీసమద్దతు ధరపై లీగల్ గ్యారెంటీ, వారికి సంబంధించిన పలు డిమాండ్లపై ఈ నిరసన కవాతుకు పిలుపునిచ్చారు. సిద్ధు మాట్లాడుతూ రైతులు తమ ట్రాక్టర్‌ట్రాలీలను తీసుకురామని పోలీసులకు హామీ ఇస్తున్నారని, వారు కాలినడకన మాత్రమే కవాతు చేస్తారని 'మార్చర్ల' గురించి తెలియజేశారు. నిరసన తెలియ జేస్తున్న రైతులు శంభుఖనౌరీ సరిహద్దులైన పంజాబ్‌హ ర్యానా మధ్య శిబిరాలు ఏర్పాటు చేసుకోగా ఫిబ్రవరి 13న పోలీసులు తొలగించారు. ఆ తర్వాత వారిమార్చ్ ఢిల్లీకి సాగుతుండగా భద్రతా బలగాలు నిలిపివేశారు. అయితే ఇంతకు ముందే రైతు నేతలు రైతుల జాతాకు సత్నామ్ సింగ్ పన్ను, సురిందర్ సింగ్ చౌతాలా, సుర్జీత్ సింగ్ ఫుల్, బల్జీం దర్ సింగ్ నాయకత్వం వహిస్తారని ప్రకటించిన విషయం తెలిసిందే. రాళ్లదాడినుంచి రక్షించుకోవడానికి పోలీసులు స్టీల్ మెష్‌ను ఏర్పాటు చేశారు. అంబాలా అధికార యంత్రాంగం ఇంకా అక్కడ బారికేడ్లను ఎత్తివేయనేలేదు. ఫిబ్రవరి 21న ఖనౌరీ సరిహద్దులోనిరసనకారులు ఢిల్లీకి వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు జరిగిన ఘర్షణలో భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించినప్పుడు పంజాబ్‌కు చెందిన శుభకరన్ సింగ్ అనే రైతు మరణించిన విష యం తెలిసిందే. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)తో పా టు, రైతులు, రైతు కూలీలకు వ్యవసాయ రుణమాఫీ పెన్షన్, విద్యుత్ ఛార్జీల పెంపుదల, పోలీసు కే సుల ఉపసంహరణ, 2021న లఖింపూర్ ఖేరీ హిం సాకాండలో బాధితులకు న్యాయం చేయాలని రైతు లు డిమాండ్ చేస్తున్నారు. భూసే కరణ చట్టం2013 ను పునరుద్ధరించడం, 202021సంవత్స రంలో ముం దస్తు ఆందోళనలో మరణించిన రైతుల కుటుం బాలకు నష్టపరిహారం అందించడం కూడా వారి రెండు డిమాండ్లుగా ఉన్నాయి.

## కాళేశ్వరం నీరు లేకున్నా.. సాగు భళా

(మొదటి పేజీ తరువాయి)

నియమించింది.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగునీటిని అందించే ప్రాజెక్టు-లపై దృష్టి**

గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రాధాన్యమిచ్చింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులపైనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి కేంద్రీకరిం చారు. నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజీ 2, సదర్‌మట్ ప్రాజెక్టులపై ముందుగా ఫోకస్ చేసింది. రూ.241 కోట్ల ఖర్చుతో దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా పనులు ప్రారంభించింది. 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి బేసిన్‌లో ఉన్న చిన్న కాళేశ్వరం, మోదికుంట, లోయర్ పెన్‌గంగా, చనాక కోరాట, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టు, కృష్ణా బేసిన్‌లో కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వ కుర్తి, డిండి, ఎస్‌ఎల్‌బిసి పనులు ఈ ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. ఏడు జిల్లాలను సస్యశ్యామలం చేసే దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టుకు అవసరమైన 2,947 ఎకరాల భూసేకరణ చేపట్టి 89,312 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేం దుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం మొట్ట మొదటగా కొబ్బరికాయ కొట్టి అసంపూర్తిగా వదిలేసిన పాల మూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ఆర్థిక సాయం అందించాలని అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. 'ప్ర ధానిమంత్రి కృషి సించాయి యోజన పథకం'లో ఈ ప్రాజె క్టును చేర్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

**లక్ష ఎకరాలకు సాగునీటితో రికార్డు**

ఆగస్ట్ 15వ తేదీన ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభించారు. గత ప్రభుత్వం రూ.7400 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వకుండా వదిలేసిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం రూ.482.87 కోట్లతో ఎనిమిది నెలల్లోనే పూర్తి చేసింది. 9 కిలోమీటర్ల రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సీతారామ నీటిని నాగార్జునసా గర్ కెనాల్‌కు అనుసంధానం చేసి లక్షన్నర ఎకరాలకు సాగు నీరు అందించడం రికార్డు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు తో పాటు సీతారామ లిఫ్ట్, సమ్మక్కసారక్క ప్రాజెక్టు కు అవసరమైన అనుమతులను తెచ్చుకునేందుకు ప్రభుత్వం కేంద్రంతో, మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది.

**2027 సెప్టెంబర్ నాటికి ఎస్‌ఎల్‌బిసి పూర్తికి చర్యలు**

ఉమ్మడి నల్గొండ జిల్లాకు సాగునీటితో పాటు ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే ఎస్‌ఎల్‌బిసి ప్రాజె క్టును గత ప్రభుత్వం విస్మరించింది. ఎస్‌ఎల్‌బిసి పనులను ప్రజా ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. సాంకేతిక నిపుణు లతో కమిటీ వేసి అత్యాధునిక యంత్ర పరికరాలను విదేశాల నుంచి తెప్పించింది. 2027 సెప్టెంబర్‌లోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో రూ.4,658 కోట్లు కేటాయించింది. 2014కు పూర్వం ప్రతిపాదించిన నారాయణపేట్‌కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులకు ఫిబ్రవరి నెలలోనే ప్రజా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు మక్తల్, నారాయ ణపేట్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, తాగు నీటిని అందించే ఈ ప్రాజెక్టుకు రూ.4350 కోట్లు కేటాయిం చింది.

**కాళేశ్వరం నీరు లేకుండానే రికార్డు స్థాయిలో పంటలు**

కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క నీళ్లు లిఫ్ట్ చేయకుండానే ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టుల కింద రికార్డు స్థాయిలో పంటలు సాగయ్యాయి. ఈ వానాకాలంలో 67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 153 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి జర గడం విశేషం. రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధిక రికార్డు. యాసం గిలో కూడా 42.11లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వం ఇటీవలే సాగునీటి ప్రణాళికను విడుదల చేయడం గమనార్హం. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ బరాజ్ గతేడాది అక్టోబర్‌లో కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో బుంగలు పడి ప్రమాదకర పరిస్థితి తలెత్తింది. లోపాలను గుర్తించి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యల బాధ్యతను నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ(ఎన్‌డిఎస్‌ఎ)కి అప్పగించింది. ఎన్‌డిఎస్‌ఎ నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికలోని సిఫార సుల ఆధారంగా వానాకాలం ప్రారంభానికి ముందే బరాజ్ లకు అత్యవసర మరమ్మతులు నిర్వహించింది. జియోఫిజి కల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించింది. కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రాష్ట్రంలో పంటల సాగువిస్తీర్ణం పెరిగిందని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ఎన్డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం ఈ ఏడాది మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్లో చుక్క నీటిని నిల్వ చేయలేదు.

**కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టుల పూర్తి లక్ష్యంగా ముందుకు**

కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు న్యాయపరంగా రావా ల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని, ఈ నీటిని వినియో గించేలా చేపట్టిన అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. నీటి వాటాలు, గోదావరి కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు ఇంతకాలం జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారం చేపట్టి నప్పటి నుంచీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో అడుగు లేస్తున్నారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా, ఏపిలో కేవలం 30 శాతం ఉంది. అంతర్జా తీయ నీటి సూత్రాల ప్రకారం కృష్ణా జలాల్లోని 1005 టీఎం సీల్లో 70 శాతం రాష్ట్ర వాటా సాధించేలా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధి కారులను ఆదేశించటం గమనార్హం.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com